ప్రజాపక్షం 7th ANNIVERSARY 22nd October, 2025

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


మాగంటి గోపినాథ్ మృతిపై అనుమానాలు
03
స్వీయ అవగాహనతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట


సంపుటి 08, సంచిక: 339 | సోమవారం | 10-11-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# సెంటిమెంటా.. డెవలప్‌మెంటా?

‘కెటిఆర్ జాతకంలో అధికార యోగం అనే రేఖే లేదు. ఆయన దశ బాగోలేనప్పుడు తండ్రి కెసిఆర్ ఎన్ని దిశలు మార్చినా ప్రయోజనం ఉండదు. పుత్ర వాత్సల్యంతో కెసిఆర్ ధృతరాష్ట్రుడిలా మారారు. కెటిఆర్ ఎన్నికల ప్రచారం చూస్తుంటే ‘పుష్ప’ సినిమాలోని శ్రీలీల ఐటమ్ సాంగ్ గుర్తుకొస్తోంది.

ఎవరిది అగ్రికల్చరో, ఎవరిది డ్రగ్స్ కల్చరో ప్రజలు ఆలోచించుకోవాలి. గల్లీ గల్లీలో గంజాయి కల్చర్ తీసుకొచ్చింది ఎవరో ఆలోచించాలి. ఉపఎన్నికల్లో పోటీ పెట్టే విషసంస్కృతిని తీసుకొచ్చిందే కెసిఆర్ గతంలో పిజెఆర్ చనిపోయినప్పుడు కెసిఆర్ అభ్యర్థిని నిలబెట్టి ఎన్నికలు తెచ్చారు. రాంరెడ్డి వెంకటరెడ్డి విషయంలోనూ అదే విష సంస్కృతి అవలంబించారు.’

## 2034 వరకు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పాలన



- హైదరాబాద్‌ను అభివృద్ధి చేసే బాధ్యత నాదే
- జిహెచ్ఎంసిలో కంటోన్మెంట్ విలీనం అయ్యే ప్రక్రియ కొనసాగుతుంది
- ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణం ప్రారంభమైంది
- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయం
- బిఆర్ఎస్ కూలిపోతుంటే.. మౌనంగా కుమిలిపోతున్న కెసిఆర్
- కెటిఆర్ తన భాష, అలవాట్లు మార్చుకోవాలి
- ‘మీట్ ది ప్రెస్’లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్

‘రాసి పెట్టుకోండి... వచ్చే 2034 జూన్ వరకూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పాలనే’ ఉంటుంది అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. రాబోయే 10 సంవత్సరాలు ప్రజా ప్రభుత్వం కొనసాగుతుందన్నారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసే బాధ్యత తనపై ఉందన్నారు. సెంటిమెంటా, డెవలప్ మెంటా, జూబ్లీహిల్స్ ప్రజలు తేల్చుకోవాలన్నారు. మాజీ సిఎం కెసిఆర్ పథకాలను కొనసాగిస్తూ అదనంగా అనేక కొత్త పథకాలు తెచ్చానని తెలిపారు. హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణాలో ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ‘మీట్ ది ప్రెస్’ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ హాజరవ్వగా, సీనియర్ తరువాయి 2లో

### కిషన్ రెడ్డి గుజరాత్‌కు గులాం, కెటిఆర్‌తో సావాసం..

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారు. కిషన్ రెడ్డి గుజరాత్ గులాం అయ్యాడన్నారు. కెటిఆర్‌తో చేతులు కలిపాడని విమర్శించారు. బిజెపి, బిఆర్ఎస్ ఫెవికాల్ బంధంతో ఉన్నాయని, ఇద్దరూ కలసి అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. బిఆర్ఎస్‌ను తీవ్రంగా వ్యతిరేకించే ఎంపిలు విశ్వేశ్వర్ రెడ్డి, అరవింద్, ఈటల రాజేందర్‌లను జూబ్లీ హిల్స్ ప్రచారంలో ఎందుకు దూరంగా ఉంచారని ప్రశ్నించారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌ని చివరి నిమిషంలో ప్రచారంలో దించారన్నారు. కేవలం బిఆర్ఎస్‌ను గెలిపించేందుకే కిషన్ రెడ్డి లోపాయికారిగా మద్దతిస్తున్నారన్నారు.

# గప్‌చుప్..



## ఎన్నికల ప్రచారానికి తెర : మూగబోయిన మైకులు

### జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ హోరాహోరీ ప్రచారం

ప్రజాపక్షం/హైదరాబాద్




జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో ప్రధాన పార్టీల ప్రచారం ముగిసింది. బరిలో ఉన్న అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్దేశించేందుకు ఇక ఓటరు తీర్పే మిగిలి ఉంది. ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు మొత్తం 58 మంది పోటీ పడుతున్న ఈ ఉపఎన్నికల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. కాగా సరిగ్గా ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు మైకులు మూగబోయాయి. దాదాపు 17 రోజుల పాటు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం కొనసాగింది. ర్యాలీలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారాలతో ప్రధాన పార్టీల నాయకులు హోరెత్తించారు. గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగిన ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి చివరిరోజు భారీ ర్యాలీలు, రోడ్ షోలతో ప్రచారాన్ని ముగించాయి. ఎన్నికల ప్రచారంలో ప్రధాన పార్టీల నాయకులతో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సాయంత్రం 5 గంటల తర్వాత జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పలు జిల్లాల నుంచి వచ్చిన పార్టీల నాయకులందరూ తిరిగి వెళ్లిపోవాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఇప్పటికే తెలిపారు. జూబ్లీహిల్స్‌లో గెలుపు ప్రతిష్టాత్మకంగా మారడంతో అధికార పార్టీ కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలైన బిఆర్ఎస్, బిజెపి జోరుగా ప్రచారం చేశారు. ఇప్పుడు ప్రచార గడువు ముగియడంతో చివరి అస్త్రంగా పోల్ మేనేజ్‌మెంట్‌పై పార్టీలు దృష్టి సారించాయి. జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గంలో చివరిరోజైన ఆదివారం కూడా కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం నిర్వహించింది. ఇందుకోసం మంత్రుల ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి, రెండేండ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి ఓట్లు అభ్యర్థించారు. ఈ ఉప ఎన్నికలో గెలవడం ద్వారా ప్రతిపక్షాల విమర్శలకు జెవాబు చెప్పాలని కాంగ్రెస్ పట్టుదలగా ఉంది. సిఎం తరువాయి 2లో

### బిహార్‌లో ముగిసిన మాటల యుద్ధం

పాట్నా : బిహార్‌లో హోరాహోరీగా జరిగిన రెండవ, చివరి దశ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఆదివారం సాయంత్రం ముగిసింది. రాష్ట్రంలో అధికారం కోసం పోటీ పడుతున్న ప్రత్యర్థుల మధ్య దాదాపు నెలరోజుల పాటు తీవ్రమైన మాటల యుద్ధం కొనసాగింది. నరాలు తెగే ఉత్కంఠతో ప్రచారం కొనసాగింది. రికార్డు స్థాయిలో 65 శాతం పోలింగ్ నమోదు చేసిన మొదటి దశ ఎన్నికలు నవంబర్ 6న జరగగా, రెండవ దశకు పోలింగ్ 11న జరుగుతుంది. 14న ఓట్ల లెక్కింపు చేయనున్నారు. రెండవ దశలో 122 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మొదటి రౌండ్‌లో 121 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ జరిగింది.



అయితే రెండవ విడతలో ఎన్నికలు జరగనున్న ముఖ్యమైన స్థానాల్లో చకైలో జెడి(యు) మంత్రి సుమిత్ కుమార్ సింగ్, జముయిలో బిజెపి ఎమ్మెల్యే శ్రేయసి సింగ్, ధమ్‌దహాలో జెడి (యు) మంత్రి లేషి సింగ్, ఛతాపూర్‌లో బిజెపి మంత్రి నీరజ్ కుమార్ సింగ్ బరిలో ఉన్నారు. కాగా, ప్రచారం ముగింపు రోజున కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ముమ్మరంగా మాటల యుద్ధం సాగింది సీమాంచల్ ప్రాంతంలోని కిషన్‌గంజ్, పూర్నియా జిల్లాల్లో జరిగిన ర్యాలీలలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ప్రసంగించారు. ఇక్కడ ముస్లింలు గణనీయమైన జనాభా ఉన్నారు. వీరి మద్దతు ప్రతిపక్ష భారత కూటమికి చాలా ముఖ్యమైనది. ఆయన మొత్తం 15 ఎన్నికల సమావేశాలలో ప్రసంగించారు. రెండు నెలల క్రితం ఆయన పక్షం రోజుల పాటు జరిగిన ఓటరు అధికార్ యాత్రకు నాయకత్వం వహించారు. ఎన్నికలు జరగనున్న రాష్ట్రంలో రోజుల తరబడి ఉంటూ, ఏ జాతీయ నాయకుడికీ లేని అత్యంత తీవ్రమైన ప్రచారాన్ని నిర్వహిస్తున్న షా, బిజెపి సాపేక్షంగా తరువాయి 2లో

# వేలకోట్ల రూపాయలతో మురికివాడల అభివృద్ధి

- జూబ్లీహిల్స్‌లో నవీన్‌ను గెలిపిస్తేనే సాధ్యం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి
- పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ అభివృద్ధిని గాలికొదిలేశారని విమర్శ
- డబుల్ బెడ్‌రూమ్‌లపై గులాబీ పార్టీ భ్రమలు కల్పించిందని మండిపాటు



ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించుకుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా మంత్రుల సమన్వయంతో నియోజకవర్గంలో వేలకోట్ల రూపాయల నిధులతో మురికివాడలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్న తపన, సత్తా, సంకల్పం ఉన్న నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే, రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి వసతి, రేషన్ కార్డులు వంటి పనులు వేగంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని, జూబ్లీహిల్స్ ప్రజలు నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని యూసుఫ్ గూడలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణా రావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి డిప్యూటీ సిఎం భట్టి మాట్లాడుతూ నవీన్ యాదవ్ స్థానికుడని, మంచి సేవకుడని, పదవి ఉన్నా, లేకున్నా స్థానికంగా సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టిన వ్యక్తి అని అన్నారు. పదేళ్ల తరువాయి 2లో




# పాటలు, నాటికల ద్వారా సిపిఐ వందేళ్ల చరిత్ర ప్రచారం

- ప్రజలను చైతన్యపర్చాలి
- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపు
- వందేళ్ల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించేలా అందరిని కలిపే అభ్యుదయ గీతాలాపన చేయాలి : చాడ

ప్రజాపక్షం/హైదరాబాద్

వందేళ్ల ‘భారత కమ్యూనిస్టు పార్టీ’ (సిపిఐ) చరిత్రను పాటలు, నాటికల ద్వారా ప్రజలకు తెలియజేస్తూ, చైతన్యపర్చాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ‘అరసం, తెలంగాణ ప్రజానాట్య మండలి’ సంయుక్త ఆధ్వర్యం లో సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా ఆదివారం రాష్ట్ర స్థాయి కవులు, కళాకారుల శిక్షణ తరగతుల ముగింపు సభలో పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడారు. దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీకి ఎనలేని చరిత్ర ఉందన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటం, తెలంగాణ సాయుధ పోరాటం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర పోరాటం, రావి నారాయణ రెడ్డి, మఖ్దూం మొయినుద్దీన్ , బద్దం ఎల్లా రెడ్డి వంటి అనేకమంది నిజాంకు వ్యతిరేకంగా చేసిన భూపోరాటాలు, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు, ప్రజల హక్కుల కోసం, కార్మికులు, విద్యార్థుల ఇలా తరువాయి 2లో

# ఓటు దొంగతనం కప్పిపుచ్చుకునేందుకే ‘సర్’

- ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణను సంస్థాగతీకరించేందుకు యత్నం
- ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ




పచ్‌మరి : ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్), ఓటు దొంగతనంపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మరోసారి మండిపడ్డారు. ఓటు దొంగతనాన్ని కప్పిపుచ్చుకునేందుకే సర్‌ను చేపడుతున్నారని విమర్శించారు. సర్‌ను సంస్థాగతీకరించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. మధ్యప్రదేశ్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణా శిబిరంలో పాల్గొనడానికి రాహుల్‌గాంధీ శనివారం మధ్యప్రదేశ్ నర్మదాపురంలోని కొండ ప్రాంత పట్టమైన పచ్‌మరికి విచ్చేశారు. అయితే ఆదివారం ఆయన మధ్యప్రదేశ్‌లోని పచ్‌మరిలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. హర్యానా మాదిరిగానే, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ లలో కూడా ఓటు దొంగతనం జరిగిందని తాను చాలా దృఢంగా విశ్వసిస్తున్నానన్నారు. ఓటు దొంగతనమే ఒక సమస్య అనుకుంటే దానికి తోడు ఇప్పుడు సర్‌కు దాపురించిందన్నారు. ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)ను ఈనెల 4న ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియ తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలోని 321 జిల్లాలు , 1,843 అసెంబ్లీ నియోజకవర్గాలలో దాదాపు 51 కోట్ల మంది ఓటర్లను కవర్ చేస్తుంది. కాగా, ‘కొన్ని రోజుల క్రితం నేను హర్యానాపై ఒక ప్రజెంటేషన్ ఇచ్చాను, ఓట్ల దొంగతనం జరుగుతున్నట్లు నేను స్పష్టంగా చూశాను... 25 లక్షల ఓట్లు దొంగిలించబడ్డాయి, 8 ఓట్లలో ఒకటి నకిలీ ఓటుగా తేలింది’ అని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ గణాంకాలను చూసిన తర్వాత మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లో కూడా అదే జరిగినట్లు దాను బలంగా నమ్ముతున్నానన్నారు. ఇదీ బిజెపి, ఎన్నికల కమిషన్ (ఎన్నికల కమిషన్) వ్యవస్థ అని ఆయన ఆరోపించారు. తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని చెప్పారు. వాటిని తరువాయి 12లో

### మోహన్ భాగవత్ వ్యాఖ్యలు

# సంఘ్ రక్షణకోసం చెప్పే వక్రభాష్యం

**సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శ**



**న్యూఢిల్లీ:** ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌కు ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ చెబుతున్న సమాధానం వారికి అలవాటైన,సంఘ్ రక్షణకోసం ఆడే సరికొత్త నాటకమని భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి డి. రాజా విమర్శించారు. ఆర్ఎస్ఎస్‌ను, దాని కార్యకలాపాలను రక్షించుకోవడంకోసం ఆత్మరక్షణకోఐసం తప్పుతోవ పట్టించేవిధంగా మోహన్ భాగవత్ వక్రభాష్యం చెబుతున్నారని విమర్శించారు.దేశంలో తరచు శాంతి భద్రతల సమస్య తలెత్తడానికి కారణమైన ఆర్ఎస్ఎస్‌ను నిషేధించాలని ప్రతిపక్షాలు కోరడంపై భాగవత్ స్పందిస్తూ, ఆర్ఎస్ఎస్‌ను ప్రతిపక్షాలు గుర్తింపు లేని సంస్థగా పేర్కొంటున్నాయని, అసలు గుర్తింపేలేని సంస్థను గతంలో ఏ విధంగా మూడుసార్లు నిషేధించారని, ఈ విధంగా నిషేధించడం అంటే ఆర్ఎస్ఎస్‌కు తరువాయి 12లో

# భారీ ఉగ్రదాడులకు కుట్ర

హైదరాబాద్ వ్యక్తి సహా ముగ్గురు ఉగ్రవాదుల అరెస్ట్



**అహ్మదాబాద్ /హైదరాబాద్:** దేశవ్యాప్తంగా ఉగ్రదాడులకు కుట్ర పన్నుతున్న ముగ్గురు ఉగ్రవాదులను అహ్మదాబాద్‌లో గుజరాత్ యాంటీటెర్రరిజం స్క్వాడ్ (ఎటిఎస్) అరెస్టు చేసింది. గత ఏడాది నుంచి నిందితులపై నిఘా పెట్టిన గుజరాత్ ఎటిఎస్, ఆయుధాలు సరఫరా చేస్తుండగా ముగ్గురిని అదుపులోకి తీసుకుంది. విచారణ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉగ్రదాడులకు వీరు ప్రణాళిక చేస్తున్నట్టు గుర్తించింది. నిందితుల వద్ద నుంచి రెండు గ్లోక్ పిస్టల్స్, ఒక బెరెట్టా పిస్టల్, 30 బుల్లెట్లు, 4 లీటర్ల ఆముదం తరువాయి 12లో

### ఐదు రాష్ట్రాల్లో టిజిసిఎస్‌బి ఆపరేషన్..

# 81 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు

**నిందితుల్లో బ్యాంక్ అధికారులు కూడా...**

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) అధికారులు ఐదు రాష్ట్రాల్లో 25 రోజుల పాటు సైబర్ నేరగాళ్లను పట్టుకునేందుకు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా 81 మంది నేరగాళ్లను అరెస్టు చేశారు. వీళ్లు దేశవ్యాప్తంగా 754 నేరాలకు పాల్పడగా తెలంగాణలో 128 నేరాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తరువాయి 12లో

### అణచివేత ప్రతిపాదిత చట్టాలను ప్రతిఘటిస్తూ

# కార్మికుల భారీ ప్రదర్శన

పోర్చుగల్ రాజధాని లిస్బన్‌లో వీధుల్లోకి వచ్చిన లక్షలాది మంది కార్మికులు




**లిస్బన్:** కార్మికులను అణచివేసేందుకు ఉద్దేశించిన ప్రతిపాదిత చట్టాన్ని ప్రతిఘటిస్తూ పోర్చుగల్ రాజధాని లిస్బన్‌లో కార్మికులు భారీ ప్రదర్శన జరిపారు. పోర్చుగల్‌లో అతిపెద్ద యూనియన్ సిజిటిపి నాయకత్వంలో ఈ ప్రదర్శనలు జరిగాయి. యాజమాన్యాలు చాలా సులభంగా కార్మికులను ఎలాంటి కారణం చెప్పకుండా ఉద్యోగాల నుండి తొలగించేందుకు వీలు కల్పించేందుకు చట్టాలను సవరించి కొత్త క్లాజులు చేర్చేందు కు చేసిన ప్రతిపాదనలను తీవ్రంగా ప్రతిఘటిస్తూ కార్మికు లు వీధుల్లోకి వచ్చారు. తమ హక్కులను కాపాడుకుంటామ ని నినాదాలు చేశారు. కార్మిక సంఘాలన్నీ మంగళవారంనాడు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపు ఇచ్చాయి. లిస్బన్‌లో ఆదివారం నాడు 1,00,000 మందితో భారీ ప్రదర్శన జరిగిందని రాయిటర్స్ వార్తాసంస్థ ప్రకటించింది. మెడికల్ డివైజ్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికుడు మిరైజ్ అల్వెస్ (31) మాట్లాడుతూ, కార్మికుల పని పరిస్థితులను అనేక సంవత్సరాలు వెనక్కు నెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నం చే స్తోందని విమర్శించారు. దీనివల్ల ఎవ్వరికీ ఉద్యోగ భద్రత ఉండదన్నారు. టెక్నీషియన్ మడలెనా తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## జపాన్‌లో భూకంపం : సునామీ హెచ్చరిక

రిక్టర్ స్కేలుపై 6.7 తీవ్రత

**టోక్యో:** జపాన్ ఉత్తర ప్రాంతంలో ఆదివారం సాయంత్రం తీవ్ర భూకంపం సంభవించింది. దీంతో సునామీ హెచ్చరిక కూడా జారీ చేశారు. ఇవాటే తీర ప్రాంతంలో సముద్ర ఉపరితలానికి 10 కి.మీ లోతున 6.7 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు జపాన్ భూభౌతిక, వాతావరణ విభాగం ప్రాథమికంగా అంచనా వేసింది. ఈ భూకంపంవల్ల ఎంత నష్టం జరిగిందనే విషయం వెంటనే తెలియరాలేదు. భూకంపం వచ్చిన ప్రాంతాల్లో రెండు అణు కర్మాగారాలు కూడా ఉన్నాయి. తీర ప్రాంతాలకు ప్రజలు దూరంగా ఉండాలని, సునామీ ప్రమాదం ఉందని జపాన్ న్యూస్ ఛానల్ ఎన్‌హెచ్‌కె ద్వారా హెచ్చరిక వెలువడింది.

## చైనా–భారత్ విమాన సేవలు పునఃప్రారంభం



**షాంఘై:** చైనా నుండి భారతదేశానికి విమాన సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. అదేవిధంగా భారత్‌కు చెందిన ఇండిగో విమాన సంస్థ కూడా నవంబరు 10వ తేదీ సోమవారం నుండి చైనాకు రోజువారీ ప్రాతిపదికపై ఎ 320 విమాన సర్వీసులను ప్రారంభిస్తుంది. చైనా మెయిన్ లాండ్‌లో విమాన రాకపోకల సేవలు నిర్వహించే ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ నేరుగా షాంఘై నుండి ఢిల్లీకి విమాన రాకపోకలను ఆదివారం ప్రారంభించింది. షాంఘైలోని పుడోంగ్ ఇంటర్నేషనల్ విమానాశ్రయం నుండి ఎంయు 563 ఫ్లయిట్ 248 మంది ప్రయాణికులతో ఆదివారం మధ్యాహ్నం 1.02 గంటలకు ఢిల్లీకి బయలుదేరింది. భారత్–చైనా మధ్య ఈ ఏడాదిలో మొదటిసారి విమానాల రాకపోకలను ప్రారంభించిన మొట్టమొదటి ఎయిర్‌లైన్స్ ఇదే.

షాంఘై–ఢిల్లీ మార్గంలో ఎయిర్ బస్ ఎ 330 వైడ్ బాడీ విమానం రాకపోకలు నిర్వహిస్తుంది. వారంలో మూడురోజులు అంటే బుధవారం, శనివారం, ఆదివారాలలో మూడుసార్లు ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ ఈ రెండు ప్రధాన నగరాల మధ్యా నేరుగా విమానాలు నడుపుతుంది. మార్కెట్ సర్వే ద్వారా లభించిన సమాచారం మేరకు క్రమంగా ఈ సేవలను విస్తృతం చేయాలని భావిస్తున్నట్లు ఒక ప్రకటనలో ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ పేర్కొంది. కున్మింగ్–కోల్‌కతా మార్గం, పుడోంగ్ షాంఘై–ముంబై మార్గాలలో కూడా విమాన సేవలను పునరుద్ధరించాలని ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ లక్ష్యనిర్దేశం చేసుకుంది. భారత్‌లో ఢిల్లీ, ముంబై, కోల్‌కతా నగరాలను కీలకమైన ఆర్థిక నగరాలుగా, సాంస్కృతికంగా, ఇతర రంగాలలో కూడా ఎక్కువ ప్రోత్సాహం లభించేందుకు అవకాశాలు పెరుగుతాయని ఈ సంస్థ గట్టిగా భావిస్తోంది. భారత్–చైనా మధ్య ఇటీవలి సంవత్సరాలలో ఉద్రిక్తతలు మెల్లిగా సడలిన తర్వాత ఈ ఏడాది అక్టోబరు 26వ తేదీన ఇండిగో విమాన సంస్థ కోల్‌కతా నుండి చైనాలోని గ్వాంగ్‌డాంగ్ రాష్ట్రంలో ఉన్న గ్వాంగ్‌జౌకు మొదటి విమానాన్ని నడిపింది. కరోనా మహమ్మారి తర్వాత భారత్ విమానం తిరిగి అక్కడ దిగడంతో రెండు దేశాల మధ్యా గగనతల రాకపోకలు పునరుద్ధరించినట్లయింది. సోమవారం నుండీ ఇక రోజువారీగా ఇండిగో సంస్థ సర్వీసులు నడుపుతుంది. కరోనా వచ్చిన తర్వాత ఈ సేవలు నిలిచిపోయాయి. ఆ తర్వాత రెండు దేశాలమధ్యా సైనిక సంఘర్షణ జరగడంతో ఈ సేవలకు సుదీర్ఘ అంతరాయం కలిగింది. 2020 జూన్‌లో గాల్వన్ లోయలో ఇరు దేశాల సైన్యాలమధ్యా ఘర్షణ జరగడంతో 1962 తర్వాత ఎన్నడూలేనంత క్షీణదశకు ఈ సంబంధాలు దిగజారాయి.

## ఫిలిప్పీన్స్‌కు మరో సూపర్ పవర్ తుఫాన్

10 లక్షల మంది ప్రజల తరలింపు



**మనీలా:** ఫిలిప్పీన్స్ దేశానికి కష్టాలమీద కష్టాలు ఎదురవుతున్నాయి. నిన్నమొన్నటిదాకా భారీ తుఫాను ఎదుర్కొన్న ఆ దేశం ఆ కష్ట నష్టాల నుండి బయట పడకముందే వారం రోజుల వ్యవధిలోనే మరో సూపర్ పవర్ తుఫానును ఎదుర్కోవలసి వస్తోంది. ఆదివారం ఉదయమే తూర్పు ఫిలిప్పీన్స్ ఈస్టర్న్ బైకోల్ ప్రాంతాన్ని కబళించింది. ఫంగ్–వాంగ్ అని పిలిచే ఈ సూపర్ పవర్ తుఫాను ఉద్ధృతవేగంతో దూసుకువచ్చింది. దీనికి ముందుగానే దాదాపు 10,00,0000 మంది ప్రజలను ఉత్తర ఫిలిప్పీన్స్ ప్రాంతం నుండి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మూడు రోజులక్రితం కల్మేగీ తుఫాను ఫిలిప్పీన్స్‌ను గడగడలాడించింది. అపారమైన నష్టాన్ని కలగజేసింది. ఈ తుఫానులో చిక్కుకుని 200 మంది ప్రజలు మరణించారు. వందల మంది గాయపడ్డారు. ఎక్కడపడితే అక్కడ ఇళ్ళు కూలిపోయాయి. అనేక నగరాలను, పట్టణాలను వరదలు ముంచెత్తియి. వాహనాలు కొట్టుకుపోయాయి. విరిగిన చెట్లు, ధ్వంసమైన ఇళ్లు అలాగే ఉన్న పరిస్థితుల్లో ఇంకా కూడదీసుకోకముందే మరో సూపర్ పవర్ తుఫాను చుట్టుముట్టింది. ఫిలిప్పీన్స్ ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 20కి పైగా భారీ తుఫానులను ఎదుర్కొంది. ప్రతి సంవత్సరం 20కి తక్కువ కాకుండా తుఫానులు ఆ దేశాన్ని పట్టి కుదిపివేస్తాయి. వాతావరణ మార్పుల కారణంగా ఫిలిప్పీన్స్ తీవ్రంగా నష్టపోతోంది. అందుకే దేశంలో ఎక్కువమంది ఇంకా పేదరికంలోనే జీవనం సాగిస్తున్నారు. దేశాధ్యక్షుడు ఒక ప్రకటన చేస్తూ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గంటకు 230 కి.మీ వేగంతో భీకరమైన గాలులు వీచే ప్రమాదం ఉందని, ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని కోరారు. ఒక ప్రకృతి వైపరీత్యాల నిధిని కూడా ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు అధ్యక్షుడు ప్రకటించారు. తక్షణ సహాయాన్ని యుద్ధ ప్రాతిపదికపై సరఫరాలు చేసేందుకు అధికారులకు మరిన్ని అధికారాలను సమకూర్చారు. ఇదిలా ఉండగా, బ్రెజిల్‌ను కూడా మరో తుఫాను అతలాకుతలం చేసింది. ఈ తుఫానువల్ల ఆరుగురు మరణించారు. మరో 750 మంది గాయపడ్డారు.

## బంగ్లాదేశ్‌లో టీచర్ల నిరసన


స్తంభించిన 65 వేల పాఠశాలలు



**ఢాకా:** టీచర్లపై షాబాగ్‌లో లాఠీచార్జిని వ్యతిరేకిస్తూ బంగ్లాదేశ్‌లో దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. వేలాదిమంది టీచర్లు వీధుల్లోకి రావడంతో 65,000 ప్రాథమిక పాఠశాలలు తెరుచుకోలేదు. విద్యాపరమైన కార్యకలాపాలన్నీ స్తంభించిపోయాయి. దేశ రాజధాని సెంట్రల్ షాహీద్ మినార్ వద్ద వేలాదిమంది టీచర్లు ఆదివారం ఉదయం నుండి బైఠాయించారు. వేతనాలు పెంచాలని, పదోన్నతులు ఇవ్వడంలో పాటిస్తున్న వివక్ష విధానాలకు స్వస్తి చెప్పాలని, సెకండరీ గ్రేడ్ టీచర్లతో సమానంగా తమకు కూడా సమాన ప్రతిపత్తి ఇవ్వాలని కోరుతూ వారు దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలకు దిగారు. హోమ్ మంత్రిత్వశాఖ సలహాదారులు, ప్రాథమిక, విద్యామంత్రిత్వశాఖ అధికారులు తక్షణం రాజీనామాలు సమర్పించాలని ప్రదర్శకులు నినాదాలు చేశారు. షాబాగ్‌లో శనివారం మధ్యాహ్నం టీచర్ల నిరసన ప్రదర్శన సందర్భంగా పోలీసులు దురుసుగా ప్రవర్తించి వాటన్ కేనన్స్ ప్రయోగించడంతోపాటు లాఠీచార్జి చేయడాన్ని ఖండిస్తూ ప్రధానంగా ఈ నిరసన ప్రదర్శన జరిగింది. ఈ లాఠీచార్జిలో 100 మంది పైగా టీచర్లు గాయపడ్డారు. టీచర్లకు సంబంధించిన మూడు డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ వేలాదిమంది వీధుల్లోకి రావడంతో పోలీసులు ఇష్టానుసారంగా లాఠీచార్జిచేశారు. దీంతో ప్రాథమిక ఉపాధ్యాయుల డిమాండ్ల అమలు మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుండే దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి.

## బొలీవియాలో మళ్ళీ పెట్టుబడిదారీ పరిపాలన

## అధ్యక్షుడుగా రోడ్రిగో ప్రమాణస్వీకారం



**లాపాజ్:** దక్షిణ అమెరికా దేశం బొలీవియా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ అనుకూల రోడ్రిగో పాజ్ పెరీరా (58) శనివారం (నవంబరు 8)న పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ఐదేళ్ళపాటు ఆయన అధికారంలో కొనసాగుతారు. ఈ ఏడాది ఆగస్టు 17వ తేదీన అధ్యక్ష పదవికి తొలి విడత ఎన్నికలు జరిగాయి. గత నెలలో రన్నాఫ్ ఎన్నికలు జరిగాయి. రన్నాఫ్‌లో రోడ్రిగోకు 54.89 శాతం ఓట్లు లభించాయి. దేశ 68వ అధ్యక్షుడుగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో పెట్టుబడిదారీ తరహా మార్కెట్ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరిస్తానని ప్రకటించారు. విదేశీ సంబంధాలను కూడా తిరగరాస్తామన్నారు. వ్యాపార వర్గాలకు అనుకూలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఇంధన రంగం జాతీయీకరణతో పాటు ఆర్థిక విధానాలను పునఃసమీక్షిస్తామని, విదేశాలతో దౌత్యస్థాయీ సంబంధాలను సమీక్షించి కొత్త నిర్ణయాలు తీసుకుంటామని రోడ్రిగో ప్రకటించారు.

బొలీవియా మాజీ అధ్యక్షుడు జైమ్ పాజ్ జమోరా పెద్ద కుమారుడు రోడ్రిగో. బొలీవియా క్రిస్టియన్ డెమోక్రటిక్‌పార్టీ (పిడిసి)కి చెందిన రోడ్రిగో 2020 నుండి 2025 వరకూ తరిజా నియోజకవర్గం నుండి సెనేటర్‌గా పనిచేశారు. 2015 నుండి 2020 వరకూ తరిజా మేయర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2002 నుండి 2010 వరకూ ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్‌కు ప్రాతినిధ్యం వహించారు. కాగా 2005 డిసెంబరులో జరిగిన ఎన్నికల్లో అధికారం తీసుకున్న ఎంఎఎస్–ఐపిఎస్‌పి (మూమెంట్ ఫర్ సోషలిజం) కి చెందిన కమ్యూనిస్టు ప్రభుత్వం నాలుగుసార్లు సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి పూర్తి మెజారిటీతో బొలీవియాను పరిపాలించింది. రాజకీయాలలో బహుళపార్టీ వ్యవస్థను ప్రోత్సహించింది. ఎవో మోరెల్స్ 2019లో పదవి నుండి వైదొలగిన తర్వాత మహిళా అధ్యక్షురాలు జీనిన్ అనెజ్ ఛావెజ్, ఆ తర్వాత లూయిస్ ఆర్స్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహించారు. 2025 ఎన్నికల్లో అధ్యక్ష పదవి అభ్యర్థిత్వం విషయంలో ఎవో మోరెల్స్‌కు, లూయిస్ ఆర్స్‌కు మధ్య తీవ్ర పోటీ ఏర్పడింది. తర్వాత మోరెల్స్ పోటీ నుండి తప్పుకున్నారు. కానీ ఆరోపణలకు గురైన ఆర్స్ ప్రజాభిమానం కోల్పోయి ఎన్నికల్లో ఓటమి చెందడంతో కమ్యూనిస్టుపాలన ముగిసింది.

## రాజ్యాంగ సవరణపై ఆందోళనకు ఇమ్రాన్‌ఖాన్ పార్టీ పిలుపు

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ చట్టసభలో శనివారం ప్రవేశపెట్టిన 27వ రాజ్యాంగ సవరణ, రాజ్యాంగంలోని 243వ నిబంధనకు సవరణలపై ప్రతిపక్ష నాయకుడు ఇమ్రాన్‌ఖాన్‌కు చెందిన పిటిఐపార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రధానంగా ఐదు అంశాలను తెరమీదకు తెచ్చి చర్చకు పెట్టింది. దేశవ్యాప్తంగా ఆందోళనకు అన్ని రాజకీయపార్టీలు సమాయత్తం కావాలని పిలుపు ఇచ్చింది. అదేవిధంగా ఇతర ప్రతిపక్షాలు కూడా ఆర్మీ జనరల్ ఆసిఫ్ మునీర్‌కు అపారమైన అధికారాలు కట్టబెట్టే ఆలోచనను తీవ్రంగా ఖండిస్తున్నాయి. దేశంలో ప్రజాస్వామ్యం ఇక అంతమైపోయే పరిస్థితి వచ్చిందని చట్టసభలో ఇమ్రామాన్‌ఖాన్ పార్టీకి చెందిన నాయకుడు, సెనేటర్ అలీ జాఫర్ విమర్శించారు. 1973 నాటి రాజ్యాంగంలోని మౌలిక స్ఫూర్తికి ప్రభుత్వం 27వ సవరణ ప్రతిపాదన ద్వారా తూట్లు పొడిచిందని విమర్శించారు. ఆదివారంనాడు అసాధారణ పద్ధతిలో సెనేట్ సమావేశం రెండోరోజు కూడా నిర్వహించారు. ఈ సమావేశంలో జాఫర్ మాట్లాడుతూ.. ఐదు ముఖ్యాంశాలను ప్రస్తావించారు. స్వయంప్రతిపత్తిగల రాష్ట్రాలతో కూడిన ఫెడరల్ పాకిస్థాన్, ప్రజలు ఎన్నుకున్న పార్లమెంటరీ వ్యవస్థ రెండింటినీ కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజల హక్కులకు హామీ ఇచ్చే స్వతంత్ర న్యాయవ్యవస్థను, ప్రజాస్వామ్యానికి న్యాయవ్యవస్థ ద్వారా లభించే హామీని, న్యాయ వ్యవస్థ స్వయంప్రతిపతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ విషయాల్లో ప్రభుత్వం రాజ్యాంగ సవరణల ద్వారా తప్పు చేస్తే యావత్ ప్రజాస్వామ్య సౌథం కుప్పకూలిపోతుందని ఆయన హెచ్చరించారు.

## డెవలప్‌మెంటా?

(మొదటి పేజీ తరువాయి)

జర్నలిస్ట్ రవికాంత్ రెడ్డి మీడియేటర్‌గా వ్యవహరించారు. మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పారు. కంటోన్మెంట్ జిహెచ్ఎంసిలో విలీనం అయ్యే ప్రక్రియ కొనసాగుతుందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కంటోన్మెంట్‌లో తాగునీటి సమస్య పరిష్కారించామని చెప్పారు. ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణం ప్రారంభమైందన్నారు.

**జూబ్లీహిల్స్ ఎన్నికలో కాంగ్రెస్ గెలుపు ఖాయం**

హైదరాబాద్‌ను అభివృద్ధి చేసే బాధ్యత తమపై ఉందన్నారు. జూబ్లీహిల్స్ గెలవాల్సిందే, అభివృద్ధి జరగాల్సిందేనని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని సిఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌నే కృషి చేస్తుందని, జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ముగ్గురు మంత్రులను ఇన్‌చార్జులుగా నియమించి, రూ.500 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. బిజెపికి డిపాజిట్ గల్లంతవుతుంది, కిషన్ రెడ్డి దోస్తు ఓడిపోవడం ఖాయమన్నారు.

**బిఆర్ఎస్ కూలిపోతుంటే మౌనంగా కుమిలిపోతున్న కెసిఆర్**

జూబ్లీహిల్స్‌లో గెలిపించాలని కెసిఆర్ ఇప్పటివరకు విజ్ఞప్తి ఎందుకు చేయలేదని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తన కళ్లముందే బిఆర్ఎస్ కూలిపోతుంటే కెసిఆర్ మౌనంగా కుమిలిపోతున్నారని అన్నారు. కెసిఆర్ రాజకీయంగా ముగిసిపోయారన్నారు. కెసిఆర్ బిఆర్ఎస్ పని అయిపోయిందని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ ఆత్మహత్య చేసుకుని బిజెపికి అవయవదానం చేసిందన్నారు. కెసిఆర్‌కు గతం ఉంది, భవిష్యత్ లేదన్నారు. కెసిఆర్‌ను ప్రత్యర్థిగా కాకుండా తాము ఇప్పుడు బాధితునిగా చూస్తున్నామని వ్యాఖ్యానించారు. కెటిఆర్ తన భాష, అలవాట్లు మార్చుకోవాలన్నారు. జూబ్లీహిల్స్‌లో ఎంత మెజారిటీతో గెలుస్తామో చెప్పలేమన్నారు. జూబ్లీహిల్స్‌లో బిజెపి డిపాజిట్ కోల్పోవడం ఖాయమన్నారు. బిజెపి, బిఆర్ఎస్ విలీనాన్ని తాను అడ్డుకున్నానని కవితే చెప్పారు కదా అని రేవంత్ గుర్తుచేశారు. ఎన్నికల విషయంలో తనది లీడర్ మైండ్ కాదని, క్యాడర్ మైండ్ సెట్ అన్నారు.

**కెసిఆర్ – అప్పులు, అవినీతి, అహంకారం..**

బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ వెనకబడి పోయిందని సిఎం తీవ్ర విమర్శలు గుప్పించారు. 60 వేల కోట్ల మిగులుతో రాష్ట్రాన్ని అప్పగించగా, 8 లక్షల కోట్ల అప్పుతో దివాళా స్థితికి నెట్టేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు 1.87 లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ఎకరాకు నీరు ఇవ్వలేకపోయారు. పాఠశాలలు మూసేశారు, ఆసుపత్రులు కట్టలేదు, పథకాలు పూర్తి కాలేదు అని మండిపడ్డారు. రైతులను అప్పుల్లో ముంచేశారు అని ఆరోపించారు. ప్రగతి భవన్, కమాండ్ కంట్రోల్, సచివాలయం, కాంక్రీట్ షోలు మాత్రమే, ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు అని విమర్శించారు.

**గల్లీ గల్లీలో గంజాయి కల్చర్ తీసుకొచ్చింది ఎవరో ఆలోచించాలి..**

ఎవరిది అగ్రికల్చర్, ఎవరిది డ్రగ్స్ కల్చరో ప్రజలు ఆలోచించుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గల్లీ గల్లీలో గంజాయి కల్చర్ తీసుకొచ్చింది ఎవరో ఆలోచించాలని కోరారు. ఉపఎన్నికల్లో పోటీ పెట్టే విషసంస్కృతిని తీసుకొచ్చిందే కెసిఆర్ అని విమర్శించారు. గతంలో పిజెఆర్ చనిపోయినప్పుడు కెసిఆర్ అభ్యర్థిని నిలబెట్టి ఎన్నికలు తెచ్చారని అన్నారు. రాంరెడ్డి వెంకటరెడ్డి విషయంలోనూ కెసిఆర్ అదే విష సంస్కృతి తెచ్చారని విమర్శించారు. మాగంటి గోపీనాథ్ తనకు మిత్రుడే, కానీ నియోజకవర్గం అభివృద్ధి జరగాలి కదా అని అన్నారు. ఫేక్ సర్వేలకు మీడియా దయచేసి ప్రాధాన్యం ఇవ్వొద్దని సిఎం కోరారు.

**నష్టపోయిన ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సోనియా గాంధీ..**

తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని ఇచ్చిన మాటను సోనియా గాంధీ నెరవేర్చిందని, అందుకే కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా నష్టపోయినా వెనక్కి తగ్గలేదని సిఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. 1994–2004 మధ్య టిడిపి, 2004–2014 మధ్య కాంగ్రెస్ పాలించాయని, అలాగే 2014–2023 మధ్య బిఆర్ఎస్ పాలించిందని తెలిపారు. ఇప్పుడు 2023 నుంచి పదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని సిఎం స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ పాలనలోనే రైతుకు వెలుగు**

2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉచిత విద్యుత్, రుణమాఫీతో రైతులకు ఊరట కల్పించారని, మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం 73 వేల కోట్ల రుణ మాఫీ అమలు చేసిందని అన్నారు. జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టులు ప్రారంభించి, కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, ఆర్‌డిఎస్, ప్రాణహితచేవెళ్ల వంటి ప్రాజెక్టులు కాంగ్రెస్ చేతిలోనే మొదలయ్యాయని తెలిపారు.

**హైదరాబాద్ ఐటి, నాలెడ్జ్ సిటీగా మారింది కాంగ్రెస్ వల్లే..**

హైదరాబాద్ గ్రోత్ కారిడార్‌గా మారడం వెనుక కాంగ్రెస్ కృషి ఉందన్నారు. తెలంగాణ ఆదాయంలో 65 శాతం నగరం నుంచే వస్తోందన్నారు. హైదరాబాద్‌లో ఐటి రంగానికి పునాది కాంగ్రెస్ పాలనలో పడిందని, జైపాల్ రెడ్డి కృషితోనే నగరానికి మెట్రో వచ్చినదని సిఎం గుర్తు చేశారు. దేశంలో ఉత్పత్తి అయ్యే బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం హైదరాబాద్ నుంచే వస్తున్నాయని, ఇటీవల ఎలీ లిల్లీ కంపెనీ 1 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోందని వివరించారు.

**మా ప్రభుత్వంలో సంక్షేమం –అభివృద్ధి సమపాళ్లలో..**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సబ్సిడీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంపు, రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. హైదరాబాద్‌లో గోదావరి జలాలు తేవడంపై ప్రణాళికలు సిద్ధం చేశామని, నగర అభివృద్ధికి రూ.500 కోట్లు కేటాయించామని తెలిపారు.

## భవనాలతో ఉద్యోగాలు వస్తాయా?

పిచ్చిగా మాట్లాడుతున్న రేవంత్ : మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కెసిఆర్ నిర్మించిన భవనాలతో ఉద్యోగాలు వచ్చాయా అని సిఎం రేవంత్ రెడ్డి పిచ్చిగా మాట్లాడుతన్నారని, భవనాలు నిర్మిస్తే ఉద్యోగాలు వస్తాయా? అని బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. కెసిఆర్, కెటిఆర్ వల్లనే హైదరాబాద్ ఇమేజ్ పెరిగిందని, ఈ రెండేళ్లలో హైదరాబాద్‌కు ఐదు పైసలైనా సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చారా? అని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2004–14 సంవత్సర పాలన దేనికి స్వర్ణయుగమని, స్మశానాలకు స్వర్గ యుగం కాదా అని అన్నారు. ఆ సమయంలో పారిశ్రామిక వేత్తలు విద్యుత్ కోసం ధర్నా చేస్తే, ఆ ధర్నాలో రేవంత్ రెడ్డి మాట్లాడలేదా అని అన్నారు. కెసిఆర్ సిఎం అయ్యే నాటికే తెలంగాణ రాష్ట్ర మిగులు బడ్జెట్ రూ.300 కోట్లు అని, కెసిఆర్ దిగిపోయే నాటికి రూ.5 వేల కోట్లు మిగులు బడ్జెట్ తో రాష్ట్రాన్ని కాంగ్రెస్‌కు అప్పగించామని వివరించారు. మానసిక రోగికి మించిన రోగి రేవంత్ రెడ్డి అని, అసలు రేవంత్ రోగం ఏందో అంతు పట్టడం లేదని ఎద్దేవా చేశారు. కవిత ,మాగంటి తల్లి గురించి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని, సిఎం సొంత అన్న కూతురి పెళ్ళికి రేవంత్ భార్య, కుటుంబ సభ్యులు ఎందుకు పోలేదని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. బిఆర్ఎస్ పని అయిపోయిందనడం రేవంత్ మూర్ఖత్వమన్నారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి కోటి రెడ్డి, మాజీ ఎంఎల్ఎలు రవీంద్ర కుమార్, చిరుమర్తి లింగయ్య ,బూడిద భిక్షమయ్య గౌడ్ ,కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ,పైళ్ల శేఖర్ రెడ్డి ,నాయకులు రామచంద్ర నాయక్ ,పల్లె రవి కుమార్ తుంగ బాలు పాల్గొన్నారు.

## వందేళ్ల చరిత్ర ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

సబ్బండ వర్గాల పక్షాన చేసిన పోరాటాలు కేవలం సిపిఐ పార్టీకే సొంతమని పల్లా వెంకట రెడ్డి అన్నారు. దేశంలో సుద్దాల హనుమంతు, బండి యాదగిరి వంటి కవులు, కళాకారుల తమ చైతన్య గీతాల ద్వారా సిపిఐ అనుబంధ సంఘాలైన ప్రజానాట్య మండలి,అరసం ప్రజలను చైతన్యవంతులను చేసిందని, ఇలాంటి ఎంతో మంది గొప్ప నాయకులను, కళాకారులను తయారు చేసిన సంస్థ ప్రజానాట్య మండలి అని అన్నారు. ఒక గొప్ప బహిరంగ సభ పెట్టాలంటే నాయకులకంటే కళాకారుల పాత్రనే అతి ముఖ్యమని, మహాసభలను విజయవంతం చేయడానికి ప్రజానాట్య మండలి కృషి చేయాలని కోరారు. సిపిఐ 'వందేళ్ల చరిత్ర' ను తెలియజేసేందుకు ఆదిలాబాద్ జోడెఘాట్, నిర్మల్ బాసర, గద్వాల నుండి ఇలా మూడు జాతలను నిర్వహిస్తుందన్నారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ 'సిపిఐ వందేళ్ల పండగను అంగరంగా వైభవంగా నిర్వహించేలా ప్రతి కార్మికుడు, కర్షకులు, విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, అందరిని కలిపే అభ్యుదయ గీతాలాపన చేయాలన్నారు. ప్రజల లో మార్పు, చైతన్యం దిశగా పాటలు ముందుకు నడవాలని సూచించారు. గతంలో, సాయుధ పోరాటం, పోరుబాట, సామాజిక తెలంగాణ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో ప్రజానాట్య మండలి పాత్ర అమోఘమన్నారు. రాజ్యాంగ హక్కులపైన, సామాజిక న్యాయం కోసం విద్యా,పేదరిక నిర్మూలన, కార్మికులు, రైతు, బీడీ కార్మికుల సమస్యలు, భూపోరటాల పట్ల నూతన ఉత్సాహాన్ని నింపే విధంగా, ప్రజలను ఆకట్టుకునే రీతిలో వీధీ నాటకాలను, పాటలను రూపొందించాలని చాడ కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ప్రజానాట్య మండలి ఇన్‌చార్జ్ కలవేని శంకర్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగిన శిక్షణా తరగతులు ప్రజలను పోరాట దిశగా నడిపించాలన్నారు. కళా జాత లో కళాకారులే ప్రాముఖ్యమని, దేశంలో అన్ని సమస్యలపైన ఉపన్యాసాలకంటే పాటనే ప్రజలను కదిలిస్తుందని, ఆ దిశలో ప్రజానాట్య మండలి ఉండాలని కోరారు. ముగింపు సభలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి నరసింహ, తెలంగాణ ప్రజా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ,అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు ఉప్పలయ్య, లక్ష్మీ నారాయణ, దామెర కృష్ణ, నళిని, రవి, జగన్, చంద్రశేఖర్, సైదులు, రాములు, దుద్దేల సమ్మయ్య, కూన సుధాకర్, కాటూరి రాము, సతీష్ నాగేశ్వర్ రావు, ప్రవీణ్ చారి, రాజేశ్వర్ రావు, వట్టేపాక రవి పాల్గొన్నారు.

## మాటల యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

బలహీనంగా ఉన్న, పార్టీ ప్రధాన వ్యూహకర్త దృష్టిలో ఉన్న ససారాం, అర్వాల్‌లలో ర్యాలీలను ప్రసంగించారు. బిజెపి మాజీ అధ్యక్షుడైన రాజ్‌నాథ్ సింగ్, తన సొంత రాష్ట్రం ఉత్తరప్రదేశ్ సరిహద్దులోని ఔరంగాబాద్, కైమూర్ జిల్లాల్లో ర్యాలీలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా తొలిసారి బిహార్‌లో ప్రచారం చేశారు. ఆమె 10 ర్యాలీలు, ఒక రోడ్ షోతో చాలా ఉధృతంగా ప్రచారం నిర్వహించారు. అయితే ప్రతికూల వాతావరణం కారణంగా ఆమె హెలికాప్టర్ ఎక్కలేకపోయినందున ఒక చోట ప్రచారాన్ని రద్దు చేయవలసి వచ్చింది. బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా, కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్, యుపి, అసోం, ఎంపి సిఎంలు యోగి ఆదిత్యనాథ్, హిమంత బిశ్వ శర్మ, మోహన్ యాదవ్ వంటి ప్రాంతీయ నాయకులు పాల్గొన్నారు. ఐదోసారి పదవీకాలం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న జెడి(యు) అధినేత, సిఎం నితీష్ కుమార్ నిశ్శబ్దంగా కానీ దృఢనిశ్చయంతో ప్రచారం చేయడం పెద్దగా వెలుగులోకి రాలేదు. దీంతో ఆయన ఆరోగ్యంపై పలు ఊహాగానాలకు దారితీస్తున్నాయి. మాజీ డిప్యూటీ ప్రస్తుత ప్రత్యర్థి తేజస్వి యాదవ్ కూడా ఉత్సాహభరితమైన ప్రచారానికి నాయకత్వం వహించారు. ఆయనను సిఎం అభ్యర్థిగా ప్రకటించిన ఇండియా కూటమి తనపై చూపిన విశ్వాసంతో ఆయన అన్ని విధాలా ఉత్సాహంగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో 'ఎక్స్ ఫ్యాక్టర్'గా పరిగణించబడే జన్ సురాజ్ పార్టీ ప్రచారం అంతా దాని వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ గురించే. దేశవ్యాప్తంగా రాజకీయ ప్రముఖుల అనేక అద్భుతమైన ప్రచారాలను నిర్వహించిన ప్రశాంత్ కిషోర్, తన సొంత రాష్ట్రంలో ఇంటింటికీ తిరిగి సాంప్రదాయిక ప్రచార శైలితో శ్రమించాలని ఎంచుకున్నాడు.

## హోరాహోరీ ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రచారంలోకి దిగారు. వరుసగా రోడ్ షోలు, కార్నర్ మీటింగ్స్‌లో పాల్గొన్నారు. మంత్రులు కూడా ప్రచారంలో భాగస్వాములయ్యారు. వారిలో 13 మందికి నియోజకవర్గంలోని ఒక్కో డివిజన్ బాధ్యతలు అప్పగించగా, ప్రభుత్వ సంక్షేమ పథకాలైన మహాలక్ష్మి, గృహలక్ష్మి వంటి ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారు. కాంగ్రెస్ ప్రధానంగా మహిళలు, మైనారిటీలు, బిసిలు, యువత ఓట్లపై ఆశలు పెట్టుకుంది. బిసి నాయకుడైన నవీన్ యాదవ్‌ను గెలిపించుకోవడం ద్వారా బిసి వర్గాలలో పట్టు సాధించాలని కాంగ్రెస్ భావిస్తుంది. బిఆర్ఎస్, బిజెపిలు కూడా చివరి రోజు జోరుగా ప్రచారం నిర్వహించాయి.



## మురికివాడల అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

అధికారంలో ఉన్న బిఆర్ఎస్ నాయకులు హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేయకుండా గాలికి వదిలేశారని ఆరోపించారు. అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్ రూమ్, దళితులకు మూడు ఎకరాలు వంటి గొప్ప గొప్ప కార్యక్రమాలు చేపడతామని బిఆర్ఎస్ అనేక భ్రమలను కల్పించిందని మండిపడ్డారు. పదేళ్ల కాలంలో ఆ పార్టీ ఏ ఒక్క హామీని పూర్తి చేయలేదని ఆరోపించారు. అధికారం కోల్పోయి బిఆర్ఎస్ నాయకులకు మతిభ్రమించి అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. పేద, మధ్యతరగతి వర్గాలకు మేలు జరగకుండా బిఆర్ఎస్ నాయకులు కుట్రలకు పాల్పడుతున్నారని, పదేళ్ల మంత్రిగా పనిచేసిన హరీష్ రావు కూడా బ్యాలెన్స్ కోల్పోయి మాట్లాడుతున్నారన్నారు. ఢిల్లీలో తనకు ఇల్లు ఉందో లేదో అందరికీ తెలుసని, ఐటి రైడ్స్ అధికారికంగా జరుగుతాయనేది అందరికీ తెలిసే జరుగుతాయన్న విషయం హరీశ్‌కు తెలియదా అని ఎద్దేవా చేశారు. కేవలం రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలకు కాంగ్రె స్ ప్రభుత్వం ఏడాదికి లక్ష కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేస్తుందని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం, 96 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేశామని తెలిపారు. బిఆర్ఎస్ నాయకులు పదేళ్ల కాలంలో ఇవ్వని రేషన్ కార్డులను కేవలం రెండు సంవత్సరాల కాలంలోనే తమ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో ఉన్న పేద బిడ్డల కోసం ఇంటర్‌నేషనల్ స్టాండర్డ్స్‌తో ఉచితంగా చదువుకునేందుకు యంగ్ ఇండియా ఇంటర్‌నేషనల్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని తాము తిరిగి ప్రారంభించామని, కానీ గత ప్రభుత్వం మహిళా సంక్షేమాన్ని విస్మరించిందని మండిపడ్డారు.

**జూబ్లీహిల్స్‌లో 15 వేల మంది స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే 15 వేల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశామని, ఓవర్సీస్ స్కాలర్‌షిప్, ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు 200 శాతం పెంచామని, పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని రూ 10 లక్షలకు పెంచామని, రూ 5 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నామని భట్టి వివరించారు. రాష్ట్రంలో మొదటి దశలో 4.5 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి శరవేగంగా నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో కనీసం గ్రూప్ 1 పరీక్షలను కూడా నిర్వహించలేకపోయిందని, కానీ తమ ప్రభుత్వం రెండు సంవత్సరాల లోపే విజయవంతంగా గ్రూప్ 1 పరీక్షను నిర్వహించామని, పైగా అడ్డంకులను అధిగమించి నియామక పత్రాలను కూడా అందజేశామని తెలిపారు. రెండేళ్ల కాలంలోనే గ్రూప్ 2 పరీక్షలు నిర్వహించి నియామక పత్రాలు కూడా అందించామన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS



మెడ్‌హోప్ చిల్డ్రన్-జనరల్ క్లినిక్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నల్లకుంటలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి అజీజ్‌పాషా, ఎన్ఎఫ్ఐడబ్ల్యు జాతీయ నాయకురాలు పశ్యపద్మతో పాటు పలువురు నేతలు, డాక్టర్లు పాల్గొన్నారు.

## ఎర్రజెండా పార్టీలన్నీ ఒకే వేదికపైకి రావాలి

డిసెంబర్ 26న సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు





**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** నవంబర్ 20, 21న మహబూబాబాద్ జిల్లాలో బస్సు జాతాను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఐ మహబూబాబాద్ జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశం స్థానిక వీరభవన్‌లో పెరుగు కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఖమ్మంలో డిసెంబర్ 26న సిపిఐ 100 ఏళ్ల పండుగ సిపిఐ శతాబ్ది ఉత్సవాల సభ ఘనంగా 5లక్షల మందితో ఖమ్మం జిల్లా కేంద్రంలో డిసెంబర్ 26న పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని, ఈ శతాబ్ది సభకు 40 దేశాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నారన్నారని, డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది సభ జయప్రదానికై మూడు బస్సు జాతాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రచారంలో పాల్గొంటున్నాయని, మహబూబాబాద్ జిల్లాలో ఈ జాత నవంబర్ 21న గూడూరు మండలంలోకి ప్రవేశిస్తుందని, సాయంత్రం మానుకోటలో భారీ ఎత్తున ప్రదర్శనతో సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం 22న గార్ల మండలంలో ప్రచారంలో పాల్గొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రవేశిస్తుందని తెలిపారు. ఈ దేశంలో సమ సమాజ నిర్మాణం కోసం గత వందేళ్ళుగా సిపిఐ పోరాడుతూనేన్నారు. దేశంలో ఒక్క సిపిఐకి మాత్రమే వందేళ్ల చరిత్ర ఉందని ఆయన తెలిపారు.

**దేశంలో కమ్యూనిస్టు పార్టీలు ఒకే పార్టీగా కలిసి రావాలి**

సిపిఐ వంద సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా భారతదేశంలో కూడా అన్ని వామపక్ష ఎర్రజండా పార్టీలు అన్నీ కలిసి ఒక వేదికపైకి వచ్చి ఒక్కపార్టీగా రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నేపాల్‌లోని 10కమ్యూనిస్టుపార్టీలు అన్నీ కలిసి ఒక్కటైన ఒక జండా క్రిందకి వచ్చిన నేపథ్యంలో మన దేశంలో కూడా కలిసి రావాలని ఆయన కోరారు. ఈ దేశంలో మతోన్మాదం పెరిగిపోతోందంటే, పెట్టుబడి వర్గాలు ఈ దేశంలో దోపిడి చేస్తున్నాయంటే కమ్యూనిస్టులు బలంగా లేకపోవడం, కమ్యూనిస్టులు చీలిపోవడంతో శక్తి లేదనే అభిప్రాయంతోనే దేశంలో మతోన్మాదం పేట్రేగిపోతోందన్నారు. మావోయిస్టులు కూడా కొంతమంది బయటకు వచ్చారని, మరికొంత మంది సాయుధ పోరాటంలోనే ఉన్నారని, ఈ దేశంలో పెరిగిన టెక్నాలజీకి, మారిన పరిస్థితులకు అనుగుణంగా మనం కూడా మారాలని, సాయుధ పోరాటం వదిలేయాలని, మావోయిస్టులు కూడా కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై ప్రజలు అశలు పెట్టుకున్నారని, ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని ఆయన కాంగ్రెస్ పార్టీని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి అజయ్ సారధి రెడ్డి, నల్లు సుధాకర్ రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, దేశ పల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబ లక్ష్మి పాల్గొన్నారు.

## బ్యాంకింగ్ రంగంలో రామరాజుది కీలకపాత్ర

సంస్మరణ సభలో కొనియాడిన పలువురు వక్తలు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు,అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూరి రామరాజు శాంతి సంఘంలో చురుకైన పాత్రను పోషించారని, బ్యాంక్ ఉద్యోగుల సమస్య పరిష్కారానికి కృషి చేశారని పలువురు కొనియాడారు. ఆయన లేని లోటు తీర్చనిదని, రామరాజు కుటంబ సభ్యులకు సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. ఐప్సో ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆర్‌టిసి కల్యాణ మండపంలో ఆదివారం 'అమర్లపూరి రామరాజు' సంస్మారణ సభ జరిగింది. ఈ సభకు ఐప్సో సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు అమర్లపూరి రామరాజు చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ బ్యాంక్ రంగంలో రామరాజు క్రియశీలక పాత్రను పోషించారన్నారు. ఐప్సో, కమ్యూనిస్టు కార్యక్రమాలలో ఆయన చురుగ్గా పాల్గొనేవారని గుర్తు చేశారు. ఒక మంచి మనసు ఉన్న కార్యకర్తను కోల్పోయామన్నారు.

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ మాట్లాడుతూ రామరాజు మరణం బాధాకరమన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రామరాజు అందరితో కలిసిమెలిసి ఉండేవారని, స్నేహశీలి అని అన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఆదర్శ వివాహానికి రామారాజు మార్గదర్శకులన్నారు. ఆయన ఆకస్మిక మరణం బాధకరమన్నారు.

సిపిఐ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ రామారాజు మరణం ప్రజా సంఘాలకు తీరని నష్టమన్నారు. ఐప్సో రాష్ట్ర అధ్యక్షుడు, ఐఎఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూతూ రామారాజు మరణం తీరని లోటు అని అన్నారు. ఐప్సో నాయకులు యాదవరెడ్డి మాట్లాడుతూ శాంతి సంఘాన్ని రామారాజు చురుగ్గా నడిపించారన్నారు. ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ రిటైర్డ్ అయిన తర్వాత కూడా రామారాజు బ్యాంక్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేశారన్నారు. ఐప్సో నాయకులు, టిపిసిసి ఉపాధ్యక్షుడు ఎం.ఆర్.వినోద్ రెడ్డి మాట్లాడుతూ రామారాజు మరణం దురదృష్టకరమన్నారు.

సినీ నటులు ప్రీతంనిగమ్, నగేష్, హైకోర్ట్ న్యాయవాది దామోదరరెడ్డి, ఐప్సో నాయకులు డాక్టర్ డి.సుధాకర్, జిహెచ్ఎంసి జాయింట్ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, ఐప్సో నాయకులు నాగేశ్వర్, బొమ్మగాని నాభూషణం, సి.ఆర్.ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు తదితరులు రామారాజు చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. సంస్మరణసభలో రామారాజు తల్లి అనసూయ, రామారాజు భార్య రాధారాణి, కుమారులు ఉత్తమ్ రాజ్, ఉదయ్‌రాజ్ తదితర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





## టెలివిజన్ కార్మికులకు అండగా ఉంటాం

మంత్రి శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టెలివిజన్ కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని, సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. బేగంపేట్‌లోని హరిత ప్లాజా హోటల్ లో ఆదివారం 'తెలంగాణ టెలివిజన్ డెవలప్‌మెంట్ ఫోరం' ఆధ్వర్యంలో నిర్వహించిన 'కార్తీక మాస ఆత్మీయ సమ్మేళనం'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు 'ఎంటర్‌టైన్‌మెంట్ రంగం' కీలక చోదక శక్తిగా మారిందని, ప్రేక్షకులకు నిరంతరం వినోదాన్ని అందించేందుకు టెలివిజన్ కార్మికులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ రంగంలో పనిచేసే ప్రతి ఒక్కరూ సమయం, సందర్భం లేకుండా ఎంతో కష్టపడతారని, వారి త్యాగం వెలకట్టలేనిదని కొనియాడారు. రాష్ట్రంలో టెలివిజన్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, ముఖ్యంగా కార్మికుల ఆర్థిక, సామాజిక భద్రతా సమస్యలపై తమ ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉందన్నారు. ఈ విషయంలో ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని, వారి పట్ల సిఎం రేవంత్ రెడ్డి అత్యంత సానుకూలంగా ఉన్నారని వివరించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నాయకత్వంలో త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ సంఘం ప్రతినిధులు సురేష్, కవిత తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్షాలకు భంగపాటు తప్పదు

మా వైపే జూబ్లీహిల్స్ ఓటర్లు : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రతిపక్షాలకు భంగపాటు తప్పదని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పోయే అందరి పార్టీ కాంగ్రెస్ వైపే నియోజకవర్గ ఓటర్లంతా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం సోమాజిగూడ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలు, బస్తీల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా ఆయన ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. అపార్ట్ మెంట్లు, గ్రేటెడ్ కమ్యూనిటీల అసోసియేషన్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హైదరాబాద్ మహా నగరాభివృద్ధికి గత కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు, చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టుల గురించి ఓటర్లకు వివరించారు. నగరాభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన భవిష్యత్తు కార్యాచరణపై సలహాలు సూచనలు స్వీకరించారు. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ పాలకులు నగరాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. కొన్ని ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు, అండర్ పాస్ లను నిర్మించి మొత్తం నగరాన్ని అభివృద్ధి చేశామంటూ గొప్పలు చెప్పుకున్నారన్నారు. కానీ... క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి వేరని, ఇప్పటికీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని చాలా కాలనీలు, బస్తీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు లేవన్నారు. రెండేళ్లలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారన్నారు. అయినా... తమ ఉనికిని కాపాడుకునేందుకు బిఆర్ఎస్,బిజెపి బురద జల్లే రాజకీయాలకు పాల్పడుతున్నాయన్నారు. పదే పదే మా ప్రభుత్వంపై అవాస్తవాలను ప్రచారం చేస్తూ ఈ ఉప ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడేలా నిపుణుల మార్గనిర్దేశనంలో పకడ్బందీ ప్రణాళికలను రూపొందిస్తున్నామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని పునరుద్ఘాటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించే చిత్తశుద్ధి కాంగ్రెస్ అభ్యర్థికి మాత్రమే ఉందన్నారు. పది మందికి మంచి చేయాలనుకునే నవీన్ యాదవ్ గెలిస్తే ఈ నియోజవర్గానికి మంచి జరుగుతుందన్నారు. బిఆర్ఎస్, బిజెపి నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని జూబ్లీహిల్స్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సంక్షేమం, అభివృద్ధి అజెండాగా ముందుకు సాగుతున్న ఈ ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## నవీన్ యాదవ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికల ప్రచార చివరి రోజున నియోజకవర్గంలోని ఏడు డివిజన్లలో మంత్రులతో కలిసి డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ఆదివారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంత్రి జూపల్లి కృష్ణారావుతో ఎర్రగడ్డ డివిజన్‌లోని మోతీ నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.అనంతరం స్థానిక డివిజన్‌లో పరిస్థితిపైన మంత్రి జూపల్లితో భట్టి ప్రత్యేకంగా సమావేశమై, సమన్వయం చేశారు. ఆ తర్వాత మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి భట్టి యూసఫ్‌గూడ డివిజన్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం స్థానిక పరిస్థితులపైన పొన్నంతో పాటు కాంగ్రెస్ నాయకులతో భట్టి సమావేశమయ్యారు.ఆ తర్వాత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,వాకిటి శ్రీహరితో వెంగళరావు డివిజన్‌లో సమావేశమయ్యారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి రహమత్ నగర్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి దనసరి అనసూయ సీతక్కతో కలిసి బోరబండ డివిజన్‌లో భట్టి సమీక్ష నిర్వహించారు. అనంతరం టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి భట్టి విక్రమార్క మీడియా సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత యూసఫ్ గూడలోని కాంగ్రెస్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో భట్టి విక్రమార్క ప్రత్యేకంగా సమావేశమై, ఎన్నికల ప్రచార పర్వం, తాజా పరిస్థితిని సమీక్షించారు. అందరూ కష్టపడి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. ఉప ఎన్నిక రోజు తప్పని సరిగా ప్రతి ఓటరు.. తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు

## బిజెపితో కుమ్మక్కైన బిఆర్ఎస్‌ను ఓడిద్దాం

నవీన్ గెలుపునకు అందరం ఒకటై కృషి చేద్దాం

సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో బాగంగా సిపిఐ శ్రేణులు ఆదివారం వెంగళరావు నగర్ , యూసుఫ్ గూడ , లో కూటమి పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కొరకు సిపిఐ ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ తిరిగి పంచటం జరిగింది. నవీన్ యాదవ్ గెలుపు లక్ష్యంగా ముందుకు సాగారు. ప్రచారం నిర్వహిస్తున్న క్రమంలో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్ ల వద్ద ఇటి నరసింహ మాట్లాడారు.ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని. ఈ సారి నవీన్ యాదవ్ ను తప్పకుండా గెలిపించుకుంటామని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలైన బిజెపి,బిఆర్ఎస్ కుట్రలను తిప్పి కొడుతున్నారు. బిఆర్ఎస్, బిజెపితో కుమ్మక్కై ప్రభుత్వాన్ని అస్థిర పరిచే చర్యలను స్వస్తి పలకాలంటే ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నీ గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజల పైన ఉందని తెలిపారు. మతోన్మాద వ్యాఖ్యలు చేస్తున్న బండి సంజయ్ కి జూబ్లీహిల్స్ ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్ బోస్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అభివృద్ధి గురించి కానీ, గత 11 సంవత్సరాలుగా మోడీ చేసిన పాలన గురించి మాట్లాడకుండా ప్రజల మధ్యల మత విద్వేషాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనుకుంటున్నబీజేపీ దివాలు కోరుతనాన్ని తిప్పి కొట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ ఛాయా దేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్,జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆరుట్ల రాజ్ కుమార్, బాలకృష్ణ, మహమూద్,ఇమ్రాన్,చైతన్య,అనిల్,దశరథం, ఉప్పల ఉదయ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## కోటగుళ్ళ సందర్శన కొత్త అనుభూతిని మిగిల్చింది

సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారుల బృందం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** కాకతీయులు నిర్మించిన కోటగుళ్ళ సందర్శన కొత్త అనుభూతిని మిగిల్చిందని సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారులు తెలిపారు. భూపాలపల్లి జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారుల బృందం 12 మంది అనురాగ్ రంజన్, వటాస్ రాజ్, కృష్ణ ఝా విపశయన తన్వర్ కృష్ణ, సి.విశేష్ సింగ్, తుషార్ సింగ్, ఆదిత్య సింగ్, మయాంక్ ఖండేల్వాల్, మణిమాల ఎన్.విశాల్ సింగ్, పవార్ అక్షయ్ విలాస్, రితికా రాత్ కోటగుళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో సాంప్రదాయబద్ధంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు నాగరాజు, శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. వారి వెంట గణపురం ఎస్ఐ రేఖ అశోక్, మహా ముత్తారం డీటీ సందీప్, గణపురం ఆర్ఐ చెక్క దేవేందర్, గుడాల తిరుపతి రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాగంటి గోపీనాథ్ మృతిపై అనుమానాలు

మీడియాతో ఆయన తల్లి మహానంద కుమారి





**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం మిస్టరీగా అనిపిస్తున్నదని, తనకు అనేక అనుమానాలున్నాయని ఆయన తల్లి మహానంద కుమారి అన్నారు. ఆయన చనిపోయిన వార్త తల్లిగా తనకు తెలియదన్నారు. జూన్ 6న చనిపోయారా? 8న చనిపోయారా? అన్నది సందేహంగానే ఉన్నదన్నారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాగంటి మొదటి భార్య మాలిని, ఆమె కుమారుడు తారక్‌తో కలిసి మహానంద కుమారి మీడియాతో మాట్లాడారు. కెటిఆర్ వచ్చిన తర్వాత గోపీనాథ్ మరణవార్తను బయటకు చెప్పారన్నారు. ''లీగల్ హెయిర్ సర్టిఫికెట్‌లో మొదటి భార్య, బిడ్డలు, నా పేరు కూడా లేదు. మొదటి భార్యతో విడాకులు కూడా కాలేదు. నేను గోపీనాథ్‌తో సునీత పెళ్లి చేయలేదు. ఫ్యామిలీ సర్టిఫికెట్‌లో మా పేరు లేదు. కేటీఆర్ వెంట పరుగెత్తి నాకు జరిగిన అన్యాయం గురించి చెప్పాలనుకొంటే ఆయన కూడా వినలేదు. ఇది డబ్బు సమస్య కాదు. మాకు గుర్తింపు లేదు. అందుకే మీడియా ముందుకొచ్చాం'' అంటూ ఆమె చెప్పారు. గోపీనాథ్ తల్లిగా కేటీఆర్ తనను కనీసం కలవలేదన్నారు. సునీతకు టికెట్ ఇచ్చేటప్పుడు కేటీఆర్ మాకు కనీసం సమాచారం కూడా ఇవ్వలేదని, తమకు ఏ పార్టీతో సంబంధం లేదు'' అని ఆమె స్పష్టంచేశారు. మాలినిని గోపీనాథ్ వద్దనుకొంటే ఎప్పుడో విడాకులు తీసుకునేవాడని, అలా జరగలేదన్నారు. తారక్ ప్రద్యుమ్న మాట్లాడుతూ తన పాస్‌పోర్ట్, ఇతర పత్రాల్లో తండ్రిగా గోపీనాథ్ పేరే ఉన్నదని, చట్ట పరంగా కూడా అన్ని సక్రమంగానే ఉన్నాయని తెలిపారు. తారక్ అంటే ఎవరో తెలియదన్న మాగంటి సునీత.. జూన్ 6న తనకు మొదటిసారి ఫోన్ చేశారని, ఎవరో తెలియకపోతే ఎందుకు ఫోన్ చేసినట్టు అని ఆయన ప్రశ్నించారు. మా అమ్మ, నాన్నమ్మ, నా పేర్లను లీగల్ హెయిర్ సర్టిఫికెట్‌లో పెట్టాలని ఆయన కోరారు.

## స్వీయ అవగాహనతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట

సైబర్ నేరాల నివారణకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమంలా ప్రచారం- డిజిపి శివధర్ రెడ్డి

సైబర్ సింబా వలంటీర్ లోగో ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్వీయ అవగాహనతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయొచ్చని డిజిపి బి.శివధర్ రెడ్డి అన్నారు. గత పదేళ్లుగా సైబర్ నేరాల సంఖ్య క్రమేణా పెరుగుతుందని, వాటి నివారణకు తెలంగాణ వ్యాప్తంగా ఒక ఉద్యమంలాగా ప్రచారం నిర్వహించాలని నిర్ణయించామని ఆయన తెలిపారు. హైదరాబాద్ కవాడిగూడలోని జలవాయు విహార్ కమ్యూనిటీ హాల్‌లో ''జాగృత్ హైదరాబాద్ – సురక్షిత్ హైదరాబాద్'' నినాదంతో తలపెట్టిన సైబర్ క్రైమ్స్ అవగాహన కార్యక్రమాన్ని హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనర్‌తో కలిసి ఆదివారం డిజిపి బి. శివధర్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. సైబర్ సింబా లోగో, క్యూఆర్ కోడ్‌ను వారు ఆవిష్కరించి.. బ్యాడ్జీలను వలంటీర్లకు అందజేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో శివధర్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్ సాధారణ సమస్య కాదని.. ఒక తీవ్రమైన సామాజిక సమస్యగా మారిందని అన్నారు. ఫోన్ కాల్, సోషల్ మీడియా, ఆన్‌లైన్ ఇంటరాక్షన్‌తోనే నేరాలు చేస్తున్నారని, ఎవరు ధనవంతులు, ఏ లొకేషన్ లో ఎవరు ఉంటారు, వయస్సు వంటి వివరాలు అన్నీ తెలుసుకొని సులువుగా టార్గెట్ చేస్తున్నారని చెప్పారు. ఇంట్లో ఉన్న మహిళలు, వృద్ధులు, గృహిణులు ప్రధాన లక్ష్యంగా మారుతున్నారని, ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు ఫోన్లు చేసి భయపెట్టి మోసం చేస్తున్నారని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం సైబర్ బాధితులు తగ్గేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. నేరాల నివారణకు సైబర్ పెట్రోలింగ్ చేస్తున్నామని వివరించారు. సైబర్ నేరాలకు వ్యతిరేకంగా జరిగే కార్యక్రమంలో యువకులు, రిటైర్డ్ వ్యక్తులు, ప్రముఖులు అందరూ భాగం కావాలని, ఒకరు పది మందికి, పది మంది ఇరవై మందికి చెబితే ఇది ఒక పెద్ద ఉద్యమంలాగా మారుతుందని అన్నారు.

ప్రతి ఇంటిలోనూ కనీసం ఒకరు ఈ మోసాల గురించి అవగాహన కలిగిన ఒక సైబర్ సింబా ఉంటే.. సమాజంతా సురక్షితంగా ఉంటుందన్నారు. సజ్జనర్ మాట్లాడుతూ సైబర్ నేరాల బారిన పడి హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ప్రతి రోజు సగటున రూ.కోటి వరకు పోగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశ, భయాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. సైబర్ మోసానికి గురైన వారు తక్షణమే 1930 కాల్ చేసి.. సమాచారం ఇవ్వాలని, జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ www. cybercrime. gov.in ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నవారితో సైబర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్స్ అదనపు పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాస్ ,ట్రాఫిక్ జాయింట్ సిపి డి. జోయల్ డేవిస్, సైబర్ క్రైమ్ డిసిపి ధార కవిత, మరియు అన్ని జోనల్ డిసిపిలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/భువనగిరి :** భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు ప్రతీ సంవత్సరం నవంబర్ రెండవ ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆనవాయితీ ప్రకారం పూర్వ విద్యార్థులు మరియు అక్కడ విద్యను బోధించినటువంటి గురువులు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులతో మమేకమై వారి యొక్క అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ ప్రతాప్ నందిగామ, డాక్టర్ శ్రీకాంత్ పీడియాట్రిషన్, కార్డియాలజిస్టు రాపోలు కరుణాకర్, జనరల్ ఫిజీషియన్ రామయ్య, బిఎస్ఎన్ఎల్ ఇంజనీర్ చిన్నపాక స్వామి, తెలంగాణ జెన్కో డిఇ ఉప్పలయ్య, సీఐ సైదులు పాల్గొన్నారు.

## భువనగిరిలోని అర్బన్ కాలనీలో అగ్ని ప్రమాదం



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరిలోని అర్బన్ కాలనీలో అగ్నిప్రమాదం ఆదివారం జరిగింది. అర్బన్ కాలనీలోని తడక ప్రమీల ఇంట్లో అగ్ని ప్రమాదం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో ప్రమాదవశత్తు ఇంట్లో మంటలు అంటుకున్నాయి. ఇంట్లో ఉన్న డబ్బు, బంగారం, బియ్యం బట్టలు, బీరువులో ఉన్న పూర్తిగా దగ్ధమయ్యాయి, మంటలు అంటుకున్న సమయంలో ఇంట్లో ఎవరూ లేరు, ఇంట్లో నుండి మంటలు రావడంతో ఇరుగు పొరుగు వారు చూసి ఇంటి తాళం పగలకొట్టి మంటలు ఆర్పారు. సుమారు 5 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితులు తెలిపారు.

## రాజీయే రాజ మార్గం : జిల్లా ఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఈనెల 15 శనివారం రోజు జరిగే స్పెషల్ లోక్అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని, రాజీయే రాజ మార్గమని సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ స్పెషల్ లోక్ అదాలత్ నందు రాజీ పడదగిన కేసులలో, క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబరమైన కేసులు, డ్రంకన్ డ్రైవ్ కేసులు, మోటారు ట్రాన్స్‌పోర్ట్ రోడ్డు నిబంధనలు ఉల్లంఘన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంక్ రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్‌బౌన్స్ ఇలా రాజీపడదగిన కేసుల్లో కక్షిదారులు రాజీ చేసుకోవాలని సూచించారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకొని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృధా చేసుకోవద్దన్నారు. న్యాయశాఖ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్‌లు, ఇతర పోలీస్ సిబ్బంది రాజీపడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీపడేటట్లు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలనుకునేవారు సంబంధిత పోలీస్ అధికారులకు సంప్రదించాలని, లోక్అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని వివరించారు.

## సుధా బ్యాంక్ ఎన్నికలు ఏకగ్రీవం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సుధా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలక వర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల అధికారి మురళీరమణ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ గత పది రోజులుగా కొనసాగి ఆదివారం ముగిసింది. బ్యాంక్ చైర్మన్‌గా మీలా మహదేవ్, వైస్ చైర్మన్‌గా కక్కిరేణి చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. గత పాలకవర్గంలో డైరెక్టర్లు కక్కిరేణి చంద్రశేఖర్, డాక్టర్ మీలా సందీప్, అడ్వకేట్ ఏపూరి శ్రవణ్ కుమార్, బాణావత్ సుజాత తిరిగి ఎన్నిక కాగా కొత్తగా అప్పం శ్రీనివాస్, డాక్టర్ మిన్నా విజయలక్ష్మి , పటేల్ నరసింహారెడ్డి, తోట శ్యాంప్రసాద్, అనంతుల శారదలు ఎన్నికయ్యారు. అనంతరం వారితో ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. గత ఏడు సార్లుగా పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక కావడం సహకార బ్యాంకుల చరిత్రలో ఒక రికార్డుగా ఎన్నికల అధికారి చెప్పారు. బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ మాట్లాడుతూ బ్యాంక్ యొక్క పనితీరు బ్యాంక్ అందిస్తున్న ఉత్తమ సేవల ఫలితంగా సుధాబ్యాంక్ పట్ల వాటాదారులలోను ఖాతాదారులలోను అచంచలమైన విశ్వాసం ఏర్పడిందన్నారు. ఈ ఎన్నిక ద్వారా అతి తేటతెల్లమైనందని చెప్పారు. వాటాదారులందరూ ఈ ఎన్నికల ద్వారా మాపై ఉంచిన విశ్వాసాన్ని మరిన్ని మెరుగైన ఫలితాలతో నిరూపించుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## సాగర్ ఎడమ కాలువలో పడి లారీ డ్రైవర్ గల్లంతు



**ప్రజాపక్షం/గరిడేపల్లి :** మండలంలోని మర్రికుంట గ్రామ సమీపంలో ఉన్న సాగర్ ఎడమ ప్రధాన కాలువలో ప్రమాదవశాత్తు పడి లారీ డ్రైవర్ గల్లంతయ్యాడు. గల్లంతైన లారీ డ్రైవర్ మంచిర్యాల జిల్లా రాజీవ్ నగర్‌కు చెందిన ఈట శ్రీకాంత్‌గా పోలీసులు గుర్తించారు. చెన్నై నుంచి కెమికల్ బ్యాగ్స్ లోడుతో మంచిర్యాలకు వెళ్తుండగా ఆదివారం మధ్యాహ్నం గరిడేపల్లి మండలం మర్రికుంట సమీపంలోని సాగర్ ఎడమ ప్రధాన కాలువ వద్దకు చేరుకున్నారు. అక్కడ లారీని ఆపి డ్రైవర్ క్లీనర్ ఇతర లారీ డ్రైవర్లతో కలిసి వంట చేసుకొని భోజనం చేసి కాళ్లు చేతులు కడుక్కునేందుకు కాలువ ఒడ్డుకు చేరుకున్న క్రమంలో ఈట శ్రీకాంత్ (36) అనే లారీ డ్రైవర్ కాలువలో పడి గల్లంతయ్యాడు. గరిడేపల్లి ఎస్ఐ చలికంటి నరేష్ పర్యవేక్షణలో గల్లంతైన వ్యక్తి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## 96వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లాలో 300 ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన 96వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని డీసీవో ఎం.పత్యానాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని అవంతీపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రంలోని ధాన్యం రాశులను పరిశీలించి ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, 17శాతం తేమ ఉంటేనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. జిల్లా వ్యాప్తంగా మరో 75 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.158 కోట్లను రైతుల ఖాతాల్లో జమా చేయడం జరిగిందన్నారు. అవంతీపురం మార్కెట్‌యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయకుండానే అడ్డదారులు ట్రక్‌షీట్ జారీ చేయడంపై డీసీవో విచారణ నిర్వహించారు. అడ్డదారులో ట్రక్ షీట్ జారీ చేయడంపై డీసీవో విచారణ నిర్వహించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఏడీఏ డి.సైదానాయక్ ఉన్నారు.

## బాలభవన్ కార్యక్రమాలతో సృజనాత్మకత

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** బాలభవన్‌లో నిర్వహించే కార్యక్రమాలు విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతక ఎంతో ఉపకరిస్తాయని విశ్రాంత అధ్యాపకులు హమీద్‌ఖాన్, హైమావతి, అడ్వకేట్ కృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో ఆదివారం బాలభవన్ నాల్గవ వార్షికోత్సవం, నవంబర్ 14 బాలల దినోత్సవాల సందర్భంగా నిర్వహించిన డ్యాన్స్, డ్రాయింగ్, వాయిద్యం, సంగీతం, క్రాఫ్ట్, లలిత కళల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బండి రాధా కృష్ణరెడ్డి, సైంటిస్ట్ డాక్టర్ అనంతుల రవిశేఖర్, గిన్నీస్ బుక్ రికార్డు హోల్డర్, కళాకారులు డాక్టర్ పెండెం కృష్ణ కుమార్, సిబ్బంది దాసరి ఎల్లయ్య, సత్యనారాయణ సింగ్, ఉమారాణి, అనిల్, సాయి, వీరయ్య, పద్మ పాల్గొన్నారు.



# బిసి రిజర్వేషన్లు సామాజిక తెలంగాణ నిర్మాణంలో కీలక అడుగు

### తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం



**ప్రజాపక్షం/సూర్యాపేట :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన సామాజిక తెలంగాణ నిర్మాణంలో కీలక అడుగని తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆదివారం సూర్యాపేటలోని తిరుమల గ్రాండ్ కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ జనసమితి జిల్లా కమిటి ఆధ్వర్యంలో యువజన సమితి నాయకులు నారబోయిన కిరణ్ అధ్యక్షతన నిర్వహించిన సామాజిక తెలంగాణ బిసి రిజర్వేషన్లు ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంపై జరిగిన సద్సులో ప్రధాన వక్తగా పాల్గొని ఆయన మాట్లాడారు. సదస్సు ప్రారంభంలో మహాత్మాజ్యోతిరావుపూలే, బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. తెలంగాణ ప్రజలు ఎన్నో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఆధిపత్య వర్గాల బదలాయింపుకు కాదన్నారు. ప్రజలందరికి భాగస్వామ్యం కల్పించడం కొరకు సాధించుకున్నామన్నారు. ఆ దిశగా అడుగులు వేయడమే తెలంగాణ ప్రజల యొక్క కర్తవ్యమని స్పష్టం చేశారు. బిజెపి మొదటి నుంచి కులగణనకు వ్యతిరేకమని, రాష్ట్ర ప్రభుత్వం కుల గణన ప్రారంభించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. అందరూ ఐక్యంగా పోరాడి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు సాధించాలన్నారు. ప్రజలకు కావల్సింది ఉచిత పథకాలు కాదు సమానత్వం, ఆత్మగౌరవం అన్నారు. రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టాలు, ఆర్డినెన్స్‌లను గవర్నర్లు ఆమోదం తెలపకపోవడం దురదృష్టకరమన్నారు. రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దనేది సుప్రీం కోర్టు తీర్పు కాదని, 1931 బిసి సెన్సస్, 1961 సెన్సస్, 1979 మండల కమీషన్ రిపోర్టులను పరిగణలోనికి తీసుకొని అప్పటి పరిస్థితుల్లో కోర్టు ఆ అభిప్రాయం వ్యక్తం చేస్తిందని వివరించారు. రిజర్వేషన్లు సవరించుకోవచ్చని మండల కమీషన్ రిపోర్టులోనే ఉందన్నారు. రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి న్యాయ సమీక్ష నుండి రక్షణ కల్పించాలన్నారు. ప్రజలు ఎన్నుకున్న శాసనసభ చట్టం చేసి పంపితే దాన్ని తిరస్కరించే అధికారి గవర్నర్లకు లేదన్నారు. గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ ఏజెంట్లుగా వ్యవహరిస్తూ ఫెడరల్ వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక అసమానతలను నిర్మూలించడంలో రిజర్వేషన్లు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. తెలంగాణ జన సమితి పార్టీ ఏర్పడిందే సామాజిక ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం కోసమన్నారు. పదేండ్ల టిఆర్ఎస్ పాలనలో బిసిలకు అన్యాయం జరిగిందని, ఉన్న రిజర్వేషన్లను కూడా తగ్గించారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా సదస్సులు, సెమినార్లు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కలిగిస్తామని, డిసెంబర్‌లో హైదరాబాద్‌లో భారీ ర్యాలీ, జనవరిలో ఢిల్లీలో దీక్షలు, ధర్నాలు నిర్వహిస్తామని ప్రకటించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ మాట్లాడుతూ బిజెపి నాయకులు ఇక్కడ మద్దతు తెలపడం కాదు ఢిల్లీలో ఉన్న పార్టీ వైఖరి ఏమిటో చెప్పే విధంగా ఆ పార్టీ నాయకత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. అనంతరం సదస్సు పలు తీర్మానాలను ఆమోదించింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గట్ల రమాశంకర్, విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు నాగరాజు గౌడ్, బిసి జెఏసి కన్వీనర్ చల్లమల్ల నరసింహ, లీగల్‌సెల్ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ నాయక్, విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు బొమ్మగాని వినయ్‌గౌడ్ పాల్గొన్నారు.

## రాష్ట్ర కళ సాధన కోసం యాదవ బిడ్డలు కృషి

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, క్యామా మల్లేష్

### రాష్ట్రాభివృద్ధికి అందరూ ముందుకు రావాలి



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** రాష్ట్రా అభివృద్ధికి అందరూ ముందుకు రావాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, బిఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్చార్జి క్యామ మల్లేష్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు పుట్టా వీరేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యాదవ సదర్ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర కళ సాధన కోసం యాదవ జాతి బిడ్డలు ఎంతో కృషి చేసారని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, క్యామా మల్లేష్ అన్నారు. ప్రతి సంవత్సరం అందరూ కలిసి ఈ సదరు సమ్మేళనం కార్యక్రమం అందరూ కలిసిని ర్వహించడం గొప్ప విషయం అన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలను ముందు తరాలకు తెలియజేయాలన్నారు. ముందుగా భువనగిరిలోని సాయిబాబా గుడి నుండి జూనియర్ కళాశాల మైదానం వరకు దున్నపోతులను ఊరేగిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఈ సమ్మేళన కార్యక్రమానికి దున్నపోతుల విన్యాసాలను వీక్షించడానికి పట్టణ ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల నుండి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్చార్జి క్యామ మల్లేష్, తెలంగాణ గౌట్ అండ్ షిప్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్, తోట స్వామి యాదవ్, జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్, నక్కల చిరంజీవి యాదవ్, బెల్లి శేఖర్ యాదవ్, శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుండెబోయిన సురేష్ యాదవ్, మేకల బాల నరసింహయాదవ్, మల్లయ్య, సిరబోయిన వెంకటేష్ యాదవ్, అవిశెట్టి రమేష్ యాదవ్, రేకల రమేష్ యాదవ్, రాశల నవీన్ యాదవ్, పర్వతం రంజిత్ యాదవ్, బాద్కా అశోక్ యాదవ్, శ్రీరామ్ శరత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## కార్తీక వనభో'జనం' సందడి

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట పట్టణ పరిధిలో గల కొహ్యేన్స్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్, సూర్యాపేట యూనిట్ వారి ఆధ్వర్యంలో కంపెనీలో పనిచేస్తున్న అధికారులు, కార్మికులు, వర్కర్స్, వారి కుటుంబ సభ్యులందరూ ఆదివారం కార్తీక వనభోజనాల కార్యక్రమం కంపెనీ పరిసర ప్రాతంలో అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. స్వాగత తోరణాలతో, సెల్ఫీ పాయింట్లతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆకాశమంత పందిరిలా ఉన్న వనంలో కంపెనీలో విధులు నిర్వహిస్తున్న చిన్న, పెద్ద తేడా లేకుండా కంపెనీ ఉద్యోగులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం, కార్తీక వనభోజనాల రూపేనా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పైలా శంకర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిధిగా యూనిట్ హెడ్ ఎం రమేష్ బాబు హాజరై మాట్లాడారు. వన భోజనం విశిష్టత గురించి ఉద్యోగ కుటుంబాలకు రోడ్డు భద్రత, ఆరోగ్య భద్రత, సంక్షేమం ఉద్యోగులకు ఐక్యత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధిపతులు పిజె రాయుడు, ఎంవి రమణ, ఆర్‌వి రమణ, రమణారెడ్డి, సాయికుమార్, సిహెచ్ నరేష్, సైదులు, ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బుద్ధవనం సందర్శించిన విదేశీ బౌద్ధ భిక్షువులు



**ప్రజాపక్షం/నందికొండ:** అంతర్జాతీయ పర్యాటక కేంద్రం బుద్ధవనాన్ని థాయిలాండ్ బౌద్ధ భిక్షువులు సందర్శించారు. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాలోని సిద్ధార్థ బుద్ధ విహార నుండి బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య సూచన మేరకు నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం సందర్శించారు.గగన్ మాలిక్ ఫౌండేషన్,గుల్బర్గా బౌద్ధ విహార సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి దమ్మయాత్ర కోసం ఈబృందం బుద్ధవనం సందర్శించారు. వీరికి బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దమ్మ చారి శాసన,ఎస్టేట్ ఆఫీసర్ రవి చంద్ర, బుద్ధవనంఆర్ట్స్ ప్రమోషన్ మేనేజర్ శ్యాంసుందర్ రావులు బుద్ధవనం విశేషాలను వివరించారు. వీరు ముందుగా బుద్ధవనం సందర్శనలో భాగంగా బుద్ధ చరిత వనంలోని బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించి బుద్ధ వందనం సమర్పించారు.అనంతరం బుద్ధ చరితవనం,జాతక వనం,ధ్యానవనం,స్థూప వనం, మహాస్తుపాలను సందర్శించి బుద్ధ వనంలోని శిల్పాల ఏర్పాట్లపై ప్రశంసించారు.ప్రశాంత వాతావరణంలో అలనాటి బౌద్ధ వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించి వారికి ప్రేరణ కలిగించడం ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు.నాగార్జునసాగర్‌లోని ప్రశాంత వాతావరణంలో బుద్ధవనాన్ని ఏర్పాటు చేయడం ప్రపంచ బౌద్ధ భిక్షువులకు ఒక ఆరాధన కేంద్రంగా విలసిల్లుతున్నదని అన్నారు. బుద్ధా వనం అంతర్ భాగంలోని ధ్యాన మందిరంలో బుద్ధం,సంఘం,బుద్ధం శరణం అనే బుద్ధుని ప్రాథమిక దమ్మ ప్రబోధాన్ని తెలియజేశారు. బుద్ధ ధర్మం గురించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుల్బర్గా నుండి వచ్చిన థాయిలాండ్, కంబోడియా,యుఎస్ఏ, భారతదేశ బౌద్ధ బిక్షులు,ఉపాసకులు పాల్గొన్నారు. థాయిలాండ్ ఉపాసిక లిథ, బుద్ధ విహార గుల్బర్గా నుండి రతన జ్యోతో, నాగార్జునసాగర్ డ్యాం భద్రత అధికారులు శ్రీనివాసరావు,రఘు ,పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## కుక్కల సమస్యలపై పాల్వంచ హరికిషన్ కార్టూన్



**ప్రజాపక్షం/ రామన్నపేట:** బడులు, బస్టాండ్ వద్ద కుక్కల వద్ద తీవ్రంగా ఉన్న కుక్కల సమస్యకు పరిష్కారం చూపుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సందర్భంగా మరో సమస్య(కోతులు)ను కూడా ఎత్తి చూపుతూ రామన్నపేట మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త, కవి, ఉపాధ్యాయుడు, కార్టూనిస్టు పాల్వంచ హరికిషన్ వేసిన కార్టూన్ ఆలోచింపచేసేదిగా ఉంది. ముఖ్యమైన ప్రాంతాలైన బడులు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు, ఆట స్థలాలు తదితర జనావాసాల్లో కుక్కలను నిబంధనల ప్రకారం కట్టడి చేయాలని సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలకు ఆర్డర్ వేయడం మంచి నిర్ణయమని హరికిషన్ అన్నారు. అదేవిధంగా తెలంగాణాలోని అన్ని ప్రాంతాల్లో కుక్కల సమస్యతోపాటు కోతుల సమస్య కూడా తీవ్రంగా ఉందని ఆ సమస్యకు కూడా నిబంధనల ప్రకా రం పరిష్కారం చూ పాలని ఈ వ్యంగ్య చిత్రం ద్వారా కోరుతున్నానని, కోర్టులు, ప్రభుత్వాలు తగిన నిర్ణయం తీసుకోవాలని, ప ర్యావరణ పరిరక్షనలో కూడా సముచితమైన అంశంగా చూడాలని ఆయన కోరారు.

## దేవాలయ భూముల పరిరక్షించాలి



**ప్రజాపక్షం/ కోదాడ:** కోదాడ పట్టణ పరిధి కోదాడ, ఖమ్మం ప్రధాన రహదారి సమీపంలోని ఎంతో విలువైన దేవాలయ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని వాటిని అధికారులు పరిరక్షించాలని కోదాడ సిపిఐ మండల పార్టీ ప్రదాన కార్యదర్శి బత్తినేని హనుమంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం గుంటూరు జిల్లా అమరావతిలో ప్రముఖ శివాలయానికి చెందిన రెండు ఎకరాల 13 కుంటలు, తమ్మర బండపాలెం శ్రీబాలాజీ దేవాలయానికి చెందిన 2 ఎకరాల 16 కుంటల భూమి ఉన్నది. గతంలో ఓజాతీయ పార్టీకి చెందిన నాయకులు అక్రమణకు ప్రయత్నిస్తే సిపిఐ పార్టీ ఆందోళనలతో నాడు ఆక్రమణను అడ్డుకున్నామని, నేడు తిరిగి దేవాయల భూముల ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని దేవాదాయ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో అడ్డుకోవాలని లేని పక్షంలో తమ పార్టీ ఆందోళ చేయవలసి వస్తుందని హెచ్చరించారు. ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా పేదలకు పంపిణీ చేశాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు మేకల శ్రీనివాసరావు పాల్గన్నారు.

## సాహిత్యం అభ్యుదయ సమాజాన్ని కాంక్షించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సమాజంలో విలువలను పరిరక్షించేది సాహిత్యమేనని ప్రముఖ సాహితీవేత్త సుంకిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సమాజంలో అనివార్యంగా వస్తున్న మార్పులను సాహిత్యకారులు స్వాగతించాలని నేటి తరం విద్యార్థులు సమకాలీన సాహిత్యంపై జరుగుతున్న సాహిత్య సదస్సులకు సమావేశాలకు హాజరై నూతన విషయాలను తెలుసుకోవాలి అన్నారు. ఆదివారం గ్రంథాలయ ఉద్యమకారులు వట్టి కోట ఆళ్వారు స్వామి జయంతి ఉత్సవాల సందర్భంగా తెలంగాణ సాహితీ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన సాహిత్య సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ సాహిత్య సృజనలో పుస్తకాల ముద్రణలో, ఆ పుస్తకాలను పాఠకులకు చేర్చడంలో వస్తున్న నూతన విధానాలను అందిపుచ్చుకోవాలన్నారు.తెలంగాణ సాహితీ చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. పాఠశాల స్థాయి పిల్లలనుండి యూనివర్సిటీ స్థాయి విద్యార్థుల వరకు తెలంగాణ సాహిత్య సమావేశంలో పాల్గొనడం అభినందనీయమన్నారు.నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధాన ఆచార్యులు ప్రొఫసర్ బెల్లి యాదయ్య విద్య సమాజం అనే అంశంపై ప్రసంగించారు. ఏ సమాజం అభివృద్ధి చెందాలన్నా విద్యారంగం అభివృద్ధి చెందాలని, అందుకోసం సమా జం ఉపాధ్యాయులు కృషి చేయాలని యాదయ్య ఆకాంక్షించారు. తెలంగాణ సాహితి ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు కుకుడాల గోవర్ధన్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య,రిటైర్డ్ ఐఏఎస్ చోల్లేటి ప్రభాకర్,అద్దంకి కృష్ణమాచార్య,ప్రముఖ కవి విమర్శకులు మేరెడ్డి యాదగిరి రెడ్డి,బైరెడ్డి కృష్ణారెడ్డి,డాక్టర్ సలీమా,ఏభూషి నరసింహ,నల్లా నర్సింహ,అంబటి వెంకన్న డాక్టర్ పగడాల నాగేందర్,భూంత ముత్యాలు,మునాస్ వెంకట్ ,పెరుమాల్ల ఆనంద్, డాక్టర్ ఉప్పల పద్మ,డాక్టర్ సాగర్ల సత్తయ్య,కోమటిరెడ్డి బుచ్చిరెడ్డిలు పాల్గొన్నారు.


## బిసి రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలి : ప్రసన్న కుమార్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బీసీలకు విద్య,ఉద్యోగ,స్థానిక సంస్థల ఎన్నికలలో 42 రిజర్వేషన్లు కల్పించడం కోసం రాజ్యాంగ సవరణ చేయాలని బీసీ జేఏసీ చైర్మన్ మునాస ప్రసన్న కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక పట్టణంలోని టిఎన్‌జిఓ భవన్‌లో నిర్వహించిన కుల సంఘాల సమావేశంలో 40 కుల సంఘాలకు సంబంధించిన నాయకులు పాల్గొనడం జరిగింది. అన్ని కుల సంఘాల నాయకులు బీసీ జేఏసీ చైర్మన్ మునాస ప్రసన్నకుమార్‌ని జిల్లా జేఏసీ చైర్మన్‌గా ఆమోదం తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే ఏ కార్యక్రమాన్నైనా విజయవంతం చేయాలని కుల సంఘాల నాయకులందరూ తీర్మానించడం జరిగింది. డిసెంబర్ ఫస్ట్ నుంచి నిర్వహించే పార్లమెంటు సమావేశాలలో బీసీ బిల్లు కోసం ప్రతిపక్షాలుచ,అధికారపక్షం పార్లమెంట్లో చర్చించి బీసీ బిల్లును ఆమోదింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ మన్మయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుంటోజు వెంకటాచారి,రజక సంఘం జిల్లా అధ్యక్షులు చిలుక రాజు చెన్నయ్య,మున్నూరు కాపు సంఘం వైద్యుల సత్యనారాయణ,పాల్వాయి రవి,గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల శంకర్ గౌడ్,పద్మశాలి సంఘం కర్నాటి యాదగిరి,యాదవ సంఘం చెన్నూరి భరద్వాజ యాదవ్,మేరు సంఘం నవీన్ కుమార్,ముదిరాజ్ సంఘం దుడ్డు కృష్ణమూర్తి,బెస్త సంఘం అంబటి శివకుమార్, మైనార్టీ నాయకులు ఖదీర్,వివిధ కుల సంఘాల నాయకులు పందుల సైదులు గౌడ్,గండిచెరువు వెంకన్న గౌడ్,అయితగోని జనార్దన్ గౌడ్,పుట్ట వెంకన్న గౌడ్,మార్గం సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


## గేదెలను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

**ప్రజాపక్షం/మోటకొండూరు :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామ ప్రధాన రహదారిపై చర్చి ఆవరణలో తొర్రూర్ డిపోకు చెందిన టి ఎస్ 26 జెడ్ 0030 నెంబర్ గల ఆర్టీసీ బస్సు గేదెలను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఒక గేదెకు బస్సు బలంగా ఢీకొట్టడంతో ఒక గేదె చావు బ్రతుకుల మధ్య నడిరోడ్డు మీద కొట్టుమిట్టులాడుతు మృతి చెందింది. పాడి గేదె నిండు సుడితో ఉండడంతో గేదె మరణం స్థానికులను గ్రామస్తులను కలచివేసింది. ఈ ఘటన చూసిన గ్రామానికి చెందిన గేదెల కాపరి, యజమాని అదేపు సోములు అక్కడే సొమ్మసిల్లి పోవడంతో అతని ఆస్పత్రికి తరలించారు. ఘటన జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ బస్సు దూకి పరారయ్యాడు. బాధితుడికి న్యాయం చేయాలని కోరుతున్న గ్రామస్తులు, ప్రధాన రహదారిపై కాసేపు స్వల్ప ట్రాఫిక్ జాబ్ గేదెలను రోజువారీగా మేత అనంతరం ఇంటికి తరలిస్తుండగా ప్రమాదం జరిగింది అని స్థానికులు తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న స్థానిక ఎస్సై అశోక్ ప్రమాదానికి గల వివరాలు సేకరిస్తున్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## అండమాన్ నికోబార్ దీవుల్లో భారీ భూకంపం



**పోర్ట్ బ్లెయిర్ :** అండమాన్ నికోబార్ దీవుల్లో భారీ భూకంపం సంభవించింది. ఆదివారం మధ్యాహ్నం సమయంలో భూమి ఒక్కసారిగా కంపించింది. రిక్టర్ స్కేలుపై భూకంపం తీవ్రత 5.4గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 90 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించినట్లు తెలిపింది. అయితే, జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ ప్రకారం.. దీని తీవ్రత 6.07గా నమోదైంది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు తెలిపింది. ఈ భూకంపం ధాటిని ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించి ఇప్పటి వరకూ ఎలాంటి సమాచారం లేదు.

## బిహార్‌లో మార్పు పవనాలు

### రాష్ట్రం యువ, శక్తివంతమైన సిఎంను చూడబోతోంది : అఖిలేశ్



**రాయ్‌పూర్ :** బిహార్ అంతటా మార్పు పవనాలు వీస్తున్నాయని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ చెప్పారు. ఆ రాష్ట్రంలో జరుగుతన్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం దిశగా దూసుకుపోతోందన్నారు. ఒడిశాకు బయలుదేరే ముందు ఛత్తీస్‌గఢ్‌లో రాయ్‌పూర్‌లోని స్వామి వివేకానంద విమానాశ్రయంలో కొద్దిసేపు విలేకరులతో మాట్లాటారు. బిహార్ ప్రజల మానసిక స్థితి 36 ఏళ్లు నిండిన ఆర్‌జెడికి చెందిన యువ, శక్తివంతమైన ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ పట్ల ఉన్న కోరికను స్పష్టంగా సూచిస్తుందని యాదవ్ అన్నారు. 'మీ కెమెరా చూపించే దానికంటే నేను చెప్పేది చాలా తక్కువ. నిజమైన ప్రజా మద్దతు ఎక్కడ ఉందో కెమెరా సంగ్రహిస్తోంది' అని మాజీ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అన్నారు. బిహార్ మార్పు తీసుకురావడంతో పాటు, యువ ముఖ్యమంత్రిని ఎన్నుకోబోతోంది. కొత్త ముఖ్యమంత్రిని, కొత్త శక్తితో కూడిన యువ సిఎం పొందబోతోంది. ఆదివారం తేజస్వీ యాదవ్ పుట్టినరోజు. యాధృచ్ఛికంగా అదే రోజు బిహార్‌లో ప్రచారానికి చివరి రోజు. ఆయనకు ప్రజల మద్దతు ఉంది' అని ఆయన అన్నారు. బిహార్‌లో ఆర్‌జెడి నేతృత్వంలోని మహాఘట్బంధన్, ఇండియా కూటమి విజయం దిశగా పయనిస్తున్నాయని, ఎన్నికల తర్వాత ఆవిజయం జాతీయస్థాయిలో కూటమిని మరింత బలోపేతం చేస్తుందని యాదవ్ పేర్కొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా చొరబాటుదారుల గురించి చేసిన వ్యాఖ్య గురించి అడిగినప్పుడు, యాదవ్ బిజెపిపై తీవ్రంగా విమర్శిస్తూ, 'ఘుస్పీథియే (చొరబాటుదారుల) కంటే గూస్ (లంచాలు) పైనే ఎక్కువ దృష్టి పెడుతుంది' అని మండిపడ్డారు. 'బిజెపి 11 సంవత్సరాలకు పైగా అధికారంలో ఉంది. ఈ కాలంలో చొరబాటుదారులు దేశంలోకి ప్రవేశించినట్లయితే, ఎవరు బాధ్యత వహిస్తారు? ఈ 11 సంవత్సరాలలో ఎంతమంది చొరబాటుదారులు వచ్చారో, ఎంతమంది అంతకు ముందు వచ్చారో (2014) బిజెపి స్వయంగా ఒక జాబితాను తయారు చేయాలని సవాల్ చేశారు. ఉత్తరప్రదేశ్ ప్రజలు గత లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని తిరస్కరించి తమ తీర్పును ఇప్పటికే ఇచ్చారని ఎస్పీ చీఫ్ అన్నారు. బిజెపి క్రైస్తవులు, ముస్లింలతో సహా వెనుకబడిన తరగతులు, దళితులు, గిరిజనులు, మైనారిటీలపై వివక్ష చూపిందన్నారు. వారందరూ పిడిఎ గొడుగు కింద ఐక్యమై బిజెపికి గుణపాఠం నేర్పించారని స్పష్టం చేశారు. బిజెపి తరుచూ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల గురించి మాట్లాడుతుంది కానీ, వారి మత రాజకీయాలు ప్రారంభమైన ప్రదేశాలలో కూడా ప్రజలు వారికి గుణపాఠం నేర్పారన్నారు. బిజెపి ఒకప్పుడు మత రాజకీయాలు ప్రారంభించిన చోటనే ఓడిపోయిందని గుర్తుచేశారు. రామ జన్మభూమి ఉద్యమానికి కేంద్రంగా ఉన్న అయోధ్యతో సహా ఫైజాబాద్ లోక్‌సభ స్థానంలో బిజెపి ఓటమిని ప్రస్తావించారు. సమాజ్‌వాదీ పార్టీ ఇతర రాష్ట్రాల్లో విస్తరించడానికి కృషి చేస్తోందని యాదవ్ అన్నారు.

## 'ఓటు చోరీ' అడ్డుకుంటే బిహార్‌లో
# కూటమిదే అధికారం

### బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దేశాన్ని విభజించడానికి ప్రయత్నిస్తోంది : రాహుల్‌గాంధీ



**కిషన్‌గంజ్ :** ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత మరోమారు మండిపడ్డారు. వారు ఎక్కడికైనా వెళ్ళవచ్చు, కానీ చివరికి 'ఓటు చోరీ' చేసినందుకు పట్టుబడతారని పేర్కొన్నారు. ఆదివారం బిహార్‌లోని కిషన్‌గంజ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో రాహుల్‌గాంధీ ప్రసంగించారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దేశాన్ని విభజించడానికి ప్రయత్నిస్తున్నాయని, ఇండియా కూటమి దేశాన్ని ఏకం చేయడానికి ప్రయత్నాలు చేస్తోందన్నారు. మోదీ, షా, ఎన్నికల కమిషన్ తాము చేసిన 'ఓటు చోరీ' (ఓటు దొంగతన) ఆరోపణలకు ఎటువంటి సమాధానాలుఇవ్వలేదన్నారు. ఎందుకంటే నిజం ఇప్పుడు ప్రజల ముందు బయటపడిందని, ప్రధానమంత్రి, షా వారు ఇష్టపడే చోటికి వెళ్ళవచ్చు, కానీ చివరికి 'ఓటు చోరీ' చేసినందుకు పట్టుబడతారని రాహుల్‌గాంధీ హెచ్చరించారు.

ఇటీవల రెండు కోట్ల మంది ఓటర్లు ఉన్న హర్యానాలో, ఓటర్ల జాబితాలో దాదాపు 25 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నట్లు తాను బయటపెట్టానన్నారు. దీనిపై ఇప్పటివరకు మోదీ లేదా (ప్రధాన ఎన్నికల కమిషనర్) జ్ఞానేష్ కుమార్ 'రాహుల్ గాంధీ అబద్ధం చెబుతున్నాడు' అని చెప్పే ధైర్యం చేయలేదన్నారు. ప్రజలు కలిసి వచ్చి ఓట్ల దొంగతనాన్ని ఆపితే, ఇండియా కూటమి బిహార్‌లో 100 శాతం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని రాహుల్‌గాంధీ ఉద్ఘాటించారు. బిహార్‌లో 'మహాఘట్బంధన్' తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని కచ్చితంగా చెప్పగలనన్నారు. అందుకు నూటికి నూరు శాతం అవకాశం ఉందని చెప్పారు. అయితే అందుకు బిజెపిని ఓటు దొంగతనం నుండి నిరోధించాలని పిలుపునిచ్చారు. ఓట్లు వేసే రోజున (నవంబర్ 11) పోలింగ్ కేంద్రాల వద్ద జాగ్రత్తగా ఉండాలని, బిహార్‌లో ఓటు దొంగతనాన్ని అడ్డుకోవడం ఇప్పుడు ప్రతి యువకుడు, కార్మికుడు, రైతు విధి' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. ముస్లింలు ఎక్కువగా ఉన్న బిహార్‌లోని సీమాంచల్ ప్రాంతంలో రాహుల్ మాట్లాడుతూ, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఓట్ల దొంగతనం నుండి దృష్టిని మళ్లించే లక్ష్యంతో 'విభజన ఎజెండా'ను అనుసరిస్తున్నాయని రాహుల్‌గాంధీ అన్నారు. మోదీ, షా ప్రజల గొంతుకు భయపడుతున్నారని, వారు భారతదేశ ఆత్మకు ద్రోహం చేశారని చెప్పారు. ఈ కేసులో వారు పట్టుబడటం ఖాయమన్నారు. ప్రధానమంత్రి ఆర్థిక విధానాలే రాష్ట్రంలో ఉపాధి కల్పన దుర్భరమైన స్థితికి కారణమని, ఆయన మిత్రుడు, బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌పై కూడా రాహుల్ మండిపడ్డారు. బెంగళూరు వంటి నగరాల్లో, అరుణాచల్ ప్రదేశ్ వంటి సుదూర రాష్ట్రాల్లో బిహార్ ప్రజలు రోడ్లు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రుల నిర్మాణానికి సహాయం చేస్తున్నారని, ఇంత కష్టపడి పనిచేసే వారికి ఇంట్లో పని ఎందుకు దొరకడం లేదని ప్రశ్నించారు. 20 ఏళ్లలో చేపలు, నక్కలు (మఖానా) సమృద్ధిగా పండే రాష్ట్రంలో ఆహార ప్రాసెసింగ్ యూనిట్లను ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారో నితీష్ కుమార్ సమాధానం చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు. కార్మికులుగా ఉండటానికి ఇష్టపడని బిహార్ యువతకు ముఖ్యమంత్రి ఉపాధిని కోరుకోవడం లేదు అని గాంధీ పూర్ణియలో జరిగిన మరో ర్యాలీలో అన్నారు.

## అర్హులను తొలగించకుండా చూసుకోండి

### 'సర్'పై డిఎంకె శ్రేణులకు సిఎం స్టాలిన్ ఆదేశం



**చెన్నై :** తమిళనాడులో ఈనెల 4వ తేదీ నుంచి ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)ను ఎన్నికల కమిషన్ నిర్వహిస్తోంది. అయితే ఈ ప్రక్రియలో అర్హులైన ఓటర్లలో ఎవరినీ తొలగించకుండా చూసుకోవాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ పార్టీ కార్యకర్తలకు హితబోధ చేశారు. ప్రజలతో తాను జరిపిన ముఖాముఖిలో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)పై అవగాహన సరిపోలేదని తేలిందన్నారు. చాలా చోట్ల, బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్‌ఒలు) వంటి పోలింగ్ అధికారులు కూడా దీనిని అర్థం చేసుకోలేదని ప్రజలు వాపోతున్నట్లు స్టాలిన్ పేర్కొన్నారు. డిఎంకె ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో అధికార పార్టీ జిల్లా కార్యదర్శులతో జరిగిన వర్చువల్ ఇంటరాక్షన్‌లో స్టాలిన్ పాల్గొన్నారు. డిఎంకె పార్టీ కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు సర్ సంబంధిత పనిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుత ఈశాన్య రుతుపవనాల కాలంలో సర్ అమలు సమయం గురించి ప్రశ్నించిన డిఎంకె ఈ భారీ ప్రక్రియ మైనారిటీ కమ్యూనిటీ నుండి ఓటర్లను తొలగించడానికి దారితీయవచ్చని పేర్కొంటూ దీనిని వ్యతిరేకిస్తోందని చెప్పారు. నెల రోజుల పాటు జరిగే సవరణ ప్రక్రియ గురించి చర్చించడానికి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన, సర్ ప్రచారంలో అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా మిగిలిపోకూడదని, అనర్హులైన ఓటర్ల పేర్లు జాబితా చేరేలా చూసుకోవాలన్నారు. అందుకు బూత్ స్థాయి ఏజెంట్లను అప్రమత్తంగా ఉండాలని స్టాలిన్ ఆదేశించిటన్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అలాగే సర్ గురించి సరైన వివరణ తర్వాత ఫారంలను ప్రజలకు పంపిణీ చేస్తున్నారా అని ఆయన ఆరా తీశారు.

## నాకు ప్రాణహాని : తేజ్ ప్రతాప్

**పాట్నా :** తనకు ప్రాణహాని ఉందని, తన శత్రువులు తనను చంపే ప్రమాదముందని ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ పెద్ద కుమారుడు, జనశక్తి జనతాదళ్ అధినేత తేజ్ ప్రతాప్ ఆరోపించారు. తన తండ్రి ఆర్‌జెడి నుంచి బహిష్కరించిన తర్వాత ఇటీవలే రాజకీయ పార్టీని స్థాపించిన తేజ్ ప్రతాప్‌యాదవ్, ప్రస్తుతం జరుగుతున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహువా నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఆదివారం ఆయన పాట్నాలో మీడియాతో మాట్లాడుతూ 'నా భద్రత పెంచారు. నాకు ప్రాణహాని ఉంది. నా శత్రువులు నన్ను కూడా చంపవచ్చు. అందరూ శత్రువుల్లా కనిపిస్తున్నారు'అని అన్నారు. అయితే, ఆయన తన శత్రువులు ఎవరో వెల్లడించలేదు. యాదవ్ తన తమ్ముడు తేజస్వీకి పుట్టినరోజు శుభాకాంక్షలు కూడా తెలిపారు. 'నా ఆశీస్సులు ఎల్లప్పుడూ అతనికి ఉంటాయి. ఆయన మరింత ఎదగాలి' అని అన్నారు. తేజ్ ప్రతాప్ మే 25న ఆరు సంవత్సరాల పాటు ఆర్‌జెడి నుండి బహిష్కరించబడ్డారు. ఒక మహిళతో 'సంబంధం'లో ఉన్నట్లు అంగీకరించడంతో ఆయపై పార్టీ క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. అయితే, తన పేజీని 'హ్యాక్' చేశారని పేర్కొంటూ సోషల్ మీడియా పోస్ట్‌ను ఆ తరువాత తొలగించారు.

## 'వందే భారత్' ఎక్స్‌ప్రెస్‌లో ఆర్‌ఎస్‌ఎస్ పాటపై దర్యాప్తునకు ఆదేశం

### ఘటనపై కేరళ ప్రభుత్వం 'సీరియస్'
### అది దేశభక్తి గీతమని సమర్థించుకున్న కేంద్ర మంత్రులు
### తక్షణమే నివేదిక అందజేయాలని డిపిఐని ఆదేశించిన కేరళ సాధారణ విద్యా శాఖ మంత్రి వి.శివన్‌కుట్టి



**తిరువనంతపురం:** ఎర్నాకుళం నుండి బెంగళూరుకు కొత్తగా ప్రారంభించబడిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో పాఠశాల విద్యార్థులు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) పాట పాడటంపై ఆదివారం కేరళ ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది. కేంద్రమంత్రులు ఈ సంఘటనను గట్టిగా సమర్థించుకుంటూ అది దేశభక్తి గీతమని చెప్పినప్పటికీ కేరళ ప్రభుత్వం ఈ విషయంపై సీరియస్‌గా చర్యలు చేపట్టేందుకు సిద్ధమైంది. ఈ ఘటనపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సాధారణ విద్య శాఖ మంత్రి వి.శివన్‌కుట్టి డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్స్ (డిపిఐ)ను ఆదేశించారు. ఈ సంఘటనను ప్రభుత్వం అత్యంత గంభీరంగా పరిగణిస్తుందని మంత్రి కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో శివన్‌కుట్టి తెలిపారు. ఇది లాఉంటే ప్రతిపక్ష కాంగ్రెస్ ఈ సంఘటనను తీవ్రంగా పరిగణిస్తోంది. విద్యార్థులను మతపరంగా వాడుకునేందుకు అనుమతించినందుకు పాఠశాల అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అయితే పాఠశాల యాజమాన్యం మాత్రం చిన్నారుల చర్యను సమర్థించుకుంటూ ప్రత్యేకించి ఆ పాట సందేశం 'భిన్నత్వంలో ఏకత్వానికి' సంబంధించినది అని పేర్కొంది. అంతే కాకుండా వారు అందులో మతతత్వం ఏమి ఉన్నదో తెలుసుకోవడానికి ప్రయత్నించారు. దర్యాప్తునకు ఆదేశించిన మంత్రి శివన్‌కుట్టి మాట్లాడుతూ రాజకీయ కార్యక్రమాలలో పిల్లలను రాజకీయం చేయడం, ఒక నిర్దిష్ట సమూహానికి చెందిన వారి మతపరమైన ఎజెండాను ప్రోత్సహించడానికి వారిని ఉపయోగించడం రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించడమే అవుతుందని అన్నారు. 'పబ్లిక్ సూచనల డైరెక్టర్ (డిపిఐ)ని వెంటనే విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని ఆదేశించాం' అని మంత్రి శివన్‌కుట్టి చెప్పారు. అధికారిక కార్యక్రమంలో విద్యార్థులను పాల్గొనేలా చేయడంలో ఏవైనా లోపాలు ఉన్నాయా అని దర్యాప్తు పరిశీలిస్తుందని, నివేదికలోని ఫలితాల ఆధారంగా తగిన తదుపరి చర్యలు తీసుకుంటాం అని మంత్రి శివన్‌కుట్టి తెలియజేశారు. దేశం యొక్క లౌకిక, జాతీయ విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆ సూత్రాలను పరిరక్షించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి శివన్‌కుట్టి చెప్పారు. అయితే కేంద్ర పెట్రోలియం, సహజవాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి మాత్రం పాఠశాల విద్యార్థులు కొత్తగా ప్రారంభించబడిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆర్‌ఎస్‌ఎస్ పాట పాడటాన్ని సమర్థించారు. 'ఇది పిల్లల అమాయక వేడుకలో భాగం' అని త్రిసూర్‌లో విలేకరులడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. 'వాళ్లకు ఆపాట పాడాలని అనిపించింది. అలాగే చేశారు'. అది ఏమైనా 'తీవ్రవాద పాట' కాదు కదా'అని కేంద్ర మంత్రి సురేశ్ గోపి అన్నారు. రాష్ట్రానికి చెందిన మరో కేంద్ర మంత్రి జార్జి కురియన్ కూడా ఆర్‌ఎస్‌ఎస్ పాట పాడటాన్ని సమర్థించుకున్నారు. 'ఆ గీతంలో మతతత్వం ఏమున్నది' అని అడిగారు. భారత వ్యతిరేక భావాలను ప్రచారం చేయడానికి ప్రయత్నించే వారికి ఈపాట నచ్చకపోవచ్చని కూడా మంత్రి జార్జికురియన్ అన్నారు. ఎలమక్కరలోని సరస్వతీ విద్యానికేతన్ స్కూల్ ప్రిన్సిపాల్ డింటో కె.పి విద్యార్థులు పాట పాడటాన్ని సమర్థిస్తూ ఆ పాటను దేశభక్తి గీతంగా అభివర్ణించారు. దీనిని దక్షిణ రైల్వే నిర్దేశించిన విధంగా పాడలేదని, కానీపిల్లలు దానిని మలయాళ దేశభక్తి గీతంగా పాడాలని ఎంచుకున్నారని ప్రిన్సిపాల్ డింటో కె.పి చెప్పారు. ఈ వివాదం తర్వాత దక్షిణ రైల్వే యొక్క 'ఎక్స్'హ్యాండిల్ నుండి పాటను తొలగించినప్పుడు పాఠశాల అధికారులు ప్రధాన మంత్రి, కేంద్ర రైల్వే శాఖ కార్యాలయానికి లేఖలు పంపారని ప్రిన్సిపాల్ అంగీకరించారు. పాఠశాల అభ్యర్థన మేరకు దక్షిణ రైల్వే ఆ వీడియోను మరుసటి రోజు తర్వాత పోస్ట్ చేయవచ్చని ప్రిన్సిపాల్ డింటో తెలియజేశారు. రాష్ట్ర విద్యాశాఖమంత్రి ఈ విషయమై ఎందుకు దర్యాప్తునకు ఆదేశించారో మాకైతే తెలియదని, ఒకవేళ సాధారణ విద్య విభాగం తన చర్యను చేపట్టేందుకు ముందుకు వెళితే, మేం చట్టపరమైన మార్గంలో వెళ్లే విషయాన్ని మేం ఆలోచిస్తామని ప్రిన్సిపాల్ వివరించారు. ఈ పాట పాడిన పిల్లలు ఎక్కువగా సైబర్ వేధింపులకు గురువుతున్నారని, సామాజిక వేదికలపై వారిని 'సంఘీకిడ్స్'గా ముద్రవేయబడ్డారని డింటో చెప్పారు. ఈసంఘటనను ప్రజాస్వామ్యానికి సవాల్ అని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబి వ్యాఖ్యానించారు. 'కేరళను మతపరంగా మార్చడానికి బిజెపి చేసిన మరో ఉదాహరణ ఇది' అని కేరళ శాసనసభలో ప్రతిపక్ష నాయకుడు వి.డి.సతీషన్ ఆరోపించారు. 'ప్రజల ఖర్చుతో రాజకీయీకరణ అనుమతించబడదు. ఆర్‌ఎస్‌ఎస్ గణగీతాన్ని దేశభక్తి గీతం అని పిలవవచ్చా?' అని ప్రతిపక్ష నాయకుడు ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ఆర్‌ఎస్‌ఎస్ పాట పాడించడం 'చట్ట విరుద్ధం' మరియు 'అప్రజాస్వామికం' అని వ్యాఖ్యానించారు. కొత్తగా ప్రారంభించబడిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో పాఠశాల విద్యార్థులు ఆర్‌ఎస్‌ఎస్ పాట పాడిన ఒక రోజు తర్వాత కేరళలో తీవ్ర ప్రతిచర్యలు ఎదురైన అనంతరం రాష్ట్రప్రభుత్వం ఆదేశించిన దర్యాప్తు నేపథ్యంలో నాయకుల నుంచి తీవ్ర వ్యాఖ్యలు వెలువడ్డాయి. ముఖ్యమంత్రి పినరయి విజయన్ దక్షిణ రైల్వే చర్యను శనివారం ఖండించారు. ఇది నిరసనకు అర్హమైనదన్నారు. మత వ్యతిరేక ద్వేషాన్ని, మత విభజన రాజకీయాలను నిరంతరం వ్యాప్తి చేసే ఆర్‌ఎస్‌ఎస్ పాటను ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో చేర్చడం రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించడమేనని మండిపడ్డారు.

## జమ్ము వ్యాప్తంగా ఉగ్ర వ్యతిరేక చర్యలు
# డజన్లకొద్దీ ప్రదేశాల్లో సోదాలు



**జమ్ము :** ఉగ్ర కార్యకలాపాలకు వ్యతిరేకంగా పోలీసులు జమ్ముకశ్మీర్‌ను జల్లెడ పడుతున్నారు. వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. పాకిస్తాన్ నుండి పనిచేస్తున్న స్థానిక ఉగ్రవాదులు, వారి భూగర్భ కార్మికులను (ఒజిడబ్ల్యులు) లక్ష్యంగా చేసుకున్నారని కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రాంబన్, కిష్త్వార్, దోడా, కథువా, రియాసి, పూంచ్, రాజౌరి జిల్లాల్లోని డజన్ల కొద్దీ ప్రదేశాలలో భారీగాలింపు, కార్డన్ ఆపరేషన్ జరుగుతోందని తెలిపారు. జమ్ములోని దోడా జిల్లాలో భారీ ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ మధ్య శనివారం అనేక మంది అనుమానిత వ్యక్తులను ప్రశ్నించడానికి పిలిచారు. ఎత్తుప్రాంతాలలో పనిచేస్తున్న ఉగ్రవాదులు శీతాకాలంలో దాక్కోవడానికి సురక్షితమేన ప్రదేశాలను వెతుకుతున్నారని నిఘా నివేదికలు సూచించడంతో సోదాలు ముమ్మరం చేశారు. భద్రతా గ్రిడ్‌ను బలోపేతం చేయడానికి, శాంతిని కాపాడటానికి పోలీసులు తమ ప్రయత్నాలను కొనసాగించారు. రాంబన్ జిల్లాలోని బనిహాల్, గూల్ ప్రాంతాలలోని అనేక ప్రదేశాలలో భారీ కార్డన్, సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారని పోలీసు ప్రతినిధి ఒకరు తెలిపారు. రాంబన్ సీనియర్ ఎస్‌పి అరుణ్ గుప్తా పర్యవేక్షణలో ఈ ఆపరేషన్లు బాగా సమన్వయంతో జరిగాయని, పాకిస్తాన్ నుండి కార్యకలాపాలు నిర్వహిస్తున్న జమ్ముకశ్మీర్ స్థానికుల బంధువుల అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడం, అనుమానిత వ్యక్తుల పూర్వీకులను ధృవీకరించడం, దుర్బల ప్రాంతాల చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు. ఈ ఆపరేషన్ల సమయంలో, పాకిస్తాన్, ఒజిడబ్ల్యు నుండి కార్యకలాపాలు నిర్వహిస్తున్న జమ్ముకశ్మీర్‌కు చెందిన చురుకైన ఉగ్రవాదుల బంధువులు, తెలిసిన సహచరుల ఇళ్లను సోదాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. జాతీయ వ్యతిరేక లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరగడం లేదా వారికి మద్దతు ఇవ్వడం లేదని నిర్ధారించడానికి పోలీసు బృందాలు బహుళ ప్రాంగణాలను క్షుణ్ణంగా తనిఖీ చేశాయని ఆ ప్రతినిధి తెలిపారు. జిల్లా అంతటా వివిధ సున్నితమైన ప్రాంతాలను కవర్ చేసే డ్యూటీ మేజిస్ట్రేట్‌లతో పాటు పోలీసులు, సైన్యం, సిఆర్‌పిఎఫ్, ఎస్‌ఒజి యూనిట్ల సంయుక్త బృందాలు ఈ డ్రైవ్‌లను నిర్వహించాయన్నారు. సాధారణ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈ ఆపరేషన్లు వ్యవస్థీకృత పద్ధతిలో జరిగాయని తెలిపారు. ఈప్రాంతంలో శాంతి, స్థిరత్వం చెదిరిపోకుండా ఉండేలా కొనసాగుతున్న నివారణ, నిఘా ఆధారిత చర్యలలో ఇటువంటి ఆపరేషన్లు ఒకభాగమని చెప్పారు. దేశ వ్యతిరేక నెట్‌వర్క్‌ను నిర్వీర్యం చేయడానికి, అన్ని పౌరుల భద్రతను నిర్ధారించడానికి పోలీసులు కట్టుబడి ఉన్నారని, చట్ట అమలు సంస్థలతో సహకరించాలని, వారి ప్రాంతాలలో అనుమానాస్పద కదలికలు లేదా వ్యక్తులకు సంబంధించిన ఏదైనా విలువైన సమాచారాన్ని పంచుకోవాలని ప్రజలను అభ్యర్థించారు. సమాచారం ఇచ్చేవారి గుర్తింపును గోప్యంగా ఉంచుతామని ఆయన హామీ ఇచ్చారు.

## బిహార్ ఎన్నికల్లో ప్రత్యర్థులపై ...
# గొప్ప రాజకీయ అస్త్రం 'జంగిల్‌రాజ్'

### ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా, సిఎం నితీశ్‌కుమార్ నోట ప్రతీచోటా ఇదే జపం

**పాట్నా/జెహానాబాద్ :** దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తున్న బిహార్ శాసనసభ ఎన్నికలలో అధికారపక్షం, ప్రతిపక్షకూటమిపై పదేపదే ప్రయోగిస్తున్న 'జంగిల్‌రాజ్' పదబంధం ఇప్పుడు మరింత హాట్ టాపిక్‌గా మారుతోంది. బిహార్ శాసనసభ ప్రస్తుత బిహార్ శాసనసభ ఎన్నికలలో 'జంగిల్ రాజ్' అనే పదబంధం ఒక గొప్ప రాజకీయ ఆయుధంగా మారింది. ఇప్పుడు బిహార్ ఎన్నికల సందర్భంగాప్రచార స్థలాలు, సోషల్ మీడియా వేదికలు, టీవీ స్టూడియోలు, ప్రజల జ్ఞాపకాలలో కూడా రాజకీయ ప్రత్యర్థుల మధ్య కూడా భీకర పోరాటాలు జరుగుతున్నాయి. ప్రజా జ్ఞాపకాల యుద్ధ భూమిలో కీలక రాజకీయ ప్రత్యర్థులకు బహుశా మరే ఇతర పదబంధం జంగిల్ రాజ్ అనే పదబంధానికి మించిన గొప్ప రాజకీయ అస్త్రంగా మారలేదు. ఈ పదాన్ని జెడి(యు), దాని ప్రధాన మిత్రపక్షం బిజెపి నాయకులు ఆర్‌జెడి, ప్రతిపక్ష కూటమిపై దాడి చేయడానికి తరచుగా ఉపయోగిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షా, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ సహా అధికార ఎన్‌డిఎ కేంద్ర, రాష్ట్ర నాయకులు వారి ప్రచార సందర్భాలలో 'జంగిల్ రాజ్' అనే అపఖ్యాతిపాలైన పదబంధాన్ని ఉపయోగిస్తూ రెచ్చగొట్టారు. 2025 మొదటి దశ అసెంబ్లీ ఎన్నికల ర్యాలీలు మొదలు బూత్‌లెవల్ కార్యకర్తలతో చర్చాగోష్ఠులు సహా ఆన్‌లైన్ ప్రతిస్పందనలలో ఇండియా కూటమి, దాని కీలక భాగస్వామియైన ఆర్‌జెడిపై పూర్తి స్థాయి ఆరోపణాస్త్రాలు సంధించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'జంగిల్ రాజ్'ను దూరంగాఉంచాలని పదే పదే ఓటర్లను కోరారు. 'జంగిల్ రాజ్' గురించి యువతలో అవగాహన పెంచాలని కోరారు. 1990లలో లాలూ ప్రసాద్, రబ్రీదేవి పాలనలో తరచూ చోటుచేసుకున్న అక్రమాలు, పేలవమైన పాలనకు సంబంధించి పాలక కూటమి 'జంగిల్ రాజ్' పదాన్ని ఉపయోగించడమే కాదు, తరచూ ఉపయోగించింది. మొదటి దశ ఎన్నికలు ముగిసిన ఒక రోజు తర్వాత దక్షిణ బిహార్‌లోని కైమూరు జిల్లా భభువాలో ప్రచారం సమయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజకీయదాడిని కొనసాగించారు. ఎన్నికల ర్యాలీలో లాలూ ప్రసాద్ కుమారుడు, ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి అయిన ఆర్‌జెడి నాయకుడు తేజస్వీ యాదవ్‌పై 'జంగిల్‌రాజ్' విమర్శలు గుప్పించారు. ఎప్పుడైతే ప్రిన్స్ 'జంగిల్ రాజ్' ను మీరు పెద్ద అబద్ధాలను (వాగ్దానాలను) ఎలా నెరవేరుస్తారని అడిగినప్పుడు ప్రజలకు మావద్ద ఒక ప్రణాళికి ఉందని అంటాడని, ఏ ప్రణాళిక ఉందని ప్రజలు అడిగినప్పుడు మాత్రం దాని గురించి చెప్పడంలో నీళ్లు మింగుతున్నారని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. ఎప్పుడైతే నితీశ్‌కుమార్ మొదటిసారి కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20ఏళ్లు అవుతున్నప్పటికీ 'జంగిల్ రాజ్‌ను అంతంచేశాను' అనే వాదనపై ఆధారపడి, ముఖ్యంగా ఎన్నికల సమయంలో రాజకీయ ఏకపక్ష పోరాటం గతం యొక్క భూతాన్ని సజీవంగా ఉంచుతోంది. ఆర్‌జెడి నాయకులు, దాని ఇద్దరు జాతీయ అధికార ప్రతినిధులైన ఇద్దరు మహిళలు ఈ ఆమ్లాత్మక విమర్శలను తిప్పికొట్టారు. గత కొన్నేళ్లుగా నితీశ్ ప్రభుత్వంలో శాంతిభద్రతల పరిస్థితి అధ్వానంగా మారిందని ఆరోపించారు. బిజెపిజెడి(యు) 'జంగిల్‌రాజ్' గురించి పదేపదే మాట్లాడుకుంటూ ఇది వారి కథనం కాబట్టి మచ్చ తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయని, వారు ప్రజలకు ముఖ్యంగా పేదలు, నిరుపేదలకు ఏదైనా చేసి ఉంటే వారు ఈ విధంగా ఓట్లు అడిగేవారు కాదని ఆర్‌జెడి జాతీయ అధికార ప్రతినిధి ప్రియాంక భర్తీ అనేకసార్లు టీవీ డిబేట్లలో పదేపదే నొక్కి చెప్పారు. శుక్రవారం జముయిలో జరిగిన ర్యాలీలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మాట్లాడుతూ లాలూరబ్రీదేవి పాలనలో నేరస్తులు విచ్చలవిడిగా తిరిగారని, కిడ్నాప్‌లు జరిగాయని, అక్రమ రవాణా జరిగిందని, జంగిల్‌రాజ్ ఫ్యాక్టరీలు, వ్యాపారాలను మూసివేసి బిహార్‌ను పేదరికంలో ముంచెత్తిందని ఆరోపించారు.నవంబర్ 4న దర్భంగాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన 'జంగిల్‌రాజ్'ను గుర్తుచేశారు.జంగిల్‌రాజ్‌ను అడ్డుకునేందుకు 'తామరపువ్వు'గుర్తును ఎంచుకోవాలని కోరారు.

## 'వందేమాతరం'పై వివాదం
# ప్రధానమంత్రి క్షమాపణకు కాంగ్రెస్ డిమాండ్


### రవీంద్రనాథ్ ఠాగూర్‌ను అవమానించారని విమర్శ

**న్యూఢిల్లీ:** 'వందేమాతర గీతం'పై ఏర్పడిన వివాదం చినుకు చినుకు గాలివానగా మారుతోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ క్షమాపణ చెప్పాలని ప్రతిపక్ష కాంగ్రెస్‌పార్టీ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1937లో వందేమాతర గీతంపై జారీ చేసిన ప్రకటనను, దాంతోపాటు జాతీయ గీత రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్‌ను కూడా ప్రధానమంత్రి అవమానించారని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, ఆ పార్టీ కమ్యూనికేషన్స్ విభాగం ఇన్‌ఛార్జి జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆదివారం ఆయన ఒక పోస్టింగ్ పెట్టారు. వందేమాతర గీతంలో ఉన్న ముఖ్యమైన చరణాలను 1937లో వదిలిపెట్టేశారని, దీనివల్ల దేశ విభజనకు బీజాలు పడ్డాయని,ఈ విధమైన విభజన వాద ఆలోచనాధోరణి ఈనాటికీ కూడా దేశానికి సవాలుగా మారిందని ప్రధానమంత్రి శుక్రవారం వ్యాఖ్యానించిన తర్వాత ఈ వివాదం చెలరేగింది. ఈ వ్యాఖ్యలు చేసినందుకు ప్రధానమంత్రి క్షమాపణ చెప్పాలని,దేశంలో కోట్లాదిమంది ప్రజలకు ఆందోళన కలిగిస్తున్న నిరుద్యోగం, అసమానతలు వంటి అనేక వర్తమాన సమస్యలపై పోరాడాలని,రోజువారీ రాజకీయ సమస్యలపై జరుగుతున్న పోరాటాన్ని ఎదుర్కోవాలని జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. బంకించంద్ర ఛటర్జీ వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ఏడాదిపాటు నిర్వహించే స్మారక కార్యక్రమాలను ప్రారంభించిన సందర్భంగా మోదీ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై జైరామ్ రమేశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ, మహాత్మాగాంధీ నాయకత్వాన జరిగిన మనదేశ స్వాతంత్ర్యపోరాటంలో ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎలాంటి పాత్రా లేకపోవడంలో ఆశ్చర్యం లేదని, కానీ సిడబ్ల్యుసి ప్రకటనను (1937), టాగోర్‌ను దేశ ప్రధానమంత్రి అవమానించడం దిగ్భ్రాంతి కరమైన విషయమని అన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1937 అక్టోబరు 26 నుండి నవంబరు ఒకటో తేదీన కోల్‌కతాలో సమావేశం జరిపిందని, ఈ సమావేశంలో మహాత్మాగాంధీతోపాటు జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, నేతాజీ సుభాశ్ చంద్రబోస్, రాజేంద్ర ప్రసాద్, మౌలానా అబ్దుల్ కలామ్ అజాద్, సరోజినీ నాయుడు, జె.బి.కృపలానీ, భూలాభాయ్ దేశాయ్, జమ్నాలాల్ బజాజ్, నరేంద్ర దేవ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. మహాత్మాగాంధీ రచనాసంకలనం 66వ సంపుటి 46వ పేజీలో ఉన్న సమాచారం ప్రకారం 1937 అక్టోబరు 28వ తేదీన సిడబ్ల్యుసి వందేమాతరగీతంపై చేసిన ప్రకటన ఆనాడు రవీంద్రనాథ్ ఠాగూర్‌ను, ఆయన సలహాను కూడా తీవ్రంగా ప్రభావితం చేసిందని జైరామ్ రమేశ్ ఎక్స్ వేదికగా గుర్తుచేశారు. అందువల్ల గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్‌ను, సిడబ్ల్యుసి ప్రకటనను ప్రధానమంత్రి అవమానించారని విమర్శించారు. ఆనాటి సిడబ్ల్యుసి ప్రకటన స్క్రీన్‌షాట్‌ను కూడా ఆయన ఎక్స్ వేదికగా షేర్ చేశారు.




# పేదల బాధలు తెలిసిన రావిశాస్త్రి పెన్ను!

పూర్తి పేరు రాచకొండ విశ్వనాథ శాస్త్రి (30 జులై 1922– 10 నవంబర్ 1993). కానీ, రావిశాస్త్రి గానే సుపరిచితుడు. అల్పజీవిని ఆవిష్కరించిన విశ్వమిత్రుడు. రావిశాస్త్రిని ఇంట్లో 'విశ్వం' అని పిలిచేవారు. కోర్టులో ఆర్‌విఎస్‌గా తెలుసు. క్లయింట్లకు చాత్రిబాబు. పాఠకలోకానికి మాత్రం ఆయన రావిశాస్త్రి. ఆయన కళానికి పేదల బాధలు తెలుసు. అందుకే వృత్తిరీత్యా న్యాయవాది అయినప్పటికీ, ప్రవృత్తిలోనూ పేదల పక్షాల నిలిచి వాదించారు. ఆయన భారతదేశపు మాక్సిమ్ గోర్కీ.. చార్లెస్ డికెన్స్. రావిశాస్త్రి రచనలను సమీక్షించడం సామాజిక తనిఖీ చేయడం. దేశంలోని అధికార యంత్రాంగం, పోలీసులు, శాసనసభ, పార్లమెంటు, న్యాయవ్యవస్థ, రాజ్యాంగం గురించి, సామాన్యులకు కూడా అర్థమయ్యేలా అద్భుత రచనలు చేసి, తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. న్యాయం పక్షాన నిలబడి తన రచనల ద్వారా సమాజంలోని అన్యాయాన్ని ప్రశ్నించారు. డబ్బు పలుకుబడి, అధికారమదంతో కొందరు ఇంకొందరికి చేసే దురన్యాయాలను ఎండకడ్తూ ఎన్నో కథలు, నవలలు, కొన్ని నాటకాలు రాశారు. శ్రీకాకుళంలో నారాయణమూర్తి, సీతామహాలక్ష్మి దంపతులకు జన్మించిన రావిశాస్త్రి చదువు విశాఖపట్టణంలో సాగింది. రావిశాస్త్రి గారి తల్లికి సంగీత సాహిత్యాలలో గల పరిచయం పిల్లలపై ముఖ్యంగా శాస్త్రిగారిపై చాలా ప్రభావం చూపింది. సమకాలికమైన పత్రికలు పుస్తకాలు చదవడం వలన రాజకీయ, సాహిత్యవిషయాలతో పరిచయం ఏర్పడింది. సాహిత్యమే కాక సంగీతంలో కూడా రావిశాస్త్రికి మంచి అభిరుచి ఉండేది. ఆయన సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని రచనలు రాశారు. ఆయన రచనల్లోని పాత్రలు మన కళ్ళ ముందు కదులుతున్నట్లు కనిపిస్తాయి. అంతటి సహజత్వాన్ని సంతరించుకున్న రచనలు కాబట్టే పాఠకులను ఆసాంతం చదివిస్తాయి. ఆలోచింపచేస్తాయి. ఆయన రాసిన 'అల్పజీవి' ఇందుకు ఉదాహరణ. ఆయన తన పదమూడవ ఏటనే రచనలు చేశారు. పలు కథలు అప్పటి ప్రముఖ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. కాంతాకాంత, జాస్మిన్, గోల్కొండ రాం ప్రసాద్, శంకర గిరి, గిరిజా శంకరం, అన్ జానా వంటి సవాలక్ష పేర్లు. శృంగార రచనలతో మొదలుపెట్టి, సమసమాజం కోసం తల్లడిల్లే ఒక గొప్ప దార్శకుడి ఆలోచనల నుంచి ఉద్భవించిన రచనల వరకూ రావిశాస్త్రి సాహితీ ప్రస్థానం విశేషంగా, విజయవంతంగా సాగింది. బ్రిటన్‌కు చెందిన హెర్బర్ట్ లియోనెల్ అడోల్ఫస్ హార్ట్ (హెచ్‌ఎల్‌ఏ హార్ట్) న్యాయ శాస్త్రంలో తిరుగులేని మేధావి. రావిశాస్త్రి కూడా ఆ స్థాయికి చెందిన వాడే. 'ఆరు సారా కథలు'లో న్యాయ శాస్త్రంపై ఆయనకు ఉన్న పట్టు స్పష్టంగా కనిపిస్తుంది. దోపిడీ వ్యవస్థలో అడుగడుగునా అన్యాయానికి గురవుతూ, అణచివేతను ఎదుర్కొంటూ జీవచ్ఛవాల్లా బతికే వారు కూడా ఏదో ఒక రోజు ధైర్యంతో ప్రశ్నిస్తారని, అక్రమాలను ధిక్కరిస్తారని రావిశాస్త్రి నమ్ముతారు. ఆయన కథల్లో ఈ ఆశావాద దృక్పథం స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన పేదల పక్షాన నిలబడతారు. పోరాడతారు. సామాన్య ప్రజలే ఆయన రచనల్లో కీలక పాత్రలుగా పాఠకులను పలకరిస్తారు. అందుకే, ప్రతి కథా మనకు పరిచయం ఉన్నట్టు, కొన్ని సందర్భాల్లో మనమే ఆ కథలో ఇమడిపోయినట్టు అనిపిస్తుంది. సామాజిక రుగ్మతలను ప్రతిబింబిస్తాడు కాబట్టి, తిరుగుబాటు తప్పదని ఆయన రచనలు చదువుతున్న ప్రతి ఒక్కరూ గట్టిగా నమ్ముతారు. అలాంటి రోజు రావాలని మనసారా కోరుకుంటారు. తాను చెప్పాలనుకున్నది ఎలాంటి మొహమాటాలు లేకుండా... భయాందోళనకు గురికాకుండా.. భేషజాలకు వెళ్లకుండా నేరుగా చెప్పడం రావిశాస్త్రి నైజం. ఈ శైలికి ఎంతో మంది ఏకలవ్య శిష్యులు ఉన్నారు. సమాజంతో పాటు తాను కూడా మారడం ఆయన ప్రత్యేకత. అందుకే, సమకాలీన అంశాలపట్ల అవగాహన ఎక్కువ. నిశితంగా గమనిస్తే, కాలం గడుస్తున్నకొద్దీ, ఆయన రచనల్లో చోటు చేసుకున్న వైవిధ్యాలు కనిపిస్తాయి. 'అప్‌డేట్' కావడం రావిశాస్త్రికి తెలిసినంతగా మరెవరికీ తెలియదేమో! గొప్ప కంటెంట్, లోతైన భావాలు, వైవిధ్యమైన చిత్రాలు, స్థానిక భాష ఆయనను విశిష్ట రచయితగా నిలబెడతాయి. ఆయనకు పేదలు ఆప్తులు. శ్రామికులు ఆరాధ్యులు. సమాజ లోపాలు శత్రువులు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి జీవన చిత్రణే కథావస్తువు. ఈవర్గానికి చెందిన వారి జీవితాలలోని సమస్యలు వాటికి కారణాలను వెతుకుతూ అందులోని జీవనవైఫల్యం, అంతర్లీనంగా ఉన్న విషాదం, మానవ సంబంధాలను ఆర్థిక కారణాలు ఎలా ప్రభావితం చేస్తాయో ఆయన కథలు, నవలలు చూపిస్తాయి. ఈ కారణంగానే, 'రావిశాస్త్రీయం' ఓ తత్వశాస్త్రమైంది. సైద్ధాంతిక ఆలోచనా విధానంగా మారింది. కోర్టుల్లో అనుసరిస్తున్న విధానాలను ఆయన నిరసించారు. పోలీసు వ్యవస్థపై విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ వ్యవస్థలన్నీ పేదలకు వ్యతిరేకంగా ఉన్నాయని, సామాన్యుడికి అందుబాటులో ఉండకుండా పోతున్నాయని మథనపడ్డారు. కలానికి పదును పెట్టి.. సమస్యలను రంగరించి.. సమభావ అవసరాన్ని ప్రచారం చేశారు. ధనవంతులు, పలుకుబడిగల వారికి చట్టాలు ఏ విధంగా సహకరిస్తున్నాయో, సామాన్యులను ఏ విధంగా కుంగదీస్తున్నాయో ఆయన తన రచనల్లో ప్రస్తావించారు. విశ్లేషించారు. మార్పు అవసరాన్ని ఎలుగెత్తి చాటారు. మార్క్సిస్టు సిద్ధాంతాలతో ప్రభావితమైన ఆయన, చివరి వరకూ అదే పంథాను అనుసరించారు. ప్రజా హక్కుల కోసం పోరాటాలు చేశారు. అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ దేశంలో అత్యవసర పరిస్థితి విధించినప్పుడు, రావిశాస్త్రి కూడా జైలు శిక్ష అనుభవించారు. అయినప్పటికీ ఆయన తీరు మార్చుకోలేదు. సమాజంలో నిత్యమూ పై తరగతులవారి అన్యాయాలకు, దౌర్జన్యాలకు గురై చిత్ర హింసలు పడుతున్న దీన, హీన ప్రజల తరపున తన ప్రతి రచనలోను వకాల్తా పుచ్చుకున్నారు. వారి సాంఘిక, ఆర్థిక న్యాయం కోసం వాదించారు. సమాజం అట్టడుగు పొరల్లో, అనుక్షణం భయపడుతూ జీవించేవారికి అండగా నిలిచారు. నాటి మద్రాసు రాష్ట్రం పరిధిలో, 1937లో విధించిన మద్య నిషేధం, భారత స్వాతంత్ర్యానంతరం కూడా కొనసాగింది. 1971లో దానిని అధికారికంగా రద్దు చేశారు. మద్య నిషేధం అమల్లో ఉన్న 1960 దశకాల్లో చాలా మంది మద్యం సరఫరాను పేదలతో కొనసాగించేవారు. చిన్నపిల్లలు, మహిళలను కూడా డబ్బు ఆశ చూపించి.. బెదిరించి ఈ ప్రమాదకర వ్యాపారంలో పావులుగా వాడుకునేవారు. ఎన్నో కేసులు ఎదుర్కొనేవారు. న్యాయవాదిగా ఎన్నో కేసులు చూసిన రావిశాస్త్రికి పేదరికమే వారిని మద్యం అక్రమ రవాణాదారులుగా మార్చిందని అర్థమైంది. సంఘంలో జరుగుతున్న అన్యాయాలకు బలవుతున్నది అలగా జనమేనని, డబ్బు పదవి, పలుకుబడి ఉన్నవారు నిజంగా తప్పు చేసినా తప్పించుకోగలుగుతున్నారని తెలుసుకున్నారు. పట్టించుకునేవారు లేక జైల్లోనే మగ్గుతున్న ఎంతో మందికి రావిశాస్త్రి ఆశాదీపమయ్యారు. వారి తరఫున వాదించి, పేదల పక్షపాతి అనిపించుకున్నారు. ఈ అంశాలే ఆయన రచనల్లోనూ ప్రధానంగా నిలుస్తాయి. ఆయన రచనలు అప్పటి మధ్యతరగతి, దిగువ, పేద వర్గాల జీవితాల్లోకి తొంగిచూస్తాయి. సామాజిక నిర్మాణాన్ని లోతుగా అధ్యయనం చేస్తాయి. విశ్లేషించి, ధనం, పలుకుబడి, అధికారం సాగిస్తున్న అకృత్యాలను ఎండగడతాయి. 'రచయిత ప్రతివాడు తాను వ్రాస్తున్నది ఏమంచికి హాని కలిగిస్తుందో, ఏ చెడ్డకు ఉపకారం చేస్తుందో అని ఆలోచించవలసిన అవసరం వుందని నేను తలుస్తాను, మంచికిహాని, చెడ్డకు సహాయమూ చెయ్యకూడదని నేను భావిస్తాను' అంటారు రావిశాస్త్రి. పీడిత, తాడిత ప్రజల పక్షాన న్యాయంకోసం పోరాడి, విరసం వ్యవస్థాపకుల్లో ప్రముఖుడిగా నిలిచి, పతితుల కోసం, భ్రష్టుల కోసం, బాధాసర్పదష్టుల కోసం దగాపడ్డ తమ్ముల కోసం, చల్లారిన సంసారాల కోసం, చీకట్లు ముసిరిన బతుకుల కోసం.. తుది శ్వాసవరకు అవిశ్రాంతంగా ఉద్యమించారు. మనుషుల మనస్తత్వాలను అద్భుతంగా ఆవిష్కరించే ఆయన రచనలు అప్పుడేకాదు.. ఇప్పుడు కూడా మార్గదర్శకాలే. పేదలపై జరిగే అన్యాయాలను ఖండించే కరవాలాలే. 'బాకీ కథలు' పేరుతో వచ్చిన సంపుటిలోని 'వేతనశర్మ', 'షోకుపిల్లి', 'పిపీలికం' వంటి కథలు ఆయనపై మార్క్సిస్టు భావజాల ప్రభావానికి నిదర్శనాలు. తాను నమ్మిన సిద్ధాంతాలకు గౌరవం ఇస్తారు కాబట్టే తన రచనా కళకు దక్కిన ప్రభుత్వగౌరవాలను, కళా ప్రపూర్ణ బిరుదునూ తిరస్కరించారు. ఆయన ప్రజల మనిషి. ప్రజల్లో మనిషి. పేదల పక్షపాతి. ఆయన అనుకున్నదే రాశారు. రాసినదే ఆచరించారు. గొప్ప సాహితీస్రష్టగా చరిత్రపుటల్లో నిలిచిపోతారు.




**(నవంబర్ 10న రావిశాస్త్రి వర్ధంతి)**

**– సత్యశ్రీ**

## చదవాల్సిన పుస్తకం

### నిత్య 'సత్యాన్వేషి' రఘురామ్




సమాజం మీద బలమైన ముద్ర వేసే శక్తి దృశ్య రూపానికి ఎక్కువ. అందుకే, సాహిత్యంలో నాటక ప్రక్రియ ప్రత్యేకతను సంతరించుకుంది. అందుకేనేమో, ఎన్నో రచనలు చేసిన చిలువేరు రఘురామ్ బుద్ధిడి గురించి చెప్పడానికి నాటకాన్ని ఎంచుకున్నారు. కథామూలం డి.నటరాజ్ శాక్యదే అయినప్పటికీ, నాటకీకరణలో విలక్షణ రీతిని అవలంభించారు. సంభాషణల్లో పదును జోడించారు. నాటకంలో మొత్తం 16 దృశ్యాలు. బాల సిద్ధార్థుడు 12వ పుట్టిన రోజు వేడుకలతో ప్రారంభమై, అతను సన్యశించి మహాభినిష్క్రమణ వరకూ కొనసాగుతుంది. హంసతూలికా తల్పాలపైన పవళిస్తూ, రాజభోగాలు అనుభవించాల్సిన యువరాజు సిద్ధార్థుడు సన్యశించి, జోలెపట్టి తథాగతుడిగా మారిన వైనాన్ని రచయిత దృశ్య రూపంలో చూపేందుకు అవసరమైన అన్ని హంగులను, వివరాలను ఇందులో పొందుపరిచారు. సహజంగా రచయితలు తమ పుస్తకంలోని అంశాలను, కనీసం ఏ ఒక్క భాగాన్ని కూడా ఎవరూ, ఎక్కడా ఉపయోగించుకోకూడదని పేర్కొంటూ, కాపీరైట్ అస్త్రాన్ని ప్రయోగిస్తారు. కానీ, రఘురామ్ ఇందుకు భిన్నంగా స్వచ్ఛంద అనుమతి ప్రదానం చేశారు. పుస్తకంలోని ఏ భాగాన్నయినా స్వేచ్ఛగా వాడుకోవచ్చని, అందుకు సంతోషంగా అంగీకరిస్తున్నానని ప్రకటించారు. మతం పేరుతో మారణకాండ కొనసాగుతున్న ఈకాలంలో బుద్ధుడి ఆలోచనలు, సిద్ధాంతాలు ఆచరణీయమన్న వాదన బలపడుతున్నది. ఇలాంటి కాలంలోనే నటరాజ్ శాక్య రాసిన 'గౌతమ బుద్ధుడు' గ్రంథంలో కొంత భాగాన్ని తీసుకొని, నాటక రూపంలో అనువదించిన రఘురామ్ నుంచి తదుపరి నాటకాలు వస్తాయని, బుద్ధుడి జీవిత చరిత్ర మాత్రమేగాక, ఆయన సూత్రాలను కూడా అందులో వివరిస్తారని ఆశిద్దాం.

### ప్రగతిశీల కవితాధార 'ఎదురీత'

సామాజిక స్పృహతో, మార్పుకోసం నిరంతరం తపనపడే కవి గోలి మధు కలం నుంచి జాలువారిన ప్రగతిశీల కవితాధార 'ఎదురీత'. ఇందులోని ఆణిముత్యాల్లాంటి 55 కవితలు వేటికవే సాటి. అభ్యుదయ భావాలను ప్రతిబింబించడంలో మేటి. ఆయన కవిత్వంలో ఉగాది కోయిల గాయపడుతుంది. కవిత్వమై కూస్తుంది. గుండె గాయాల లోతుల్ని లోకానికి చాటాలని గొంతెత్తి గానం చేస్తుంది. తొలి కవితలోనే లోతైన భావాన్ని, సమస్యల ప్రభావాన్ని, చెడిపోతున్న సంఘాన్ని మనం చూడగలుగుతాం. రచయిత ఆంతర్యాన్ని ఆంతర్యాన్ని అర్థం చేసుకోగలుగుతాం. గ్రామీణ జీవనం ధ్వంసమై, పుట్టుకొచ్చిన దుర్మార్గపు విష సంస్కృతిని 'వికాసం' కవితలో కళ్లకుకడతారు రచయిత. రోజురోజుకూ దిగజారిపోతున్న దేశ ఆర్థిక పరిస్థితిని, రైతు కష్టాలను ప్రస్తావిస్తాడు మరో కవితలో.

**'మనిషి చుట్టూ మతం చుట్టి**
**మానవత్వం మంటగలుస్తుంటే**
**మరణశయ్యకు చేరువవుతున్నాయా**
**ప్రజాస్వామ్యమా?' అని ఆవేదన వ్యక్తం చేస్తారు. అదే సమయంలో ..**
**'నీ చెట్టు కొమ్మల్ని ఓటు కడవలిగా**
**తన బిడ్డలకు ఇవ్వబోతుంది'** అంటూ 'ప్రజాస్వామ్యమా.. దిగులు పడకు' అని భరోసానిస్తాడు. మణిపూర్‌లో తెగుతున్న తలలను, తడిగుడ్డతో గొంతులు తెగుతున్న వైనాన్ని.. వినోదం చూసే జనాన్ని కూడా ప్రస్తావిస్తారు. వాక్ స్వాతంత్ర్యం నోటికి పడిన తాళాన్ని, భావ ప్రకటన గుండెకు పడిన గొళ్లాన్ని చూస్తారు. మది గ్రంథాలయం నుంచి రోషం పౌరుషాల జ్వాలల్ని తీయాలని, కొత్తదారులు వేయాలని ప్రబోధిస్తారు. ఎగసిపడుతున్న నిరంకుశ జ్వాలల్ని చూస్తాడు. చైతన్య స్రవంతి జనావళిని తడుపుతునే ఉన్న వైనాన్ని గ్రహిస్తారు.





**'మహనీయులు వేసిన**
**రహదారి ధ్వంసమై**
**అరాచకం సృష్టించిన**
**గుంటలే ఎటు చూసినా..**
**దేశం రోడ్డు పక్కన**
**బక్కచిక్కిన శవాల గుట్టలు**
**పోగయ్యాయి..'** అనే భావం లోతుల్ని తడిమి చూడాలంటే ఈ పుస్తకాన్ని చదవాల్సిందే. దేశ ఆర్థిక వ్యవస్థను అల్లకల్లోలం చేస్తున్న కార్పొరేట్ సామ్రాజ్యాధిపతులను 'తేరగ తిని తెగ బలిసిన ఆంబోతులు'తో పోలుస్తాడు. అధికారాన్ని ఉపయోగించి, అడ్డంగా కొనసాగిస్తున్న దోపిడీని ప్రశ్నిస్తారు. పంట అంతా ధాన్యాగారం చేరాక, పందికొక్కులు చేరడంతో, తినడానికి తిండి కరువైందని దోపిడీ విధానాలపై పదునైన పదజాలంతో విరుచుకుపడతారు. రాజ్యాంగ వృక్షం కింద, ప్రజాస్వామ్యం నీడన విషపూరిత శక్తుల రంపపు కోతను వివరిస్తారు 'ప్రభంజనం' కవితలో.. స్వేచ్ఛా వాయువులే కరువైన సమాజానికి జన చైతన్యం ప్రభంజనమైతేనే మంచి భవిష్యత్తు ఉంటుందని నొక్కి చెప్తారు. పార్టీలు మారే రాజకీయ నాయకుల వికృత రూపాన్ని ఆవిష్కరిస్తారు. చెమట చుక్కను కూడా దోచుకుంటున్న పెద్దల చరిత్రను నిగ్గదీస్తారు. తన 'ఎదురీత' గురించి వివరిస్తూ..

**'పాలకుల చేతిలో**
**తోలుబొమ్మలాటకు'...**
**'చమట చుక్కల సిరుల ప్రయాణం**
**కొందరి కాళ్ల కిందకే**
**సాగుతున్న ప్రవాహానికి'..**
**'భావ ప్రకటన హక్కు**
**సంహరించే**
**మొసళ్లు తిరుగాడే సాగరాన**
**ప్రగతిశీలశక్తితో సాగే'** ప్రస్థానమని స్పష్టం చేస్తారు.




సూక్ష్మంగా చెప్పాలంటే, సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా... దోపిడీకారుల అక్రమాలకు వ్యతిరేకంగా.. కులాలు, మతాల పేరుతో జరుగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా... భావ ప్రకటన స్వేచ్ఛను హరించే శక్తులకు వ్యతిరేకంగా గోలి మధు ఎదురీత కొనసాగింది. ఆశాభావంతో కూడిన 'ముగింపు' కొత్త లోకాలకు తలుపులు తెరుస్తుంది. ప్రతి కవితలోనూ ప్రగతిశీల భావాలు తొణికిసలాడే ఈ సంకలనం తప్పక చదవాల్సిన పుస్తకం.

## ఇగ్బో సంస్కృతికి దర్పణం 'థింగ్స్ ఫాల్ అపార్ట్'




చినువా అచేబే రచించిన 'థింగ్స్ ఫాల్ అపార్ట్' నవల 1958లో ప్రచురితమైంది. ఈ నవల నైజీరియా దేశంలోని ఇగ్బో ప్రజల సంప్రదాయ జీవనం, సంస్కృతి, యూరోపియన్ వలస పాలన వల్ల వచ్చిన మార్పుల నేపథ్యంలో సాగుతుంది. కథ ప్రధానంగా ఉముఫియా అనే గ్రామంలో జరుగుతుంది. కథానాయకుడు ఒకొంక్వో ఓ గొప్ప ధైర్యవంతుడు. కష్టపడి తన పేరు తెచ్చుకున్న వ్యక్తి. అతని తండ్రి ఉనోకా బలహీనుడు, అప్పులపాలైనవాడు. అందుకే ఒకొంక్వో జీవితమంతా తన తండ్రి లాంటి బలహీనుడు కాకూడదనే ప్రయత్నం చేస్తాడు. ఈ నవల ప్రథమ భాగంలో ఇగ్బో సమాజంలోని సంప్రదాయాలు, పండుగలు, న్యాయవ్యవస్థ, బంధుత్వాలను రచయిత ఎంతో వాస్తవికతో చిత్రించాడు. ఒకొంక్వో స్వయం కృషితో ఎదుగుతాడు. గౌరవం సంపాదిస్తాడు. కానీ, అతని అహంకారం, కఠినత అతని జీవితాన్ని నాశనం చేస్తాయి. అనుకోకుండా ఒక మనిషిని చంపడం వల్ల అతని జీవితంలో ఎదురైన దురదృష్టకర సంఘటన, ఫలితంగా ఊరి నుంచి ఏడు సంవత్సరాల బహిష్కరణను ద్వితీయ భాగంలో వివరిస్తాడు. తృతీయ భాగంలో యూరోపియన్ మిషనరీలు, బ్రిటిష్ ప్రభుత్వం ఇగ్బో సమాజంలోకి ప్రవేశించిన వైనాన్ని ఆవిష్కరిస్తాడు. కొత్త మతం, పాశ్చాత్య పాలనా విధానం కారణంగా స్థానిక సంప్రదాయాలు విచ్ఛిన్నమైన రీతిని వర్ణిస్తాడు. చివరికి, తన ప్రపంచం కూలిపోతుందనే భావనతో ఒకొంక్వో ఆత్మహత్య చేసుకుంటాడు. మొత్తం మీద ఈ నవలలో సాంప్రదాయాలు, ఆధునికత మధ్య వైవిధ్యాలు కనిపిస్తాయి. పాత ఇగ్బో సంస్కృతిని యూరోపియన్ వలస పాలన చెరిపివేసిన విధానాన్ని ఈ నవల వివరిస్తుంది. అదే విధంగా పురుషాధిక్య దృక్పథం అంతర్లీనంగా ఉంటుంది. ఒకొంక్వో లాంటి వ్యక్తి బలహీనతని ద్వేషించడం వల్ల తన కుటుంబానికి, తనకే నష్టం చేసుకునే వైనాన్ని కళ్లకు కడుతుంది. సమాజం మారినప్పుడు వ్యక్తులు ఆ మార్పుతో ఎలా పోరాడతారన్నది ప్రధాన ప్రశ్న. సాంస్కృతిక సంఘర్షణ ఇందులోని ప్రధాన ఇతివృత్తాల్లో ఒకటి. పాశ్చాత్య పోకడలు.. ఆఫ్రికా విలువల మధ్య పోరు ఈ నవలలో ప్రతిబింబిస్తాయి. ఈ రచనలో అచేబే భాష సజీవంగా, సాంస్కృతిక సందర్భాలతో నిండుగా ఉంటుంది. ఆయన ఇగ్బో పదాలు, సామెతలు, కథలు ఉపయోగించి ఆఫ్రికన్ స్వరాన్ని కాపాడాడు. ఏ సంస్కృతీ శాశ్వతం కాదని, కానీ దానిని బలవంతంగా మారిస్తే అది కూలిపోతుందని అంటాడు. ఈ నవలలో అచేబే పాశ్చాత్య వలసవాదం ఆఫ్రికా సంస్కృతిపై చూపిన ప్రభావాన్ని, స్థానిక ప్రజల మనస్తత్వాన్ని అద్భుతంగా చిత్రించాడు. గిరిజన తెగల సంప్రదాయాలు, విశ్వాసాలు, వారి ఉత్సవాలు, ఆడవారి మనోభావాలు, వారి కష్ట సుఖాలు, పిల్లల కోసం తల్లిదండ్రులు పడే ఆరాటాలు, ప్రకృతితో ఆ గిరిజనుల జీవన పోరాటం ఇలా అన్నీ కళ్లకు కట్టినట్లు చూపించాడు. ప్రపంచ వ్యాప్తంగా కనీసం 50 భాషల్లోకి అనువాదమైందంటే, ఈ నవల గొప్పతనం ఏమిటో అర్థమవుతుంది. ఆఫ్రికాకు చెందిన ఏ ఇతర రచయిత రచనలు ఇన్ని ప్రపంచ దేశాలకు చేరలేదు. 'థింగ్స్ ఫాల్ అపార్ట్' తర్వాత చాల కాలం వరకు ఆయన మరో ప్రధాన రచన చేయలేదు. 1987లో మాత్రమే ఆయన రాసిన 'యాంట్ హిల్స్ ఆఫ్‌ది సవన్నా' నవల వెలువడింది. అచెబె ఇంగ్లీషులోనే రచనలు చేసే వాడు. ఎందుకంటే 200కు పైగా విభిన్నమైన భాషలు మాట్లాడే ఆఫ్రికా ప్రజలందరికీ అవి చేరాలంటే ఇంగ్లీషులో రాయడమే ఉత్తమమైన మార్గమని ఆయన భావించాడు. విశేషమేమంటే ఎన్నో ప్రపంచ భాషల్లోకి తన రచనలను అనువదించడానికి అనుమతించిన అచెబె తన మాతృభాష ఈబోలోకి మాత్రం వాటిని అనువదించడానికి ఇటీవలి వరకు అంగీకరించలేదు. మూల భాషను వలసపాలకులు భ్రష్టు పట్టించారని, అలాంటి అపభ్రంశపు భాషలోకి తన రచనలను అనుమతించనని ఆయన చెప్పేవాడు. తన మూలాల పట్ల ఆయనకున్న ప్రగాఢ అభిమానానికి ఇదో నిదర్శనం.

> **'నేను స్కూలుకు వెళ్లడం మొదలు పెట్టి రాయడం, చదవడం నేర్చుకునే సమయానికి ఇతర దేశాల ప్రజల గాథలు మాత్రమే తెలుసు కోగలిగేవాడిని. అవన్నీ శ్వేత జాతీయుల మంచితనం గురించే ఉండేవి. సహజంగా నేను కూడ శ్వేత జాతీయులంత మంచివారు లేరని నమ్మేవాడిని. వారే తెలివికలవారు, మిగతా వారంతా వెర్రివారని భావించేవాడిని. అప్పుడే నాకనిపించింది, అసలు మనకంటూ మన కథలుండాలి కదా అని. నాకు ప్రసిద్ధ సామెత గుర్తుకు వచ్చింది. సింహానికి తన చరిత్ర తనకు తెలియకపోతే, వేటగాడి చరిత్రే ఎల్లప్పుడూ కీర్తించబడుతుందన్నది ఆ సామెత'.**

## ఆఫ్రికన్ ఆత్మను ప్రతిబింబించిన 'ఆచెబే'

ఆఫ్రికన్ సాహిత్య పితామహుడిగా పేరు పొందిన గొప్ప రచయిత చినువా ఆచెబే (16 నవంబర్ 1930– 21 మార్చి 2013). అతని రచనల్లో ఆఫ్రికన్ ఆత్మ ప్రతిబింబిస్తుంది. అందుకే, ఆయన కేవలం ఒక రచయిత మాత్రమే కాదు... ఒక సంస్కృతికి స్వరం కూడా. పాశ్చాత్య వలసవాద దృష్టిలో అనాగరిక ఖండంగా చిత్రీకరించబడిన ఆఫ్రికా గురించి ప్రపంచానికి నిజమైన రూపాన్ని చూపించినవాడు ఆచెబే. అతని రచనలు ఆఫ్రికన్ జీవన విధానాన్ని, సంస్కృతిని, నమ్మకాలను, మానవీయ విలువలను అద్భుతంగా ప్రతిబింబిస్తాయి. సాహిత్యంలో సాంస్కృతిక పునరావిష్కరణ చేసిన గొప్ప రయిత ఆచెబే. అతని రచనలు ప్రధానంగా నైజీరియాలోని ఇగ్బో జాతి సంస్కృతిని కేంద్రంగా చేసుకుని ఉంటాయి. పాశ్చాత్య మిషనరీలు, వలస పాలకులు ప్రవేశించిన తరువాత ఆఫ్రికన్ సమాజంలో జరిగిన మార్పులను సున్నితంగా చిత్రీకరిస్తాడు. 'థింగ్స్ ఫాల్ అపార్ట్' నవలలో ఓకోంక్వో అనే పాత్ర ద్వారా, వలసవాదం ఎలా ఒక సంప్రదాయ సమాజాన్ని అంతర్గతంగా చీల్చేసిందో అద్భుతంగా వివరిస్తాడు. ఆచెబే యొక్క అత్యంత విలువైన సాహిత్య కృషిలో ఒకటిగా ఆయన భాషా ప్రయోగాన్ని పేర్కోవాలి. ఆయన ఆంగ్ల భాషలో రచనలు చేసినా, ఆఫ్రికన్ లింగ్విస్టిక్ రిథమ్‌ను అందులో కలిపేస్తాడు. ఇగ్బో సుభాషితాలు, సామెతలు, స్థానిక పలుకుబడులు ఆయన వాక్య నిర్మాణంలో సజీవంగా ఉంటాయి. దీని వల్ల పాఠకుడు ఆ సంస్కృతిలోని శబ్దాలు, వాసనలు, భావాలు నేరుగా అనుభవించగలుగుతాడు. ఆచెబే సాహిత్యంలో రాజకీయ అవగాహన కూడా లోతుగా ఉంటుంది. అతని రచనలు ఐరోపాకు చెందిన జోసెఫ్ కాన్రాడ్ వంటి రచయితల ద్వారా ఆఫ్రికా ప్రతిబింబంపై ప్రత్యామ్నాయ వాదాన్ని నిర్మించాయి. ఆయన చూపించిన ఆఫ్రికా చీకటి ఖండం కాదు, జీవంతో నిండిన, తత్వదృష్టి కలిగిన మానవ సమాజం. అతను తన రచనల్లో మనుషుల మధ్య తేడాలను కాకుండా, మానవ సంబంధాల మాధుర్యాన్ని ప్రధానంగా ప్రోత్సహించాడు. ఆయన నవలలు శత్రుత్వం, గౌరవం, కుటుంబ బంధాలు, భయాలు, ఆశలు వంటి మానవ భావాలను అత్యంత నిజాయితీగా ప్రతిబింబిస్తాయి. ఆచెబే సాహిత్యం ఆఫ్రికన్ మానవతా చింతనకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఆయన కలం ద్వారా ఒక ఖండం తన స్వరాన్ని తిరిగి పొందింది. ఆయన రచనలు నేటికీ వలసవాదానంతర ప్రపంచ సాహిత్యంలో స్వరాన్ని ఇచ్చే బలమైన ప్రతిధ్వనిగా నిలిచాయి.



**(నవంబర్ 16 ఆచెబే జయంతి)**

## ఈ వారం కవితలు

### పలకరింపుల పులకరింపు

నా ఆగమనానికి స్వాగతాలా అన్నట్టు
ఇంటినుంచి బయటకొస్తానా...
ఎన్నెన్ని ఆత్మీయతాదృక్కుల
నవ్వులపువ్వులు
నన్ను అనురాగంగా స్పృశిస్తాయో
తెలుసా?
కళ్లతోనే ...
నా మనసును నిమిరిపోతాయి కొన్ని,
చెంతకొచ్చి ఆలింగనం చేసుకుపోతాయి
మరికొన్ని.

అయితే...
వాటిల్లో కొన్నే స్ఫురణకొస్తాయి.
కొన్ని చిరునవ్వులకు బదులుగా
చిరునగవు చిందిస్తూ
నే ముందుకు సాగినా,
లోలోపల మదిలో వెతుకులాట
మొదలవుతుంది వాటిగురించి.

నా వృత్తిజీవితంలో, ఎప్పుడో ఎక్కడో
నా సేవలందుకున్నవో
లేదా
అవి నా కవితా సుమసుగంధ సౌరభాలను
ఆఘ్రాణించినవేమోననిపిస్తుంది.
నాకు స్ఫురించకున్నా,
నా రూపాన్ని భద్రంగా దాచుకున్న హృదయాలవి.

నా స్మృతిపొరలనుంచి అవి తొలగినా,
మనిషిని మనిషి పట్టించుకోని
ఈ కాలంలో...
పదిలంగా నన్ను స్ఫురణలో దాచుకోవడం,
దారిన పోతున్న నన్ను
ఆప్యాయంగా పలకరించడం,
ఏ జన్మపుణ్యమో! ఏ సేవల ఫలమో?

ఆ అభిమానధనాన్ని ఎలా కొలవనూ!

**– వేమూరి శ్రీనివాస్**

### కొలతలివిగో

కలే కదా
ఇదంతా కలే కదా
ఇంకా వినపడుతున్నాయా నీకు
ఆ.. ఆర్తనాదాల శ్రావ్యగీతాలు
మనసు మూసేసుకున్నావు కదా
ఎందుకంటే నువ్వు చీకటి కాగడాలో
మసి చూరిన కలలను వెతికే
ఆశవాదివి కదా
ఎందుకలా మొహం తిప్పుకుంటావ్
ఇదిగో ఇక్కడ ఫొటోలు తియ్యి
మెరిసే నా దేహం మసిబార కూడదు సుమా!
ఇదిగో ఇక్కడ చూడు
కుటిల పరిహాసపు
నగ్న కీలలలో
మసి పట్టిన సాక్ష్యపు ఆనవాలు
ఎంత ఓపికో నాకు
గొంతు నొక్కేసుకుని మరీ వెతుకుతున్నా
ఎడారి పట్టిన మనసుల్ని తవ్వి తీస్తూ



దప్పిక పట్టిన చేతుల కోసం
నీటి చలమల్లే అక్కడే ఆగిపోయా
ఎండమావి ఎప్పుడూ
నువ్వు పట్టిన సమాజమే సుమా
ఎందుకో నిదుర వస్తోంది
ఉలికిపాటు నైనా
నిన్ను కలగా కంటూనే ఉంటాను
ఒట్టు నేస్తం
నేనింకా బతికే ఉన్నా
నువ్వు ఆగి ఆగి చూసే చూపులలో
ఒక వేకువ రాలిపోయిందని చెప్పడానికి


**– పి.సురేందర్**

### నేటి కాలంతో ..

అలల ప్రయాణంలో మునకలేస్తూ
కాలాన్ని తోచుకుంటూ గడపాలి
మనిషి కాని మనిషి జతలో తిరుగుతూ
మానవత్వాన్ని బ్రతికించుకోవాలి
చేతనైతే మార్చు లేకుంటే మారిపో
నినాదాల పోరుతో ఏకమై సాగాలి

కొత్త కొత్త కళల నైపుణ్యంతో కలిసిపోయి
కొన్ని మెళకువలు నేర్చుకుని రావాలి
మాటలతో కోటలు మౌనంతో ఆటలు
ప్రతి నిర్మాణం వెనుక ఒక తీర్మాణం
పేరాలుగా రెపరెపలాడిపోవాలి

నేటి కాలంతో మమేకమైపోతూ
రంగుల హంగులతో ఉప్పొంగిపోతూ
కరిగిపోయే కొవ్వొత్తిని నమ్ముకోవాలి
విరిగిపోయే పాలతో పట్టాభిషేకం
చప్పట్లతో ప్రశంసిస్తూ జరిపించుకోవాలి



నమ్మకానికి తొడుగులు తొడిగి
ఎండమావులే మేఘాలని మురిసిపోవాలి
మాటల వెల్లువలో కొట్టుకుపోతూనే
గంగార్పణకు అంకురార్పణ చేయాలి
మనిషితనాన్ని మరచిపోతూ నడుచుకునే
అమానవీయపు వలలో చిక్కుకుపోవాలి
ఆశల పల్లకి ఎక్కి ఊరేగుతూనే
కళ్లెం తెగిన గుర్రమై పరుగులు పెట్టాలి

నేటి కాలంతో చేయి కలపడమంటే
ముళ్ళ చెట్టును ఆలింగనం చేసినట్టే
తీరాన్ని తాకిన తుఫానులా రేగిపోతూనే
బురద మట్టిలో వజ్రాల వేట కొనసాగించాలి
కళ్ళు నులుముకుని పొరలు పొరలుగా
లోకాన్ని చూసి బిత్తరపోవాలి
కాలంతో కలిసి వుండలేమని నిర్ధారించాలి

**– నరెద్దుల రాజారెడ్డి**

## పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

**ప్రజాపక్షం/కారేపల్లి:** పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, ఈనెల 13న ఖమ్మం కలెక్టరేట్ ముందు జరిగే ధర్నా ప్రదర్శనను జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మాదారం గ్రామ పంచాయితీలో గల గోవింద తండాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం వ్యవసాయ సీజన్ ప్రారంభం నుండి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం మూలంగా సకాలంలో గంటలకు ఎరువులు యూరియా అందక అలాగే అతివృష్టి ప్రకృతి వైపరీత్యాల మూలంగా గత నెల చివరలో వచ్చిన భారీ మొంథా తుఫాను మూలంగా పత్తి వరి మిర్చి మొక్కజొన్న ఇతర అపరాల పంటలు భారీగా దెబ్బతిని చేతికి వచ్చిన అన్ని రకాల పంటలు తడిసి మొలకలు వచ్చి మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక రైతాంగం మొత్తం దిక్కుతోచని పరిస్థితిలో ఉందన్నారు. మండల నాయకులు రైతులు కోయిల శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్, బి వీరు, గోవిందు, పాపారావు, నరేష్, సురేష్, ఎర్రయ్య, శివయ్య, గడ్డ వెంకన్న, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పరుచూరి దంత వైద్యశాల వార్షికోత్సవం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పరుచూరి దంత వైద్యశాల 30వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఖమ్మం నగరంలోని పరుచూరి దంత వైద్యశాలలో జరిగిన కార్యక్రమంలో 30వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. వైద్యులు పరుచూరి వెంకటేశ్వరరావును శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం దంత వైద్యశాలను ఖమ్మం నగరంలో ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు దంత సమస్యలతో బాధపడే రెండు లక్షల మందికి పైగా రోగులకు చికిత్సలు అందించినట్లు ఆయన తెలిపారు. దంత వైద్య విభాగంలో మొత్తం ఏడు కేటగిరిలు ఉన్నాయని ఆ ఏడు కేటగిరిలు కూడా ఖమ్మం నగరంలో పరుచూరి వైద్యశాలలో అత్యాధునీక వసతులతో అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్య విద్య పూర్తి కాగానే తాను పుట్టి పెరిగిన ఖమ్మం జిల్లా ప్రజలకు సేవలందించేందుకు 1996 నవంబర్ తొమ్మిదిన మా ఇంటి పేరుతో పరుచూరి దంత వైద్యశాలను స్థాపించినట్లు ఆయన తెలిపారు.

## సేంద్రియ ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సేంద్రియ ఉత్పత్తుల వాడకం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని కాంగ్రెస్ యువ నాయకులు తుమ్మల యుగంధర్ తెలిపారు. ఆదివారం ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సేంద్రియ రైతు బజార్‌ను కాంగ్రెస్ యువ నాయకులు, ప్రముఖ సేంద్రియ వ్యవసాయ మార్గదర్శి తుమ్మల యుగంధర్ సందర్శించారు. ఈ సందర్భంగా సేంద్రియ పంటలు, సాంప్రదాయ విత్తనాలు, దేశీ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను పరిశీలించి రైతులతో మాట్లాడారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన పంటలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎటువంటి రసాయనాలను వాడకుండా సేంద్రియ పద్ధతిలో సాగు చేసి పండించిన పం టలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. రైతులు సహజ ఎరువులు, జీవామృతం, గోమూత్ర ఆధారిత వాడకం, విత్తన సంరక్షణపై అవగాహన కల్పించారు. విత్తన బ్యాంకులు, రైతుల మధ్య విత్తన మార్పిడి కార్యక్రమాలను అభినందించారు. రైతు సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో ఖమ్మంరూరల్ కాంగ్రెస్ నేతల ప్రచారం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** రాష్ట్ర రెవిన్యూ,గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలు, మంత్రి క్యాంప్‌కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి సూచనలతో ఖమ్మంరూరల్ కాంగ్రెస్ నేతలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి ఆధ్వర్యంలో అక్కడి బోరంబడలోని షాపులు, ఇంటింటికి, పాదచారులను కలిసి హస్తం గుర్తుకే ఓటు వేసి అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ ఎమ్మెల్యే మందుల సామేలు కుమారుడు మందుల సూర్యకుమార్, మండల నాయకులు మద్ది వీరారెడ్డి, తోట వీరభద్రం, తేజావత్ పంతుల్‌నాయక్, ముత్యం కృష్ణారావు, గునిగంటి సురేష్, ఆరెంపుల రామయ్య, మొండెం వెంకటేష్, సింగిరెడ్డి, బోసిరెడ్డి, మద్ది వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్

### జెసిబిని సీజ్ చేసిన మైనింగ్ శాఖ




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ప్రజాపక్షం తెలుగు దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన బరితెగించిన మట్టి మాఫియా కథనంపై రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు స్పందించారు. సరైన డాక్యుమెంట్లు లేకుండా పాత కొమ్మేపల్లి రోడ్డు నుండి అక్రమంగా మట్టి తరలిస్తున్న అశోక్ లేలాండ్ వాహనంతో పాటు మట్టిని తోలుస్తున్న జెసిబి వాహనాన్ని సైతం రెవిన్యూ శాఖా వారి సమాచారంతో మైనింగ్ ఏడి రమేష్ నేతృత్వంలోని బృందం అడ్డుకుని స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించింది. ఈ సందర్భంగా మైనింగ్ ఏడి, సత్తుపల్లి తహశీల్దార్లు మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే చట్టపరంగా శిక్షిస్తామని, వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్ళు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని 38 కొనుగోలు కేంద్రాలలో ఖరీఫ్ సీజన్లో ఐకెపి, డీసీఎంఎస్, పిఎసిఎస్, మెప్మా, వారి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్ళు ముమ్మురంగా కొనసాగుతున్నట్లు తహశీల్దార్ పులి సాంబశివుడు, వ్యవసాయ శాఖ అధికారిని రూప, సివిల్ సప్లై డిటిన రేష్ లు తెలుపుతున్నారు. ఎర్రబోయినపల్లి, జిడిపి పల్లి ,పెద్ద కోరుకొండి, పోచవరం, లింగాల, కల్లూరు తదితర కొనుగోలు కేంద్రాలలో ధాన్యం ముమ్మరంగా కొనుగోలులు కొనసాగుతున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర ఏ గ్రేడ్ 23 89, బి గ్రేడ్ 23 69 ధరను పొందాలని అధికారులు రైతులను కోరుతున్నారు. నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తరలించి మద్దతు ధర పొంది లాభాలను పొందాలని రైతులను అధికారులు కోరుతున్నారు. ప్రతిరోజు సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షణ చేస్తున్నట్లు వివరించారు.

## న్యాయసేవలపై ప్రతిపౌరుడికీ అవగాహన



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** జాతీయ న్యాయ సేవల దినోత్సవం పురస్కరించుకొని ఆళ్లపల్లిలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో, ఆళ్లపల్లిలోని భగత్‌సింగ్ సెంటర్ నందు న్యాయ సేవల దినోత్సవం జరిపారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పిఎల్‌వి గుండెబోయిన రామకృష్ణ, స్థానిక పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ ప్రతి పేదవారికి కూడా న్యాయం జరగాలజ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ గురించి ప్రతి పౌరునికి తెలిసి ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో ఏ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయురాలు సిహెచ్ సుధ, సోషల్ ఉపాధ్యాయులు, గ్రామస్తులు కే చంద్రకళ, ఎన్ పద్మ, సుభద్ర, లలిత, మమత పాల్గొన్నారు.

# వన భోజనాలతో ఐక్యత, స్నేహభావం

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కార్తీక మాస వనభోజనాలతో ఐక్యత, స్నేహభావం పెంపొందుతుందని కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గం పాల్వంచలోని లక్ష్మీ గార్డెన్స్, లక్ష్మీ దేవిపల్లి మండల యల్లావుల పాపారావు తోటలో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య వనారాధన సామూహిక వన భోజనాల కార్యక్రమాలకు ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా హాజరయ్యారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా కార్తీక మాస వన భోజన మహోత్సవాలు ఘనంగా నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్తీక మాస వన భోజన మహోత్సవాల ద్వారా ఆధ్యాత్మిక భావాలు, సోదర భావాలు పెంపొందుతాయని, ఒకే చోట చేరి సామూహికంగా భోజనాలు చేయడం అభినందనీయం అన్నారు. సామాజిక సేవా రంగాల్లో ఆర్యవైశ్యులు అగ్రస్థానంలో అందరికీ ఆదర్శంగా ఉండాలన్నారు. పూర్వం నుంచి సమాజ శ్రేయస్సు కోసం వన భోజన మహోత్సవాలు ఆచారంగా నిర్వహిస్తున్నారని, ఆ ఆచారాన్ని కొనసాగిస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులను అభినందించారు. ఇందులో భాగంగా ప్రజలందరికీ కార్తీక మాస శుభా కాంక్షలు తెలిపారు. అనతరం వనమహోత్సవం సందర్భంగా ఎమ్మె కూనంనేనికి, సాబీర్ పాషాకు షాలువాలు కప్పి సత్కరించారు.



**ప్రజాపక్షం/పాల్వంచ :** కార్తీకమాస వన భోజనాలు ఐక్యతను పెంపొందిస్తాయని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ నవభారత్ సమీపంలోని శ్రీలక్ష్మి గార్డెన్‌లో ఆర్యవైశ్యుల వన సమారాధన ఆదివారం నిర్వహించా రు. కార్తీక వనమహోత్సవాలతో ఆద్యాత్మిక , సో దర భా వాలు, ఆత్మీయత, అనురాగాలు పెరుగుతాయన్నారు. యువతరానికి మన సంస్కృతి సాంప్రదాయాలు తెలుస్తాయని అన్నారు. చిన్నప్పటి నుండే పిల్లలకు భక్తిభావం, ఇతరుల పట్ల స్నేహం భావం కలుగుతుందన్నారు. సమాజ శ్రే యస్సు కోసం వనమహోత్సవాలను నిర్వహించుకోవటం ఆనవాయితీగా వస్తుందన్నారు. సామాజికసేవా రంగాలలో ఆర్యవైశ్యులు అందరికి ఆదర్శంగా ఉండాలని ఆకాంక్షించారు. పిల్లలకు ఆటపాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్యవైశ్య నాయకులుచలవాది ప్రకాష్, రాజ్యలక్ష్మి, దారా రమేష్, పొద్దుటూరి నగేష్, కొదుమూరి శ్రీనివాసరావు, పసుమర్తి రాము, బచ్చు శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

## పేదలకు భూములు పంచిన సిపిఐ

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/చింతకాని:** డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ కు చింతకాని మండల వ్యా ప్తంగా విరివిగా చందాలిచ్చి అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని నాగిలిగొండ గ్రా మంలో ఆదివారం వేపూరి నరసయ్య అధ్యక్షతన శాఖ సమావేశం నిర్వహించారు. భారతదేశ గడ్డపై సిపిఐకి వందేండ్లన్నారు. దీనికి గుర్తుగా శతా బ్ది ఉత్సవాల ముగింపు సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. వం దేండ్ల మహా ప్రస్థానంలో నిత్యం ప్రజాసమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐ సొంతమన్నారు.ఏ పార్టీకి లేని ఘన చరిత్ర సిపిఐ కి ఉందన్నారు. భూస్వాముల చెరనుండి లక్షలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచిపెట్టిన ఘన చరితను లిఖించుకున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు చింతకాని మ ండలం నుంచి అన్ని వర్గాల ప్రజలు అదిక సంఖ్యలో హాజరై విజయవం తం చేయాలని పిలుపునిచ్చారు. నాగిలిగొండ గ్రామం నుండి పురుషులు రెడ్ షర్ట్స్, మహిళలు చీరలతో, డప్పు కోలాట నృత్యాలతో భారీగా ఖమ్మం తరలిరావాలన్నారు.

## జామాయిల్ అడితిలో అక్రమాలు!

### రూ. 500 కోట్ల జీరో లావాదేవీలు

### ఆ వైపు కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం

**ప్రజాపక్షం/ ముల్కలపల్లి :** చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారు సైతం పన్నులు చెల్లించకపోతే వేటాడి వెంటాడే అధికారులు ఏడాది పొడవునా ఎటువంటి పన్నులు చెల్లించకుండా జీరో దందా నిర్వహిస్తున్న పట్టించుకోకపోవడం శోచనీయం. చిన్న సన్న వ్యాపారం కాదు ఏకంగా రూ.500 కోట్ల టర్నోవర్ కలిగిన జామాయిల్ అడితి మొత్తంలో జీరో దందా నడుస్తుంది. ఒక పక్క ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ రైతులను ఇబ్బందులు పెట్టే జామాయిల్ వ్యాపారులు మరో పక్క ప్రభుత్వానికి సైతం పన్నులు ఎగవేస్తూ కోట్లు గడిస్తున్నారు. పిసాచట్ట నిబంధన ప్రకారం గ్రామ సభ ఆమోదం పొందిన తర్వాతే వ్యాపారం ని ర్వహించాలి. కానీ అవేవి ఇక్కడ పట్టింపు కాదన్నట్లుగా వ్యాపారులు వ్యవహరిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి జామాయిల్ అడితిలను ఏ ర్పాటు చేసి రైతులను దోచుకుంటున్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసేటప్పుడుకానీ చెల్లింపుల సమయంలో కానీ ఎటువంటి పత్రాలు ఉండవు. వా రు చెప్పిందే వేదం. కలప తూకం, బిల్లు తప్ప మరొకటి రైతులకు ఇవ్వరు. 2017 జులై ఒకటి నుంచి అమల్లోకి వచ్చిన జిఎస్టితో ప్రజల నడ్డివిరుస్తున్న ప్రభుత్వం ఇటువంటి వ్యాపారులను మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ముల్కలపల్లి మండల వ్యాప్తంగా జరుగుతున్న అక్రమ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని, రైతులను పీడిస్తూ ఏజెన్సీ నిబంధనలకు తూట్లు పొడుస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రెండవ రోజు ఉత్సాహంగా కబడ్డీ ఫైనల్ పోటీలు

### నేడు కబడ్డీ పోటీలకు మంత్రి సీతక్క రాక



**ప్రజాపక్షం/పినపాక:** పినపాక మండలం ఈ బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో అట్టహాసంగా రాష్ట్ర స్థాయి అండర్ 17 బాల బాలికల కబడ్డీ పోటీలు రెండవ రోజు ఉత్సాహంగా కొనసాగాయి. ఈ పోటీలలో పది జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులు కబడ్డీ పోటీలను చూపేందుకు వీక్షకులు సైతం భారీగా చేరకుని ఆటలను తిలకించారు. మారుమూల గిరిజన గ్రామం ఈ బయ్యారంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడలకు వేదిక కావడం గర్వంగా ఉందని తెలిపారు. ఈ పోటీలను జిల్లా అధికారులు, మండల స్థాయిలు నిత్యం పర్యవేక్షిస్తూ క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలను తీసుకుంటున్నారు.

### నేడు ఫైనల్ మ్యాచ్..

నేడు ఫైనల్ మ్యాచ్ కావడంతో అందరికి చూపు నేడు జరిగే ఫైనల్ మ్యాచ్‌పైనే ఉంది. ఈ ఫైనల్ మ్యాచ్‌ను చూసేందుకు ఈ జిల్లాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం అధిక సం ఖ్యలో వీక్షకులు పాల్గొనే అవకాశం ఉందని అధికారులు తెలుపుతున్నారు.

### కలెక్టర్, ఎస్‌పి పర్యవేక్షణ

ఈ బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో అట్టహాసంగా రాష్ట్ర స్థాయి అండర్ 17 బాల బాలికల కబడ్డీ పోటీలకు నేడు జరిగే ఫైనల్ కబడ్డీ పోటీలను రాష్ట్ర మంత్రి ధనసరి అనసూర్య( సీతక్క) రానున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాటులకు చేశారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్‌లు పోటీలలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలను తీసుకోవడంతో పాటు, నిరంతరం అధికారుల ద్వారా పర్యవేక్షిస్తున్నారు.

## జర్నలిస్టుల ఐక్యతకు నిదర్శనమే వన సమారాధన

### మధిర ప్రెస్ క్లబ్ కోశాధికారి

### కాకరపర్తి శ్రీనివాస్‌కు ఘన సన్మానం



**ప్రజాపక్షం/ మధిర :** జర్నలిస్టుల ఐక్యతకు నిదర్శనమే వనసమారాధన కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని మధిర మెయిన్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జివి, అరుణ్ పేర్కొన్నారు. కార్తీక మాసం స ందర్భంగా మండల పరిధిలోని కృష్ణాపురం గ్రా మంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ రామ్మోహన్ రావు మామిడితోటలో ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు నాళ్ళ శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం వన సమారాధన కా ర్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రెస్ క్లబ్ జర్నలిస్టులంద రూ సందడి సందడి చేస్తూ వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జివి, అరుణ్ మాట్లాడుతూ మధిర ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసుకోవటంతో పాటు గతంలో ఎన్నడూలేనివిధంగా నియోజకవర్గ కేంద్రమైన మధిరలో ప్రెస్ క్లబ్ కార్యాలయం ఏర్పాటు చేయటం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ప్రెస్ క్లబ్ ఏర్పాటై తక్కువ స మయంలోనే జర్నలిస్టుల ఐక్యతకు నిదర్శంగా ఏ ర్పాటు చేసుకున్న వన సమారాధన కార్యక్రమం లో జర్నలిస్టులంతా పాల్గొని విజయవంతం చేసిన ట్లు తెలిపారు. అదేవిధంగా వన సమారాధన కార్యక్రమ ఏర్పాటుకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన ప్రజాపక్షం మధిర ఆర్‌సి ఇన్‌చార్జి, ప్రెస్ క్లబ్ కోశాధికారి కాకరపర్తి శ్రీనివాసరావుకు ప్రెస్ క్లబ్ తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రముఖ సామాజిక సేవకులు లంకా కొం డయ్య పాల్గొని జానపద గేయాలతో చైతన్యాన్ని కలిగిస్తూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలపై వివరించి ఆ దిశగా సామాజిక కార్యక్రమాల్లో తమవంతుగా ప్రెస్ క్లబ్ పాలు పంచుకుని సహా య సహకారాలు అందించాలని కోరారు. వన స మారాధన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ఉప కోశాధికారి శ్రీధర్, ఉపాధ్యక్షులు లిక్కి రవీందర్, ప్రచార కార్యదర్శి అర్జున్, సహాయ కార్యదర్శులు వాసు, బాణాల రామకృష్ణ, గౌతమ్, చారుగుండ్ల నర్సింహామూర్తి, బాణాల శంకరాచారి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. మధిర ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కృష్ణాపురం మామిడితోటలో వన మహోత్సవ కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన మధిర ప్రెస్ క్లబ్ కోశాధికారి కాకరపర్తి శ్రీనివాసరావును ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జివి, అరుణ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వనసమారాధన కార్యక్రమ నిర్వహణకు సహాయ సహకారాలు అందించిన కాకరపర్తి శ్రీనివాసరావును అభినందించారు. ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు నాళ్ళ శ్రీనివాసరావు, కమిటీ స భ్యులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## భద్రాచలం, కొత్తగూడెంలో ప్రజావాణి

**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాయం, కొత్తగూడెం ఆర్‌డిఓ కార్యాలయాల్లో ప్రజల సౌకర్యార్థం సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లాకలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. భూ సమస్య పరిష్కారానికి ప్రజలు సుదూర ప్రాంతాల నుండి ప్రజలు ప్రజావాణికి వస్తున్నందున వారి సౌకర్యార్థం డివిజన్ల వారీగా ప్రజావాణి నిర్వహణకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. భద్రాచలం డివిజన్ పరిధిలోని ప్రజలు భూ సమస్యల పరిష్కారం నిమిత్తం దరఖాస్తు చేసుకునేందుకు భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో, కొత్తగూడెం డివిజన్ ప్రజలకు కొత్తగూడెం ఆర్‌డిఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. ఇతర సమస్యలకు దరఖాస్తులు చేసే వారు కలక్టరేట్‌లోని ఇన్‌వార్డులో తమ దరఖాస్తులను అందించి రశీదు పొందాలని, దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆ ప్రకటన ద్వారా తెలిపారు.

## గడపగడపకూ సిపిఐ శతాబ్ది ముగింపు వేడుకల ప్రచారం


**ప్రజాపక్షం/ఇల్లందు:** సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ గడపగడపకు సిపిఐ కార్యక్రమం ఆదివారం మండలంలో నిర్వహించారు. తర్వాత ఆ ప్రాంతంలోని కార్యకర్తలను పార్టీ సానుభూతిపరులను కలిసి డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభకు రైతులు వ్యవసాయ కూలీల చేతి వృత్తులు వాళ్ళు మహిళలు యువకులు విద్యార్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సిపిఐ ఇల్లందు మండల కార్యవర్గ సభ్యులు మంచాల వెంకటేశ్వర్లు, ఆలెం రాఘవేంద్రరావు, జక్కుల కనకయ్య, కోటిలింగం, తదితరులు పాల్గొన్నారు.


# మిరుమిట్ల దీపాలు... గాల్లో ప్రాణాలు

### వాహనాలకు మితిమీరిన రంగురంగు లైట్లు

### పొంచి ఉన్న ప్రమాదాలు..

### రాత్రివేళల్లో పెరుగుతున్న ప్రమాదాలు





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గతంతో పోలీస్తే రోడ్ల మీద ద్విచక్ర వాహనాలను మొదలు పెద్దపెద్ద వాహనాలు రాకపోకలు విపరీతంగా పెరిగిపోయాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వాహనాల రద్దీ కూడా పెరిగిపోయింది. రోడ్ల మీద పడాల్సిన లైట్లు ఆకాశం మీదికి, ఎరుపు రంగులో సిగ్నల్ ఇవ్వాల్సిన లైట్లు నీలి రంగులతో కనిపిస్తున్నాయి. మరో ప్రక్క ఎక్కువ వెలుతు రు రావాలని ఎల్‌ఇడి లైట్లు అమర్చి ఎదురుగా వచ్చే వా రి ముఖం మీద పడేలా విచ్చిల విడితనాన్ని ప్రదర్శిస్తుంటారు. ఈ ఎల్‌ఇడి లైట్ల కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వీటి ద్వారా ఎక్కువ ఫోకస్ వస్తుండటంతో ఎదురుగా వచ్చే వారు కళ్లకు తీవ్ర ఇబ్బంది ఎదురై వారి తడబడే ప్రమాదం ఉంది.

**పద్ధతిలేకుండా :** పద్ధతి లేకుండాఇష్టాను సారంగా రంగురంగుల లైట్లు అమర్చడం చట్ట విరుద్ధం. మోటార్ వెహికిల్ యాక్ట్, సెంట్రల్ మోటార్ వెహికిల్ రూల్స్ ప్రకారం మోటార్ సైకిల్ అయినా, కారు, లేదా ఇతర ఏ పెద్ద వాహనాలు అయినా హెడ్ లైట్లను ఆటోమెటివ్ రిసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా స్టాండర్డ్ ప్రకారం అమర్చాలి.రోడ్డంతా కనిపించాలనే ఉద్దేశ్యంతో సాధారణంగా ఎల్‌ఇడి హెడ్ లైట్స్ 55/ 60 వాట్స్ హాలజన్ బల్బులు లేదా 3వేల ల్యూమెన్స్ ఎల్‌ఇడి బల్బులు వరకు అమర్చుకోవచ్చు. బైక్ అయితే 35/35 వాట్స్, కారుకు 55/60 వాట్స్, లారీ,గూడ్స్ వాహనానికి 55/60 వాట్స్ వరకు ఎల్‌ఇడి బల్బులను పెట్టుకోవచ్చు. కానీవాటికంటే ఎక్కువ సామర్థ్యాన్ని కలిగినవాటిని పెట్టుకోవడం వల్ల ప్రమాదాలకు కారణమవుతున్నమనే సంగతి మర్చిపోతున్నారు.

**రాత్రివేళల్లో ప్రమాదాలు :** ఎక్కువ కాంతిని వెదజిమ్మె వాహన లైట్ల వల్ల రాత్రివేళల్లో పెద్ద ఎత్తున ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అత్యంత వెలుతురు వ చ్చే లైట్లు సుమారు 200 నుండి 300 మీటర్ల దూరంలో ఉండగానే కళ్లు బైర్లు కమ్మెలా ఉంటున్నట్లు పలువురు వాహన దారులు వా పోతున్నారు.

**పోలీస్, రవాణా శాఖలు దృష్టి సారిస్తే మేలు :** పెద్దపెద్దగా వెలుదురు వెదజల్లే రంగురంగుల వాహన లైట్ల విషయంలో పోలీస్ శాఖతో పాటు రవాణా శాఖ దృష్టి సారించాలని పలువురు అంటున్నారు.లైట్లవిషయంలో కూడా పో లీసులు, రవాణాశాఖాధికారులు సంయుక్తంగా రాత్రివేళల్లో గస్తీగాసి మితిమీరిన రంగురంగుల లైట్లతో ఉండే వాహనాలను నిలుపుదల చేసి అవగాహన కల్పించే చర్యలు తీసుకుంటే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**హాని కలిగే చర్యలు వద్దు, రెహమాన్ ,డిఎస్‌పి,కొత్త-గూడెం :** వాహనాలకు అమర్చే అతి వెలుతురు వెదజిమ్మె ఎల్‌ఇడి దీపాల వల్ల ఎదురుగా వచ్చే వాహనానికి ఇబ్బందే. ఎదుటి వారికి ఇబ్బంది కలిగే పనులు ఎవ్వరు చేసినా తప్పే. కేసులు రాస్తూనే ఉన్నాం సంగం వెంకట పుల్యయ్య మోటర్ వాహన ఇన్స్‌పెక్టర్ భద్రాచలం : బండ్లు కొనంగానే రంగురంగు లైట్లు పెట్టుకుని మోటార్ వాహన చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఎక్కువ కాంతి ని ఇచ్చే లైట్లవల్ల జరిగే ప్రమాదాలపై పలు మార్లు వాహన దారులకు అవగాహన కల్పించాం. మార్పు రావటం లేదు. ఇప్పటి వరకు పలు సందర్భాల్లో అనేక కేసులు నమోదు చేసి జరీమానాలు విదించాం.





## గొర్రెల కాపరుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ నర్సంపేట:** గొర్రెలు, మేకల పెంపకం దార్ల సమస్యలు పరిష్కరించకుంటే ప్రభుత్వంపై పోరాటం తప్పదని గొర్రెలు మేకల పెంపకం దార్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ ప్రభుత్వాన్నిహెచ్చరించారు. వరంగల్ జిల్లా 3వమహాసభ నర్సంపేట పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో నాగరబోయిన సారంగం, చెల్ల మల్లయ్య,మైల రాజు అధ్యక్ష నిర్వహించారు. మహాసభలో ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వం గొర్రెల మేఘాల పెంపకం దార్ల పట్ల చిన్నచూపు చూస్తుందని, ఎన్నికల ముందు ప్రభుత్వం గొల్ల కురుమలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. ప్రభుత్వాలు ఏళ్ల తరబడి గ్రామ సొసైటీ ఎన్నికలు నిర్వహించకుండా జాప్యం చేస్తున్నారని అన్నారు. వెంటనే గ్రామ సొసైటీ ఎన్నికలు నిర్వహించి జిల్లాల వారిగా యూనియన్లను విభజించి జిల్లా ఎన్నికల కూడా నిర్వహించాలన్నారు.

## తుఫాన్ నష్టంపై పక్కాగా నివేదిక రూపొందించాలి

**ప్రజాపక్షం/హనుమకొండ :** మొంథా తుఫాన్ నష్టం అంచనాల వ్యవసాయ అధికారులు, క్షేత్ర స్థాయిలో రైతుల పొలాలను సందర్శించి పక్కాగా నివేదిక తయారు చేయాలని, ఏ ఒక్క నష్టపోయిన రైతు మిగలకుండా ప్రతి ఒక్కరిని కవర్ చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. నిర్ణీత నమూనాలో తుఫాన్ నష్టం అంచనా నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు . పంచాయతీ రాజ్, ఆర్అండ్ బి రోడ్లు ఎంత మేరకు మరమ్మత్తులకు గురైందనే అంశాలను క్షేత్ర స్థాయి పరిశీలన చేసి పూర్తి ఆధారాలతో నివేదిక సిద్ధం చేయాలని, తాత్కాలిక మరమ్మత్తులు, శాశ్వత మరమ్మత్తులకు ఎంత వ్యయం అవుతుందో అంచనాలతో సహా వివరాలు సమర్పించాలని తెలిపారు.విద్యుత్ శాఖ సంబంధించి దెబ్బతిన్న పోల్స్, ట్రాన్స్ ఫార్మర్ వివరాలు అందించాలన్నారు. దెబ్బతిన్న చెరువులు, కాల్వలు, నీటివనరుల వివరాలు సమర్పించాలన్నారు.



## అలరించిన బాలల చిత్ర కళా ప్రదర్శన

**ప్రజాపక్షం/హనుమకొండటౌన్ :** వరంగల్ కాకతీయ కళాపీఠం ఆధ్వర్యంలో బాల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన చిత్రకళ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రి సీతక్క కుమారుడు ప్రముఖ ఇంజనీర్ సూర్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మాస్టర్ జి విద్యాసంస్థల చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఎగ్జిబిషన్ను తిలకించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ జి హై స్కూల్ కిషన్ పుర వైస్ ప్రిన్సిపాల్ రాధిక, కాకతీయ కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీధర్ రాజు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కాకతీయ కళాపీఠం ఉపాధ్యక్షురాలు సుశీల స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీత, నిర్వాహకులు సునీల్, కుమార్, పల్లవి, అచ్చ సుదర్శన్ స్టేట్ అవార్డు గ్రహీత, రమేష్ మ్యాస్ ఉపాధ్యాయులు, లయన్ పద్మజ దేవి, మంజుల, కిడ్స్ ఇంజనీరింగ్ కాలేజ్ మ్యాస్ ప్రొఫెసర్ డాక్టర్ వి. ఆనంద్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. శనివారం నిర్వహించిన సామాజిక అంశాలపై విద్యార్థులు పెయింటింగ్ చేసిన 177 చిత్రాలను మాస్టర్ హైస్కూల్లో కిషన్ పుర లో ప్రదర్శించినారు. ఆదివారం నిర్వహించిన మ్యాథమెటిక్స్ టాలెంట్ టెస్టు, క్విజ్ పోటీలలో సుమారు 30 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటమి గెలుపునకు తొలిమెట్టు

### కాజీపేట ఎసిపి ప్రశాంత్‌రెడ్డి



**ప్రజాపక్షం / హనుమకొండ టౌన్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లోని నారాయణ పాఠశాలలో ఘనంగా వరంగల్ జోనల్ స్థాయిలో నారాయణ ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి, ఎంఇఓ నెహ్రూనాయక్, వరంగల్ జోనల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రిజ్వానాఇమ్రాన్, హాజరైనారు. ఈ సందర్భంగా ఏసి పి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు కేవలం శారీరక బలాన్ని మాత్రమే కాకుండా, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, సమయస్ఫూర్తి ని కూడా నేర్పుతాయని,క్రీడలు మనల్ని ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా, ఒత్తిడిని తగ్గించి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని అన్నారు.క్రీడలలో గెలుపోటములు సహజం, కానీ గెలిచినపుడు సంతోషించడం,నిరాశ చెందకుండా మళ్ళీ ప్రయత్నించడం, ఆటలో నిజమైన స్ఫూర్తిని ప్రదర్శించడం ముఖ్యమని అన్నారు.ఎం.ఇ.ఓ నెహ్రూ నాయక్ మాట్లాడుతూ నేటి యువత క్రీడలలో రాణించడం చాలా అవసరమని క్రీడలలో పాల్గొనడం ద్వారా భారతదేశం క్రీడా రంగంలో ఎదగడానికి సహాయపడుతుందని,నేటి క్రీడా పోటీలలో పాల్గొనే ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. గెలిచినా, ఓడినా అందరూ క్రీడా స్ఫూర్తితో ప్రదర్శించాలని అన్నారు. అనంతరం విజేతలకు ఎసిపి పి. ప్రశాంత్ రెడ్డి చేతుల మీదుగా బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ పాఠశాలల ప్రిన్సిపాల్ లు అలేఖ్య,తేజవత్ అనిత, ఫర్హాన, మమత, జోనల్ కో ఆర్డినేటర్ లు ఆకుల సాయికృష్ణ, శ్యామల, శిరీష, అకడమిక్ డీన్ లు రాజశేఖర్, రాకేష్, విక్రమ్, నరేష్, సాఫ్ట్ స్కిల్ ఉపాధ్యాయులు వీణాకుమారి సాయి చరణ్, ఏఓ లు ఆదిల్, చేరలు, అన్వార్, రాజ్ కుమార్, పిఇటిలు ఘనశ్యాం, మహేష్, శ్రవణ్, బాలకృష్ణ, నాలుగు బ్రాంచ్ ల విద్యార్థిని విద్యార్థులు, తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా షైన్ విద్యార్థుల 'ప్రెషర్స్‌డే'



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ నగరం హంటర్‌రోడ్డులోని డికన్వెన్షన్ హాల్‌లో షైన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థినీ విద్యార్థులు రిథమ్2025 ఫ్రెషర్స్ డే ఉత్సవాలు వైభవంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో షైన్ విద్యాసంస్థల ఛైర్మన్ మూగుల కుమార్ యాదవ్ తో పాటు ముఖ్య అతిదిగా డీఐఈవో ఆర్జేడీ గోపాల్, డైరెక్టర్లు మూగుల రమ, ఎ. కవిత,జక్కుల శ్రీనివాస్ (ఎర్రగట్టు స్కూల్ బ్రాంచ్), మూగుల రమేష్ యాదవ్ గార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షైన్ విద్యా సంస్థల ఛైర్మన్ మూగుల కుమార్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు నేటి ఆధునికతలో భాగంగా ఉపయోగిస్తున్న మొబైల్ ఫోన్స్, ఇంటర్‌నెట్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని ప్రతి ఒక్కరూ చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్ మారబోయిన రాజు గౌడ్, పి. శ్రీనివాస్, ప్రశాంత్, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పెండింగ్ డిఎ చెల్లించాలి

### టియుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/ వరంగల్ :** పెండింగ్‌లో ఉన్న డిఏలను తక్షణమే చెల్లించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టియూటిఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు అన్నారు. టియూటిఎఫ్ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశం వరంగల్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన వారి విరమణ భత్యాలను వెంటనే చెల్లించాలన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటును పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను సత్వరమే పరిష్కరించి మండల విద్యాధికారి, జిల్లా ఉప విద్యాధికారి, జిల్లా విద్యాధికారి పోస్టులను రెగ్యూలర్‌గా భర్తీ చేసి పాఠశాలలో విద్యను మరింత పటిష్టం చేయాలన్నారు. ఇన్ సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయించాలని కోరార.అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు నూతనకంటి బాబును సంఘ ముఖ్య సలహాదారుగా నియమించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు దార గణేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లచ్చిమల్ల వెంకన్న, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎర్రం శెట్టి స్నేహ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు చెడుపాక కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా కందగట్ల సత్యనారాయణ, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షురాలు గోపాలదాస్, శ్రీవిద్య, అన్నిజిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పత్రి భవన కాంట్రాక్టు హరీశ్ బినామీదే

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హనుమకొండ:** వరంగల్‌లో 24 అంతస్తులతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ కంపెనీ మాజీ మంత్రి హరీష్ రావు బినామీదనితెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. జాగృతి జనం బాట పేరుతో జిల్లాల్లో పర్యటిస్తున్న కల్వకుంట్ల కవిత టీఆర్ఎస్‌పై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ నుంచి తనను చాలా అవమానకరంగా బయటకు పంపించారని,ఉరి వేసే ముందు ఖైదీనైనా చివరి కోరిక అడుగుతారని, కానీ తనకు కనీసం షోకాజ్ నోటీసు కూడా ఇవ్వకుండా సస్పెండ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ తో, కేసీఆర్ తో రాజకీయంగా చర్చించడానికి మిగిలింది ఏమీ లేదని,తండ్రిగా కేసీఆర్ పిలిస్తే కూతురిగా ఇంటికి తప్పకుండా వెళ్తానన్నారు. తనకు బీఆర్ఎస్ లో ఎవరితోనూ పంచాయితీ లేదని, కుటుంబం నుంచి నన్ను బయటకు పంపారని ఆరోపించారు. తాను చెప్పేది చెప్పానని,నన్ను ఎందుకు సస్పెండ్ చేశారో ఇప్పటికీ వరకు బీఆర్ఎస్ నుంచి జవాబు లేదన్నారు. ఇవాళ హనుమకొండలో ప్రెస్ మీట్ లో మీడియాతో మాట్లాడిన కవిత.. బీఆర్ఎస్ నన్ను ప్రోటోకాల్ పేరుతో నిజామాబాద్ కే కట్టడి చేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. పాలిటిక్స్ పక్కా చేస్తానని, ఆడబిడ్డలు రాజకీయం చేస్తే ఎలా ఉంటుందో చూపిస్తానన్నారు.

**హరీశ్ రావు బినామీకే కాంట్రాక్ట్**

వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవనాన్ని రూ.11 వందల కోట్ల నుంచి రూ.17 వందల కోట్లకు పెంచారని ఈ పనులు మాజీ మంత్రి హరీశ్ రావు బినామీ కంపెనీకి ఇచ్చారని కవిత ఆరోపించారు. దీని పై విజిలెన్స్ విచారణ వేసిన ప్రభు త్వ ం ఎందుకు నివేదిక తెప్పించుకొని చర్యలుతీసుకోవటం లేద ని నిలదీశారు. స్టూ డెంట్ యూనియన్ ఎన్నికలు మళ్లీ మొదలు పెట్టాలి. అలాంటప్పుడే కొత్త నాయకత్వం వస్తుందని లేకుంటే పొలిటిషియన్ పిల్లలు, వాళ్ల చుట్టాలే రాజకీయాల్లోకి వస్తున్నారన్నారు. రాష్ట్రంలో పాలక పక్షం, ప్రతిపక్షం జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బిజీగా ఉందని,ప్రజల తరఫున అడిగేవారు లేరని, అందుకే మేము ఆ పని చేస్తున్నామన్నారు.

**బిజెపితో తెలంగాణాకు పైసా రాలేదు**

కేంద్రంలో మూడు సార్లు గెలిచిన బీజేపీతో తెలంగాణకు పైసా పని కాలేదని విమర్శించారు. బీఆర్ఎస్ లో ఉన్నప్పుడు నన్ను నిజామాబాద్ లో పరిమితం చేశారని, ప్రోటోకాల్ అనే తాడుతో కట్టడి చేశారని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు.

### ఎల్కతుర్తి–సిద్దిపేట రహదారిపై ప్రమాదం

## లారీ–బైక్ ఢీ.. ఒకరు మృతి



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ శివారులోని ఎల్కతుర్తి సిద్దిపేట ప్రధాన రహదారిపై ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు టిప్పర్ లారీ బైక్‌ను ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్తున్న మంగళపల్లి గ్రామానికి చెంది బసిరెడ్డి శ్రీనివాస్(48) అనే వ్యక్తి మృతిచెందాడు. అతను తన మనుమడు, మరోక చిన్నారిని తీసుకొని ముల్కనూర్ వైపు వెళ్తున్నాడు. తమవైపు టిప్పర్ లారీ దూసుకొస్తుందని గమనించి ఇద్దరు చిన్నారులను రోడ్డు కిందవైపు తోసాడు. శ్రీనివాస్ తప్పించుకునే అవకాశం లేకపోవడంతో లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్నారులు చిన్నచిన్న గాయాలతో బయటపడగా శ్రీనివాస్ మాత్రం తలపగిలి మెదడు బయటకు రావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎసిపి ప్రశాంత్ రెడ్డి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. కేసు నమోదు చేసుకున్న ముల్కనూర్ పోలీసులు మృతదేహాన్ని హుజురాబాద్ మార్చురీకి తరలించారు.

## పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యం

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ తూర్పు నియోజకవర్గం 32వ డివిజన్‌లో ఆకారపు వీర లక్ష్మి ప్రభుత్వ పాఠశాలలో పేద ప్రజలకు ఉచిత వైద్య అందించడమే లక్ష్యంగా పల్లం హరీష్ వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి పాల్గొని ఉచిత వైద్య శిభిరాన్ని ప్రారంభించారు. పల్లం హరీష్ మాట్లాడుతూ అమ్మ,నాన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ వైద్య శిభిరాలు,సేవా కార్యక్రమాలు చేస్తానన్నారు. కార్పొరేటర్ పల్లం పద్మ రవి, మేరిపల్లి వినయ్, బుదరపు హరికృష్ణ, బైరి ప్రతాప్,గౌడ సందీప్, రాజు, శ్రీను,సమ్మయ్య యాదవ్, కేదారి పద్మ ఉన్నారు.

# వైద్యుల నిర్లక్ష్యంతో బాలుడు మృతి

### పిహెచ్‌సి ముందు కుటుంబ సభ్యులు ధర్నా





**ప్రజాపక్షం/కన్నాయిగూడెం:** పాముకాటుకు గురై బాలుడు మృతి చెందిన సంఘటన కన్నాయిగూడెం మండలం గుర్రేవుల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే రెండవ శనివారం పాఠశాలకు సెలవు కావడంతో అక్క, అన్నయ్యలతో కలిసి ఇంటి ఆవరణలో ఆటలు ఆడుకుంటున్న తిరునగిరి రాజు సంగీత దంపతుల రెండవ కుమారుడు హరినాథ్ సాయి(7) ఒక్కసారిగా అరిచాడు. నానమ్మ దగ్గరకు వెళ్లి తనకు పాము కరిచిందని చెప్పాడు. కుటుంబ సభ్యులు స్థానిక ఆరోగ్య కేంద్రంకు బాలుడిని తీసుకెళ్లారు.మెడికల్ ఆఫీసర్ అందుబాటులో లేకపోవడంతో పాము కాటుకు ఇంజక్షన్లు అందుబాటులోలేవని తెలిపారు.108లో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం ఏటూరునాగారం వైద్యశాలకు తరలిస్తుండగామార్గమార్గంలోమృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 9గంటలకు తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు బాలుడి మృతదేహంతోమండలకేంద్రంలోని పిహెచ్‌సికి చేరుకొని రోడ్డు పై బైఠాయించారు. వైద్యుల నిర్లక్ష్యంతో బాలుడు మరణించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. మంత్రి సీతక్క చొరవ తీసుకొని మెడికల్ ఆఫీసర్, నర్సులను తొలగించాలని డిమాండు చేశారు. రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఏటూరునాగారం సిఐ శ్రీనివాస్, కన్నాయిగూడెం తహసీల్దారు సయ్యద్ సర్వర్ పాషా, కన్నాయిగూడెం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎండి అప్సర్ పాషా సంఘటన స్థలానికి చేరుకొనిమంత్రి సీతక్కకు తెలిపారు.మంత్రి సీతక్క స్పందించి పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్, నర్సులపై చర్యలు తీసుకుంటామని ఇచ్చిన హామీ మేరకు ధర్నా విరమించారు.

## కమీషన్ల కోసమే మేడారం జాతర పనుల్లో కాలయాపన

### బిఆర్ఎస్ ములుగు జిల్లా ఇన్‌చార్జి బడే నాగజ్యోతి



**ప్రజాపక్షం/ములుగు:** కమీషన్ల కోసమే మేడారం జాతర పనులు కాలయాపన చేస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క సారలమ్మలను బడే నాగజ్యోతి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బడే నాగజ్యోతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్లు ఇస్తామని చెప్పినప్పుడు 117 కోట్లు కేటాయించడం, ఆ పనులు ఇప్పటి వరకు ప్రారంభించకపోవడం, ప్రారంభించిన పనులు నత్తనడక సాగడం జాతర సమయానికి పనులు పూర్తి అవుతాయా లేవో అనే సందేహం ఏర్పడిందని జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కల్గకుండా సౌకర్యాలు కల్పించాలని ఆమె అన్నారు. జాతర పనులు నత్తనడకన నడుస్తున్న కూడా ఈ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తేలాగా వ్యవహరించడం సిగ్గుచేటని ఆమె అన్నారు. మేడారంగ్రామపరిసర ప్రాంతాల్లో జాతర ద్వారా జరిగే రైతుల రెండవ పంట పరిహార సంగతి దేవుడెరుగు, జాతర సమయాల్లో విఐపిల పార్కింగ్‌కై టెంపరరీ పబ్లిక్ టాయిలెట్స్‌కై భూమి గత వారితో ఎలాంటి సంప్రదింపులు లేకుండా ఇష్టానుసారంగా నిర్మించి జాతర అనంతరం వాటిని పూడ్చుకోవడానికి అవస్థలు పడుతున్న రైతులకు నష్టపరిహారం కూడా కల్పించే దాకలాలు లేవని, అధికారుల తీరుపై రుసరుసలు ఆడారు. ఈ కా ర్యక్రమంలో మండలాధ్యక్షుడు దండగుల మల్లయ్య, రామసహాయం శ్రీనివాసరెడ్డి, పోగు నగేష్, చిడం బాబురావు, శ్రీధర్ గౌంది, శివరాజ్, సమ్మిరెడ్డి, కొర్నిబెల్లి శేషగిరి, సురేష్, ఇంద్రారెడ్డి, జీడిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి లారీ ఢీ.. ఒకరు మృతి

**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** మట్టి లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకున్నది.భీమదేవరపల్లి మండలంలోని మంగళపల్లి స్టేజి వద్ద ఆదివారం నాడు ఉదయం 9:30 కి ముల్కనూర్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బసిరెడ్డి శ్రీనివాస్ (48) ఎల్కతుర్తి నుండి సిద్దిపేట వైపుకు వెళుతున్న మట్టి లారీ మంగళపల్లి స్టేజి వద్ద బైక్ ని ఢీకొట్టడంతో శ్రీనివాస్ తలకి బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మరణించాడు. తరచూ మంగళ పల్లి స్టేజి వద్ద మట్టి లారీలు అతివేగంతో రావడం వల్ల గతంలో పలువురు మరణించిన విషయం తెలిసిందే. కాగా ఈ ఘటనతో చనిపోయిన వ్యక్తికి తగిన న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు రోడ్డుపై బైఠాయించి శవం తో ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజల కోసమే నిరంతర పోరాటం



**ప్రజాపక్షం/వరంగల్ :** భారత గడ్డపై సిపిఐకి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో అఖిల భారతస్థాయి ముగింపు ఉత్సవాలు లక్షలాదిమందితో బహిరంగ సభను నిర్వహించడం జరుగుతుందని సిపిఐ వరంగల్ మండల కార్యదర్శి గుండె భద్రి అన్నారు. వరంగల్ పట్టణంలోని కెవిల్ మహేంద్రనగర్ కాలనీలో సిపిఐ జనరల్ బాడీ సమావేశాన్ని అధ్యక్షుడు ఎండి నిక్కల్ అమినాఅధ్యక్షత వహించి ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వేటిచాకిరి విముక్తి కోసం నిరంకుశ నిజాంను గద్దె దించడానికి జరిగిన మహోత్తర తెలంగాణ సాయుధ పోరాటం లో నాలుగున్నర వేల మంది ప్రాణత్యాగాలతో మూడువేల గ్రామాల విముక్తి, 10లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదేనన్నారు. సిపిఐ సినియర్ నాయకులు ఎండి ఖాసీం, మండల కౌన్సిల్ నాయకులు సంద్ర కుమార్, ఎండీ శాభాన, కార్యదర్శి పరికిరాల రమేష్, సహాయ కార్యదర్శి ఎస్‌కే రమేష్, ఎస్‌కే యాకుబ్, పాష, వరలక్ష్మి , జన్ను రజిత, రజియా, సువర్ణ, అసియా, మొగిళి, అశోక్, రజిత తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ నగర్‌లో సమస్యలతో సతమతం

### మున్సిపల్ అధికారులకు కాలనీవాసుల విజ్ఞప్తి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్ హస్తినాపురం ఎస్ ఆర్ నగర్ కాలనీలో పలు రోడ్డు సమస్యలు కరువు సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు మున్సిపల్ అధికారులను కోరారు. శనివారం కాలనీ కోడలు సమావేశమై వారు మాట్లాడుతూ వర్షం వస్తే రోడ్లు అద్వారంగా తయారవుతున్నాయని గుంతలు పడి ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లే పరిస్థితి లేకుండా పోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కొత్త బజారు నుండి వచ్చే వచ్చే వరద నీరు ఎస్ ఆర్ నగర్ కాలనీ హర్షణ పురం కాలనీలో ఇళ్ల చుట్టూ చేరి రాకపోకలకు అంతరాయం జరుగుతొందని, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. ఇప్పటికైనా కాలనీవాసుల ఇబ్బందులను గమనించి మున్సిపల్ అధికారులు ప్రజాప్రతినిధులు ఎస్ ఆర్ నగర్ కాలనీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కాలనీవాసులు ఇబ్బందులు తొలగించేలా వరద నీటి బారినుండి కాపాడి, కాలనీలో రోడ్లు సౌకర్యం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కాలనీవాసులు వాంకడోత్ రమేష్, మురళీధర్, ఏనుగు తల ఉప్పలయ్య, బాణాల శ్రీను, వరుణ్, సఫావట్ యాదగిరి, బద్రు తదితరులు పాల్గొన్నారు.

# కోల్ బెల్టు ఏరియాలో చలిపులి

**భూపాలపల్లి కోల్‌బెల్ట్ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి.. చలి ప్రజలను వెంటాడుతోంది.. రెండు రోజుల నుండి ఉదయం 8 గంటల వరకు చలి పంజా విసురుతోంది.. చలిమంటలతో ఉపశమనం పొందుతున్నారు..**



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి కోల్ బెల్ట్ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు పడిపోయి చలి ప్రజలను పులిలా వెంటాడుతుంది. గత రెండు రోజుల నుండి రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారింది. గత కొన్ని రోజులుగా వర్షాలతో అల్లాడిపోయిన ప్రజలకు వర్షాకాలం అయిపోయిన అనంతరమే చలికాలం ప్రారంభమైంది. జిల్లాలో సాయంత్రం ఐదు కావడంతో చలి తీవ్రత పెరుగుతుంది. అట్లాగే ఉదయం 8 వరకు చలి తీవ్రత ఉంటుంది. చలి కాలం ప్రారంభంలోనే తీవ్రస్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోయి ప్రజలు చలికి వణికి పోతున్నారు. చలికి ప్రజలు గ్రామాల్లో పట్టణాలలో చలిమంటలు, షెటర్లు తలపాగలు, మంకీ క్యాప్స్ ధరించుకొని ఉపశమనం పొందుతున్నారు. అదే విధంగా ఎన్నడు లేని విధంగా గత రెండు రోజులుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 12 మండలాలలో అన్ని గ్రామాలలో పొగ మంచు కమ్ముకుంటు చలికి ప్రజలు చలిమంటలు కాగుతూఉన్నారు. ఉదయం కాలంలో పనులకు వెళ్లే వారికి ఇబ్బందిగా మారింది. జిల్లా కేంద్రం లోని కోల్ బెల్ట్ ప్రాంతంలో ఎండాకాలం ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అలాగే చలి కాలంలో సైతం చలి తీవ్ర స్థాయిలో ఉంటుంది. చలికాలం ప్రారంభంలోనే ఉదయం కాలం మనసు దుప్పటి పరుచుకుంటుంది. ఇంత స్థాయిలో చలి ఉండడంపై ప్రజలు చర్చించుకుంటు న్నారు. చిన్నపిల్లలు జాగ్రత్తలు పాటించవలసి ఉంటుందని నిపుణులు వెల్లడిస్తున్నారు.

## వృత్తి విద్యతోనే ఉపాధి అవకాశాలు




**ప్రజాపక్షం/హనుమకొండ :** వృత్తి విద్యలో శిక్షణ పొందిన యువతీ, యువకులకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మర్కజీ వారు తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష వారి సౌజన్యంతో ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల హనుమకొండలో జాబ్ మేళాను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.వెంకట్ రెడ్డి మాట్లాడారు. ఇంజనీరింగ్ చదవడం ద్వారా మాత్రమే కాకుండా వృత్తి విద్యలను అభ్యసించడం ద్వారా కూడా యువత నైపుణ్యాలను పెంచుకొని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందవచ్చునని తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో 2015 సంవత్సరం నుండి ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశపెట్టిన ఈ వృత్తి విద్యా కోర్సులు 2030 నాటికల్లా అన్ని పాఠశాలకు విస్తరించనున్నట్లు తెలిపారు.జాబ్ మేళా ప్రారంభోత్సవ కార్యక్రమంలో మర్కజీ పాఠశాల ప్రధానోపాధ్యాయులుజి.వి.రామారావుఅధ్యక్షత వహించి మాట్లాడారు. 1200 మంది నిరుద్యోగులు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఉద్యోగాలు ఇవ్వడం కొరకు 24 ప్రైవేట్ కంపెనీలు ఇక్కడికి వచ్చాయని తెలిపారు.రాష్ట్ర వృత్తి విద్య కోఆర్డినేటర్ బి. నాగేశ్వరరావు మాట్లాడారు.ఏఎంఓ డాక్టర్ బి మన్మోహన్ , హనుమకొండ మండల విద్యాశాఖ అధికారి జి.నెహ్రూ నాయక్, అభ్యసన ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు వి. జగన్నాథం, ఉపాధ్యాయులు, ఒకేషనల్ టీచర్స్, ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు, ఎన్సిసి క్యాడెట్లు అధిక సంఖ్యలో ఉద్యోగార్థులు పాల్గొన్నారు.

# క్రీడ

## ప్రపంచ రికార్డు..

### 11 బంతుల్లోనే ఆకాశ్ హాఫ్ సెంచరీ!



భారత క్రికెట్‌లో మరో సంచలనం నమోదైంది. మేఘాలయ బ్యాటర్ ఆకాశ్ చౌదరీ వేగవంతమైన హాఫ్ సెంచరీతో చరిత్ర సృష్టించాడు. దేశవాళీ టోర్నీలో పాపులర్ అయిన రంజీ ట్రోఫీలో ఆకాశమే హద్దుగా చెలరేగిన ఆకాశ్ కేవలం 11 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోసిన అతడు.. వరుసగా ఎనిమిది సిక్సర్లు బాదేసి యాభైకి చేరుకోవడం విశేషం. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ నమోదు చేసిన అకాశ్ సునామీ ఇన్నింగ్స్ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరలవుతోంది. దేశవాళీ క్రికెట్‌లో ప్రతిభావంతులకు కొదవ లేదని చాటాడు మేఘాలయ బ్యాటర్ ఆకాశ్ చౌదరీ. రంజీ ట్రోఫీలో భాగంగా సూరత్‌లో ఆదివారం అరుణాల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ చిచ్చరపిడుగు నమ్మశక్యం కాని ఆటతో రెచ్చిపోయాడు. ఎనిమిదో స్థానంలో క్రీజులోకి వచ్చిన ఆకాశ్ తొలి మూడు బంతుల్లో రెండు పరుగులే తీశాడు. కానీ, నాలుగో బంతిని సిక్సర్‌గా మలిచి తన విధ్వంసానికి తెరతీశాడు.ఆరుణాచల్ బౌలర్లకు చుక్కలు చూపించిన అతడు ఆ తర్వాతి ఏడు బంతులను స్టాండ్స్‌లోకి పంపాడు. 11 బంతుల్లోనే ఫిఫ్టీతో లీగ్ చరిత్రలోనే వేగవంతమైన అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. తద్వారా దేశవాళీలో వరుసగా ఏడు బంతులకు ఏడు సిక్సర్లు బాదిన తొలి ఆటగాడిగా చరిత్రకెక్కాడు ఆకాశ్. ప్లేట్ గ్రూప్ మ్యాచ్‌లో సుడిగాలి ఇన్నింగ్స్ ఆడిన ఆకాశ్ ఐపీఎల్ ఫ్రాంచైజీల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఓపెనర్ అర్పిత్ భటేవరా ద్విశతకం(207), కెప్టెన్ కిషన్ లింగ్డోహ్(119), ఆర్ దలాల్ (144)లు సెంచరీలతో రెచ్చిపోగా.. ఆకాశ్ మెరుపులతో మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 628 పరుగులు చేసింది.

## డిసెంబర్‌లో ఐపిఎల్ 2026 వేలం?

ఐపిఎల్ 2026 సీజన్ వేలం ప్రక్రియ డిసెంబర్‌లో జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ 15న వేలం నిర్వహించాలని బిసిసిఐ యోచిస్తోందని జాతీయ మీడియాలో వార్తలొస్తున్నాయి. నవంబర్ 15లోపు అన్ని ఫ్రాంఛైజీలు తాము రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను బిసిసిఐకి సమర్పించాల్సి ఉంటుందట. గతంలో రెండు సీజన్ల మాదిరిగానే ఈ సారి కూడా గల్ఫ్ దేశాల్లోనే ఐపీఎల్ వేలం నిర్వహిస్తారని, ఈ విషయాన్ని ఫ్రాంఛైజీలకు కూడా తెలియజేసినట్లు కొన్ని రోజుల కిందట వార్తలొచ్చాయి. తాజాగా వస్తున్న కథనాలు మాత్రం ఈ సారి భారత్‌లోనే ఆక్షన్ ఉంటుందని పేర్కొంటున్నాయి. అయితే, ఏ నగరంలో వేలం నిర్వహిస్తారనే దానిపై స్పష్టత లేదు. గత రెండు ఆక్షన్‌లను వేరే దేశంలో నిర్వహించారు. 2023లో దుబాయిలో, 2024లో జెద్దా (సౌదీ అరేబియా)లో వేలం ప్రక్రియ జరిపారు. అయితే, ఐపిఎల్ 2026 వేలం ప్రక్రియ గురించి బిసిసిఐ ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు.

### నవంబర్ 27న డబ్ల్యూపిఎల్ మెగా వేలం

మహిళల ప్రిమియర్ లీగ్ 2026 సీజన్ కోసం నవంబర్ 27న ఢిల్లీలో మెగా వేలం నిర్వహించనున్నారు. ఇప్పటికే టోర్నీలోని ఐదు జట్లు తాము రిటైన్ చేసుకున్న ఆటగాళ్ల వివరాలను వెల్లడించాయి. ఢిల్లీ క్యాపిటల్స్‌లో 13, గుజరాత్ జెయింట్స్‌లో 16, ముంబయి ఇండియన్స్‌లో 13, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరులో 14, యూపీ వారియర్స్‌లో 17 ఖాళీలున్నాయి. అత్యధికంగా యూపీ ఫ్రాంఛైజీ పర్స్‌లో రూ.14.5 కోట్లు ఉన్నాయి.

## అదరగొట్టిన సఫారీలు

### రెండో అనధికారిక టెస్టులో భారత్‘ఎ’ ఓటమి




రెండో అనధికారిక టెస్టులో పట్టుబిగించిన భారత ఏ జట్టు అనూహ్యంగా ఓడిపోయింది. ధ్రువ్ జురెల్ (132 నాటౌట్, 127 నాటౌట్) సెంచరీలతో దక్షిణాఫ్రికా ‘ఏ’ ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించినా.. బౌలర్లు విఫలమవ్వడంతో పరాజయం తప్పలేదు. ప్రధాన పేసర్లు సిరాజ్, ఆకాశ్ సహ కుల్దీప్ యాదవ్ సైతం తేలిపోగా.. సఫారీ కుర్రాళ్లు అర్ధ శతకాలతో లక్ష్యాన్ని కరిగించారు. ఆఖర్లో రెండుమూడు వికెట్లు పడినా.. వికెట్ కీపర్ కొన్నార్ ఎస్టెర్‌హుజెన్(52 నాటౌట్) ధనాధన్ ఆడి 5 వికెట్ల విజయాన్ని కట్టబెట్టాడు. చెరో మ్యాచ్ గెలవడంతో సిరీస్ 1—1తో సమం అయింది. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జరిగిన రెండో అనధికారిక టెస్టులో భారత ఏ జట్టుకు ఊహించని పరాజయం ఎదురైంది. రెండు ఇన్నింగ్స్‌ల్లో ధ్రువ్ జురెల్(132 నాటౌట్,127 నాటౌట్) సెంచరీలకు, హర్ష్ దూబే(84), కెప్టెన్ రిషభ్ పంత్(65)ల అర్ధ శతకాలు తోడవ్వగా విజయంపై భరోసాతో ఉన్న టీమిండియాకు సఫారీ బృందం షాకిచ్చింది. రెండో ఇన్నింగ్స్‌ను 382—7 వద్ద డిక్లేర్ చేసి 418 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించినా దక్షిణాఫ్రికా ఏ బ్యాటర్లు ఉఫ్‌మనిపించారు.

### తొలి వికెట్‌కు 156 రన్స్

తొలి ఇన్నింగ్స్‌లో నిప్పులు చెరిగిన ప్రసిధ్ కృష్ణ, సిరాజ్ పెద్దగా ప్రభావం చూపలేకపోవడంతో.. ఓపెనర్లు జోర్డాన్ హెర్మన్(91), లెసెగో సెనొక్వనే(77)లు క్రీజునంటుకుపోయారు. నాలుగో రోజు ఓవర్ నైట్ స్కోర్ 25/0తో ఇన్నింగ్స్ ఆరంభించి.. హాఫ్ సెంచరీలతో శుభారంభమిచ్చారు. తొలి వికెట్‌కు 156 రన్స్ జోడించి సఫారీల విజయానికి బాటలు వేశారు. ప్రసిధ్, దూబే వీరిద్దరిని ఔట్ చేసినా.. ఆ తర్వాత వచ్చిన జుబైర్ హంజా(77), తెంబా బవుమా(59)లు క్రీజులో పాతుకుపోయారు. అటాకింగ్ గేమ్ ఆడిన ఈ ఇద్దరూ భారత బౌలర్లను విసిగిస్తూ జట్టు స్కోర్ 300 దాటించారు.
ఆకాశ్ దీప్, సిరాజ్ ఎట్టకేలకు వీరిని వెనక్కి పంపగా భారత ఏ విజయంపై ఆశలు రేగాయి. కానీ, అప్పటికీ సఫారీ జట్టు గెలుపు వాకిట నిలవడంతో కొన్నార్ ఈస్టెర్‌హుజెన్(52 నాటౌట్), టియాన్ వాన్ వురెన్(20 నాటౌట్)లు జాగ్రత్తగా ఆడారు. భారత బౌలర్లకు అవకాశం ఇవ్వకుండా లాంఛనాన్ని ముగించారు. వీరిద్దరి పోరాటంతో 5 వికెట్లతో గెలుపొందిన సఫారీ ఏ టీమ్ సిరీస్‌ను 1తో సమం చేసింది. సిరీస్‌లో గొప్పగా రాణించిన ధ్రువ్ జురెల్ ‘ప్లేయర్ ఆఫ్ ది సిరీస్’గా ఎంపికవ్వగా.. దక్షిణాఫ్రికా కెప్టెన్ మర్కెస్ అకెర్‌మన్ ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’గా నిలిచాడు.

# ఫోకస్ ఆరోగ్యం

## ప్రాణాయామంలో కొత్త విధానం



ఎక్కువ మంది ఆచరిస్తున్న ప్రాణాయామంలో కొత్త విధానాన్ని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ వైద్య పరిశోధకులు కనుగొన్నారు. మనోస్థైర్యాన్ని, శీఘ్రమైన మానిక ప్రశాంతతను పొందడానికి ‘సైకిల్ సయింగ్‘ అనే శ్వాస విధానం ఉపయుక్తంగా ఉంటుందని వారు అంటున్నారు. దీనిని ‘సైకలాజికల్ సయ్’ అని కూడా పిలుస్తారు. ఇది శాస్త్రీయ పరమైన పద్ధతి. దీని ప్రాముఖ్యత, ఫలితాలు శాస్త్రీయంగా పరిశీలించి, ధ్యానం కంటే కూడా ‘తక్షణ’ ఉపశమనం ఇస్తుందనే విషయాన్ని నిరూపించారు. దీనిని సులభంగానే ఆచరించవచ్చు. సార్లు చిన్న, అర్ధ శ్వాసలు తీసుకొని, ఆ తర్వాత దీర్ఘంగా, ఒక్కసారి పూర్తిగా ఆ శ్వాసను విడిచిపెడతారు. ఇలా మూడు లేదా నాలుగు రౌండ్లు (సైకిల్స్) చేయాల్సి ఉంటుంది. సుమారు 5 నిమిషాలు ఈ ప్రక్రియలో ప్రాణాయామం జరిపితే, తక్షణ ప్రయోజనం ఉంటుందని పరిశోధకులు అంటున్నారు. దీనిని 111 మందిపై అధ్యయనం చేయగా, ‘సైకిల్ సయింగ్’ పార్టిసిపెంట్లు తమకు ధ్యానం, ఇతర శ్వాస ప్రయోగాలు కన్నా తక్కువ సమయంలోనే మెరుగైన విశ్రాంతిని, శరీరం, మనసు ప్రశాంతత లభించినట్టు చెప్పారు. ఈ సైకిల్ సయింగ్ వల్ల శరీరంలోని ఒత్తిడికి కారణమైన కార్టిసాల్ తదితర హార్మోన్‌లు తగ్గుతాయి. నర్వస్ సిస్టమ్ ద్వారా ఆందోళనకి కారణమయ్యే శరీర స్పందన నుండి విముక్తి లభిస్తుంది. దీనితో ఒత్తిడి ఆందోళన తగ్గి, మనసు ఉల్లాసంగా ఉంటుంది. శ్వాస అనేది మన శరీరంలో హృదయ స్పందన, జీర్ణక్రియ వంటి ఇతర సహజ క్రియల జాబితాలో చేరుతుంది. కానీ, మనం తక్కువ శ్రమతో, పూర్తి అవగాహనతో శ్వాసను నియంత్రించగలుగుతాం. దీని వల్లనే శరీరం, మనసును తక్షణంగా ప్రశాంతతకు తీసుకెళ్లడం సాధ్యమౌతుంది. దైనందిన శ్వాస ప్రయోగం ద్వారా దీర్ఘకాలిక మానసిక ప్రశాంతతను, స్థిరత్వాన్నిఅందిస్తాయి. ఇది పూర్తిగా ఉచితం, ప్రకృతిసిద్ధమైనది, ఎప్పుడైనా, ఎక్కడైనా చేయొచ్చు. మందులు అవసరం లేదు. యాప్స్ లేదా ప్రత్యేక శిక్షణ కూడా అవసరం లేదు. సులభంగా చేయదగినది కాబట్టి ఎవరైనా దీనిని అనుసరించవచ్చు.

## హృదయం కూడా ఆలోచిస్తుంది!



గుండెను చాలా మంది హృదయంగా పేర్కొంటారు. ప్రత్యేకించి కవులు హృదయంపై లెక్కనన్ని రచనలు చేశారు. హృదయం మాట్లాడుతుందని ఊహాత్మకంగా అల్లిన కవితలు నిజమేనని ఇప్పుడు శాస్త్రవేత్తలు అంటున్నారు. తాజా అధ్యయనాలను అనుసరించి మన గుండె కేవలం రక్తాన్ని పంపే ఒక పైపు మాత్రమే కాదు.. దానికి స్వంత నాడీ వ్యవస్థ కూడా ఉంది. మన గుండెలో సుమారు 40,000 న్యూరాన్లు ఉంటాయి. ఇవి మెదడులోని న్యూరాన్ల మాదిరిగానే విద్యుత్ సంకేతాలను పంపి, సమాచారాన్ని ప్రాసెస్ చేస్తాయి. మరో రకంగా చెప్పాలంటే, గుండె ఒక ‘మినీ బ్రెయిన్’లాగా పని చేస్తుంది. స్వతంత్రంగా కొన్ని నిర్ణయాలు తీసుకుంటుంది. ఉదాహరణకు, మీ భావోద్వేగాలపై ప్రతిస్పందన ఇవ్వడం, లేదా ఒత్తిడిసమయంలో రక్త ప్రసరణను సర్దుబాటు చేయడం వంటివి చర్యలు చేపడుతుంది. ఇప్పటి వరకూ గుండెకు మెదడు ద్వారానే ఆదేశాలు వెళతాయని అనుకుంటూ ఉన్నారు. బాగా ప్రాచుర్యంలో ఉన్న సిద్ధాంతం ఇది. కానీ, మెదడు నుంచి గుండెకు వెళ్లే సంకేతాల కంటే, గుండె నుంచి మెదడుకు వెళ్లే సంకేతాలు ఎక్కువని ‘హార్ట్‌మాథ్ ఇన్‌స్టిట్యూట్’ తన కొత్త అధ్యయనం పేర్కొంటున్నది. వివిధ రకాలమైన భావోద్వేయాలు, ఆలోచనలు, నిర్ణయాలు కేవలం మెదడు పైనే కాకుండా, గుండెపైన కూడా ఆధారపడతాయి. అంతేకాదు, గుండె నుంచి వెలువడే ఎలక్ట్రోమాగ్నెటిక్ ఫీల్డ్ చాలా శక్తివంతమైంది. ఇది మీ చుట్టూ ఉన్నవారి భావోద్వేగాలపైనా ప్రభావం చూపగలదు. ‘గుండెతో ఆలోచించు’, ‘హృదయపూర్వకంగా అనుభవించు’ వంటి కవుల వర్ణనకు అర్థం ఉందని ఈ అధ్యయనం రుజువు చేస్తున్నది.

## గుండె కేన్సర్‌కు ‘ప్యాచ్’



గుండె కవాటాల్లో లేదా కణాల్లో కేన్సర్ ట్యూమర్లు అరుదుగా వస్తాయి. కానీ, అవి చాలా ప్రమాదకరం. చికిత్స చేయడానికి ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయి. ప్రస్తుతం అనుసరిస్తున్న చికిత్సా విధానాలను అనుసరించి కెమోథెరపీతో వైద్యం అందిస్తున్నారు. అయితే, దీని వల్ల హృదయ కండరాలు దెబ్బతింటాయి. పైగా, అత్యంత సున్నితమైన గుండె కవాటాలను తెరవడంగానీ, చికిత్స జరపడంగానీ సమస్యాత్మకంగా మారింది. దీనికి చెక్ పెట్టడానికి జర్మనీ మాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు కొత్త విధానాన్ని కనిపెట్టారు. వీరు రూపొందించిన ‘ప్యాచ్’ గుండెకు బైపాస్ మాదిరి పని చేస్తుంది. ఇది గుండె కండరాలను అంటుకొని ఉంటుంది. కేన్సర్ మందులను నేరుగా వ్యాధి సోకిన గుండె కణాల్లోకి విడుదల చేసింది. గుండె పనికి ఎలాంటి ఆటంకం లేకుండా ఇది ప్యాచ్ పని చేస్తుంది. ఇది ప్రత్యేకంగా ట్యూమర్ కణాలను మాత్రమే టార్గెట్ చేస్తుంది కాబట్టి, దీనివల్ల గుండె మిగిలిన భాగాలు క్షతగాత్రం కావడం నివారిస్తుంది. క్లినికల్ పరీక్షల్లో 78 శాతం రోగులలో కేన్సర్ ట్యూమర్ కేవలం 8 వారాల్లో తరిగిపోవడాన్ని గమనించారు. మందులు పూర్తయ్యాక ఈ ప్యాచ్ సహజంగానే కరిగిపోతుంది. ఎటువంటి విదేశీ పదార్థం గుండెలో ఉండదు. కాగా, క్లినికల్ పరీక్షలు విజయవంతమైన నేపథ్యంలో, లివర్, ప్యాంక్రియాస్ వంటి ఆరు ఇతర ముఖ్య అవయవాలపై కూడాన ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. ఈ సాంకేతికతను నానో టెక్నాలజీ, బయో ఇంజనీరింగ్, ఆంకాలజీని కలిపి రూపొందించారు. దీనిని మరింత అభివృద్ధి చేసి దీనిని అభివృద్ధింత దేశాల్లో అందుబాటులోకి తేవడం వైపు దృష్టిపెడుతున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

### సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.భాషామియా



**ప్రజాపక్షం/నర్సంపేట:** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.భాషామియా అన్నారు. సిపిఐ నర్సంపేట మండల సమితి సమావేశం బాధరా బోయిన యాదగిరి అధ్యక్షతన మాదన్నపేట రోడ్డు సిపిఐ కాలనీలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సిపిఐ పుట్టి వంద సంవత్సరాలు గడుస్తున్నా సందర్భంగా ఖమ్మం నగరంలో 100 సంవత్సరాల ముగింపు సభను లక్షలాది మంది జనంతో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 40 దేశాల కమ్యూనిస్టు నాయకులు, దేశ కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఈ బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జాత కార్యక్రమాలను ప్రచార కార్యక్రమాలను నిర్వహించేందుకు జోడిగాట్ కొమురం భీం విగ్రహం నుంచి బయలుదేరే జాత 20న నర్సంపేటకు చేరుకోనున్న సందర్భంగా పార్టీ ప్రజాసంఘాల నాయకులు, సానుభూతిపరులు, ప్రజలు ఘనమైన స్వాగతం పలకాలని ఆయన కోరారు. ఈ జాతాలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ కార్యదర్శి వర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, కలవేని శంకర్ పాల్గొంటారని తెలిపారు. ఈనెల 12, 13 తేదీలలో వరంగల్‌లో జరుగు జనసేవా దళ్ జిల్లా శిక్షణ శిబిరాలను విజయవంతం చేయాలని భాషామియా పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు అయితా యాకోబు, అక్కపెల్లి రమేష్, జిల్లా సమితి సభ్యులు గోవర్ధన్ మియాపురం, దిడ్డి పార్థసారధి, పాలక కవిత, ఓర్సు రాజు, నాయకులు పిట్టల సతీష్, గడ్డం యాకయ్య, నాగరాజు, కమ్మల వెంకన్న పాల్గొన్నారు.

## సిపిఐ సీనియర్ సభ్యురాలు సుగుణమ్మ మృతి



**ప్రజాపక్షం/చింతకాని :** భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ సభ్యురాలు, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వంకాయలపాటి సుగుణమ్మ (92) ఆదివారం మరణించారు. మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన సుగుణమ్మ భర్త వంకాయలపాటి సీతయ్య సుదీర్ఘ కాలం కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా పనిచేశారు. సుగుణమ్మ రెండుసార్లు ఖమ్మం సమితి సభ్యురాలిగా పనిచేశారు. తుదిశ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలిగా సుగుణమ్మ కొనసాగారు. సుగుణమ్మ జాతీయ మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా నాయకురాలిగా రెండు దశాబ్దాల కాలం పాటు వివిధ హోదాలలో పనిచేశారు. ఆమె కుమారుడు వంకాయలపాటి సత్యనారాయణ సిపిఐ నుంచి ఎంపిటిసిగా పనిచేశారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సుగుణమ్మ మరణ వార్త తెలిసిన వెంటనే పలువురు సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ తదితరులు సుగుణమ్మ మృతి పట్ల విచారాన్ని వ్యక్తం చేశారు. నిబద్ధత కలిగిన కమ్యూనిస్టును కోల్పోయామని వారు సంతాప సందేశంలో పేర్కొన్నారు. సుగుణమ్మ మృతదేహాన్ని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి సందర్శించి అరుణ పతాకాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్, నాయకులు తాళ్లూరి యాదగిరి, బిఆర్ఎస్ నాయకులు రంగారావు తదితరులు ఉన్నారు.

## అమరుల ఆశయ సాధనకు పునరంకితమవుదాం

### సిపిఐ విస్తరణకు కేశవరావు కృషి మరువలేనిది
### సంతాప సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అమరుల ఆశయాల సాధనకు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పునరంకితం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సిపిఐ, ఎఐకెఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా సీనియర్ నాయకులు భాగం కేశవరావు సంతాప సభ మండలంలోని కేశవరావు కొత్త అంజనాపురంలో గ్రామంలో ఆదివారం జరిగింది. సంతాపసభకు ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని, సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా తదితరులు కేశవరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం జరిగిన సంతాపసభలో కూనంనేని మాట్లాడుతూ పేద వర్గాల అభ్యున్నతి కోసం, పార్టీ విస్తరణ కోసం కేశవరావు నిరంతరం కృషి చేశారన్నారు. సుజాతనగర్ పరిసర ప్రాంతాల్లో పార్టీ విస్తరణకు కేశవరావు ఎనలేని కృషి చేశారన్నారు. అనేక ప్రజా, రైతు ఉద్యమాలు నిర్మించి సమస్యల పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా పనిచేశారని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకుడిగా ప్రతీ పోరాటంలో అగ్రభాగాన నిలిచారని కొనియాడారు. కేశవరావు స్ఫూర్తితో ఆయన ఆశయాలను సాధించేందుకు, పార్టీ బలోపేతానికి నేటితరం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సంతాపసభ కార్యక్రమంలో సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు బూక్యా ధస్రు, సిపిఐ మండల కార్యదర్శి కొమారి హన్మంతరావు, జిల్లా సమితి సభ్యులు, నాయకులు జక్కుల రాములు, తాళ్లూరి పాపారావు, భాగం కృష్ణయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలతో ముందుకు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్

**ప్రజాపక్షం/మంచిర్యాల :** సమస్యల పరిష్కారానికి నిత్యం ప్రజా ఉద్యమాలతో ముందుకు సాగుతామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ పేర్కొన్నారు. సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరగనున్న శత జయంతి వేడుకల ముగింపు సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 15న ఆసిఫాబాద్ కొమురంభీం జిల్లా జోడేఘాట్ నుండి భద్రాచలం వరకు ప్రారంభమయ్యే బస్సు జాతలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జాతీయ నాయకులు చాడ వెంకట రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఆదివారం సిపిఐ జిల్లా సమితి సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు ఇప్పకాయల లింగయ్య అధ్యక్షతన సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కలవేన శంకర్ మాట్లాడుతూ దేశంలో ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిత్యం ఉద్యమాలతో ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రణాళికలు రచించిన విటి అబ్రహం, పి.నర్సయ్య, బాశెట్టి గంగారాం, గుండా మల్లేష్ లాంటి అనేక మంది నాయకులు ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. నిజాం నవాబుకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంతో 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచింది సిపిఐ అని, తెలంగాణ ఉద్యమంలో అగ్రభాగాన నిలబడిందని, కార్మిక వర్గ ఉద్యమాలకు నాయకత్వం వహించిందని ఆయన వివరించారు. ఖమ్మం నగరంలో వంద సంవత్సరాల ముగింపు సభకు 40 దేశాల కమ్యూనిస్టు నాయకులు హాజరవుతారని తెలిపిరాఉ. ఈ బహిరంగ సభ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జరిగే జాత కార్యక్రమాలను ప్రచార కార్యక్రమాలను నిర్వహించేందుకు జోడిగాట్ కొమురం భీం విగ్రహం దగ్గర నుండి బయలుదేరే జాతలకు పార్టీ ప్రజాసంఘాల నాయకులు, సానుభూతిపరులు, ప్రజలు ఘనమైన స్వాగతం పలకాలని ఆయన కోరారు. సమావేశంలో సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, మేకల దాసు, జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కలిందర్ అలీ ఖాన్, చిప్ప నర్సయ్య, దాగం మల్లేష్, కారుకూరి నగేష్, మిట్టలపల్లి శ్రీనివాస్, లింగం రవి పాల్గొన్నారు.



## ఆక్రమణలకు గురవుతున్న భూముల పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత



### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూముల పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా, సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ అన్నారు. ఆదివారం కొల్లాపూర్ మండలంలోని ఏల్లూరు శివారులో గల నల్లమల రిజర్వు ఫారెస్టు దగ్గర్లో ఉన్న సర్వే నెంబర్ 359, 360, 364, 365 మొత్తం 48 ఎకరాల భూమిని కొంతమంది వ్యక్తులు ప్రైవేట్ భూమి అని, అక్కడ ఉన్న గుట్టలను తొలుస్తూ లక్షలాది చెట్లను అక్రమంగా తొలగించి ఎటువంటి ఆనవాలు లేకుండా చేసి భూమి స్వభావాన్ని మారుస్తుండంతో ఆదివారం ఆ ప్రాంతాన్ని సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా బాల్‌నర్సింహ్మా మాట్లాడుతూ ప్రధానంగా ఈ భూమి 1995—96వరకు సీలింగ్ భూమి సర్కార్ భూమి అని, రెవెన్యూ రికార్డులలో స్పష్టంగా ఉందన్నారు. 2009—2010 సంవత్సరాలకు మధ్యలో జటప్రోలు రాజాగారు అయినటువంటి ఆదిత్య లక్ష్మణరావు సోదరి సుభారాణి పైన పట్టా ఉంది అని చెప్పి ఒ ప్రముఖ ఫార్మా కంపెనికి చెందినవారు కొనుగోలు చేశారని, ఇక్కడ సమాచారం ఉంది ఇది రెవెన్యూ అధికారులు సీలింగ్‌భూమి ఏవిధంగా పట్టా భూమి అయిందో సమాధానం చెప్పాలన్నారు. ఈ మొత్తం ప్రక్రియలో పూర్తిగా చట్టాలను పక్కనపెట్టేసి వ్యక్తుల ఇష్టానుసారంగా జరుగుతుంటే రెవెన్యూ అధికారులు, ఫారెస్టు అధికారులు కళ్లు మూసుకొని వారికి సహకరిస్తున్నారు కాని అడ్డుకునే పరిస్థితిలేదని ఆయన ఆరోపించారు. ఈ భూములపైన సమగ్ర విచారణ జరిపి పట్టాలను రద్దు చేయాలని బాల్‌నర్సింహ్మా డిమాండ్ చేశారు. స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ భూముల వ్యవహారంపై తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని బాల్‌నర్సింహ్మా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు టి.నర్సింహ్మా, కె.యేసయ్య, ఆర్.ఇందిర, మండల కార్యదర్శి తుమ్మల శివుడు, జిల్లా సమితి సభ్యులు కుర్మయ్య, శివశంకర్, కృష్ణ, జంగంశివుడు, వెంకటస్వామి, శివ, రామకృష్ణ, రవిప్రకాష్‌కుమార్, రమణ, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# స్థానికం REGIONAL NEWS
## కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## అందుబాటులోలేని యాంటీ రాబిస్ వ్యాక్సిన్

**ప్రజాపక్షం/కౌటాల :**మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుక్క కాటుకు సంభందించిన వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడం బాధితులకు శాపంగా మారింది. వివరాల్లోకి వెళితే మండలంలోని మోగడ్ ధగడ్ గ్రామానికి చెందిన చౌదరి బాజీరావ్(46) అనే వ్యక్తికి శనివారం ఉదయం 9 గంటల సమయంలో కుక్క కాటేసింది. వ్యాక్సిన్ కోసం కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్ళగా... విధులు నిర్వహిస్తున్న నర్సు ఇక్కడ వ్యాక్సిన్లు లేవని.,ఒక టి టి ఇంజెక్షన్ వేసి, సిర్పూర్ టీ లోని ప్రభుత్వ దవాఖానకు వెళ్ళాలని చెప్పడంతో బాధితుడు ఏమి చేయలేక కుక్క కాటుకు సంభందించిన వ్యాక్సిన్‌కొరకుసిర్పూర్‌టిప్రభుత్వదవాఖానకువెళ్లారు. సంబంధిత అధికారులు స్పందించి కౌటాల ప్రభుత్వ ఆ రోగ్య కేంద్రంలో కుక్క కాటుకు సంభందించిన వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలని బాధితుడు అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు పవన్ కళ్యాణ్ రెడ్డిని చరావానిలో సంప్రదించగా గత మూడు రోజుల నుండి వ్యాక్సిన్ అందుబాటులో లేదని,వ్యాక్సిన్ కోసం ఇండెంట్‌పెట్టడంజరిగిందని,వ్యాక్సిన్‌అందుబాటులోఉండేటట్లుచూస్తామన్నారు.

## విద్యార్థులు చట్టపరమైన అవగాహన కలిగి ఉండాలి




**ప్రజాపక్షం /శ్రీరాంపూర్:** విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరు చట్టపరమైన అంశాల మీద అవగాహన కలిగి ఉండాలని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఫోక్సో) రాంబాబు, చీఫ్ లీగల్ ఎయిడ్ సర్వీస్ అధికారి సందని అన్నారు.ఆదివారం జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా నస్పూర్ లోని కస్తూర్బ గాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ)లో జిల్లా న్యాయ సేవల సంస్థ, మంచిర్యాల షీ టీమ్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు న్యాయ సేవలు, షీ టీమ్ కార్యకలాపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులకు న్యాయ అవగాహన, మహిళల భద్రత, షీ టీం సేవల ప్రాముఖ్యత, న్యాయ సహాయం పొందే మార్గాల గురించి వివరణాత్మకంగా తెలియజేశారు. విద్యార్థులు చురుకుగా పాల్గొని సంబంధిత ప్రశ్నలు అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మౌనిక, న్యాయ సేవల సిబ్బంది, షీ టీమ్ సభ్యులు సతీష్, శ్రీలత,విద్యార్థులు పాల్గొన్నారు.

## 10 లీటర్ల గుడుంబా స్వాధీనం



**ప్రజాపక్షం /ఆసిఫాబాద్ :** ఆసిఫాబాద్ మండలంలోని ఎప్పల్ నావేగావ్ బస్ స్టాప్ వద్ద అక్రమంగా గుడుంబా రవాణా చేస్తున్న వ్యక్తిని జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం ఆదివారం పట్టుకుంది. ఎప్పల్ నావేగావ్ గ్రామానికి చెందిన చిలుకయ్య అక్రమంగా గుడుంబా తరలిస్తున్న సమయంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు.ఈ దాడిలో మొత్తం 10 లీటర్ల గుడుంబా, బజాజ్ డిస్కవర్ బైక్ స్వాధీనం చేసుకుని, నిందితుడిని ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ప్రజల ఆరోగ్యానికి హానికరమైన అక్రమ గుడుంబా తయారీ, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పి కాంతిలాల్ పాటిల్ తెలిపారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.ఈ చర్యలో టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాణా ప్రతాప్, ఎస్సై రాజు కందూరి, హెచ్ సి మహ్మద్, కానిస్టేబుల్స్ సంజీవ్, దేవేందర్ లు పాల్గొన్నారు.

## భూకబ్జా చేసిన వారిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/శివ్వంపేట :** భూ కబ్జా చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దొంతి గ్రామానికి చెందిన నడిసిన సంజయ్‌రెడ్డికి చెందిన 433 సర్వేనంబర్‌లో 7ఎకరాల13 గుంటల భూమి ఉంది. ఈ భూమిని గత 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారు. అయితే గత కొన్ని రోజులుగా దొంతి గ్రామానికి చెందిన చుక్క శ్రీనివాస్, చుక్క రాణిలు ఆ భూమిలోకి ప్రవేశించి కడీలను పాతారు. అదేవిధంగా ట్రాక్టర్లతో చదును చేసి దాని చుట్టు పెన్సింగ్ వేశారని బాధిత రైతు సంజయ్‌రెడ్డి పోలీసులను ఆశ్రయించాడు. సంజయ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## అమరుల పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు: ఆకుల పాపయ్య




**ప్రజాపక్షం/నిజామాబాద్ :**భూమి, భుక్తి, దేశం, విముక్తి కోసం విప్లవోద్యమంలో అమరులైన అమరవీరుల పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. ఆదివారం అమరవీరుల వర్ధంతి సందర్భంగా నగరంలోని నీలం రామచంద్రయ్య భవన్‌లో వర్ధంతి సభను డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు చేపడుతున్నాయని, దేశ సంపదను కార్పోరేట్ శక్తులకు మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఆదాని, అంబానీలకు కట్టబెడుతున్నారన్నారు. ఆడపిల్లలకు కళ్యాణలక్ష్మీ పథకం కింద లక్ష రూపాయలు తులం బంగారం వెంటనే అమలుపర్చడం లేదని మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు నెలకు 2500 లు ఇస్తానన్న హామీ అమలు నోచుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుపర్చాలని డిమాడ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయిబాబా, గంగాధర్, సాయిరెడ్డి, మల్లిఖార్జున్, మోహన్, నర్సింగ్‌రావు, నతానియల్, అరుణ, భారతి పాల్గొన్నారు.

## నాలుగో టౌన్ ఎస్‌హెచ్‌ఒగా సతీష్



**ప్రజాపక్షం/నిజామాబాద్‌అర్బన్:**నిజామాబాద్ నాలుగో టౌన్ ఎస్‌హెచ్ఒగా సతీష్ కుమార్ ఆ దివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో నాలుగో టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఇదివరకు ఎస్‌ఐఎస్‌హెచ్‌ఒలుగా వ్యవహరించేవారు. కానీ మారి న పరిస్థితుల రీత్యా, నిజామాబాద్ పట్టణ పరిధి దృశ్య ఆయా ఠానాల పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ కారణాల రీత్య ఇన్స్పెక్టర్‌లను ఎస్‌హెచ్‌ఒలుగా నియమించాలని సిపి నిర్ణయించారు. ఈ క్రమంలో నిజామాబాద్ పోలీసు కమిషనర్ పంపిన ప్రతిపాదనలను ఐజి చంద్రశేఖర్ రెడ్డి ఆమోదించారు. ఈ క్రమంలో ఆదివారం నాలుగో టౌన్ ఎస్‌హెచ్‌వోగా సతీష్ కుమార్ పదవి స్వీకరించారు.

# ఏడుపాయల క్షేత్రంలో కిక్కిరిసిన భక్తులు



**ప్రజాపక్షం/పాపన్నపేట:**ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గామాత క్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఏడుపాయలకు భక్తులు పోటెత్తారు.. వనదుర్గమ్మ ప్రధాన ఆలయం ముందున్న నదీ పాయ కొంతమేర ప్రవహించడంతో మూలవిరాట్ దర్శనానికి భక్తులకు ఇంకా అనుమతి ఇవ్వలేదు. దీంతో రాజగోపురంలో ప్రతిష్టించిన ఉత్సవ విగ్రహం వద్ద భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆలయ అర్చకులు వేకువజామునే అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించి భక్తులకు వనదుర్గమ్మ దర్శనం కల్పించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాలు, జంట నగరాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మ దర్శనానికి తరలివచ్చారు. మంజీరా నదీ పాయలో పుణ్యస్నానాలు ఆచరించి వనదుర్గాదేవి దర్శనానికి బారులు తీరారు. అమ్మ దర్శనంతో భక్తులు తన్మయత్వం చెందారు. పలువురు భక్తులు అమ్మవారికి డప్పు చప్పుల్ల మధ్య బోనాలు, ఓడి బియ్యం సమర్పించారు. మరికొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల జయ జయ ద్వానాల మధ్య ఏడుపాయల వనదుర్గాదేవి క్షేత్రం హోరెత్తింది. వనదుర్గమ్మా.. దీవించమ్మా.. అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. ఆలయ అర్చకులు పూజలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## నీట మునిగి ఒకరు మృతి



**ప్రజాపక్షం/పాపన్నపేట:** నీట మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఏడుపాయల ఆలయ సమీపంలోని చెక్ డ్యాం సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు వివరాలు మండల పరిధి నార్సింగి గ్రామానికి చెందిన వడ్ల మహేష్ (33) గ్రామానికి చెందిన నర్సింలు అనే స్నేహితుడితో కలిసి బుధవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా ఏడుపాయల ఆలయానికి వెళ్లారు. అక్కడి నుంచి మహేష్ హైదరాబాద్ లో బంధువుల ఇంటికి వెళ్తానని చెప్పడంతో నర్సింలు ఒక్కడే తిరిగి గ్రామానికి వెళ్లాడు. కాగా మరుసటి రోజు బంధువులకు వాకబు చేయగా మహేష్ తన వద్దకు రాలేదని చెప్పారు. దీంతో గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆచూకీ కోసం గాలించారు. శనివారం ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఏడుపాయ ల చెక్ డ్యాం సమీపంలో నీటిలో తెలియాడుతున్న యువకు డి మృతదేహం స్థానికులకు కనిపించింది. దీంతో పోలీసుల కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆనవాళ్లను బట్టి మృతి చెందింది మహేష్‌గా నిర్ధారించారు.కాలకృత్యాలు తీర్చుకునేందుకు వె ళ్లి ప్రమాదవశాత్తూ నీట మునిగి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి తల్లి వజ్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## 26న ఢిల్లీలో... రాజ్యాంగ హక్కుల సాధన సభ

### మాల మహానాడు రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి స్వామి



**ప్రజాపక్షం/గజ్వేల్;**జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో నవంబర్ 26న రాజ్యాంగ హక్కుల సాధన కోసం ఛలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్లు మాల మహానాడు రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి నీరుడి స్వామి పేర్కొన్నారు. నవంబర్ 26న చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రం ఆవిష్కరించిన సందర్భంగా గజ్వేల్‌లో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణకు, రాజ్యాంగ హక్కులను సాధించడానికి ఎంతకైనా తెగిస్తామని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే జాతీయ మాలమహానాడు ఛలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే జాతీయ స్థాయిలో మాల, మహార్ అనుబంధ కులాల సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని, శాస్త్రీయమైన లెక్కలు లేకుండా చేసిన ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణ, రోస్టర్ జిఒనెం. 99, జిఒ నెం. 29 రాజ్యాంగ వ్యతిరేకం కనుక దీనిని దృష్టిలో పెట్టుకొని తక్షణమే పునః సమీక్షించాలని అన్నారు. ప్రైయివేటు రంగంలో రిజర్వేషన్ల చట్టం తేవాలని, ఎస్‌సిరిజర్వేషన్ల 15 శాతం నుండి 20 శాతానికి పెంచాలని, దళితుల పై దాడులను అరికట్టి ఎస్‌సి, ఎస్‌టిఅట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, న్యాయస్థానాల్లో, రాజ్య సభలో రిజర్వేషన్లు అమలు చేయాలని, భారత రాజ్యాంగాన్ని అన్ని ప్రాంతీయ భాషల్లో నాన్ డీటైయిల్డ్‌గా విద్యార్థులకు అందించాలని, కరెన్సీ నోట్లపై భారతరత్న అంబేద్కర్ ఫోటో పెట్టాలని, బ్యాగరి, కాటికాపరులకు జాతీయ స్థాయిలో తగిన గుర్తింపుతో పాటు కేంద్రం గౌరవ వేతనం ఇవ్వాలని, ఎస్‌సి, ఎస్‌టిపారిశ్రామిక వేత్తలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించాలని, రాజ్యాంగ పీఠిక ప్రేయర్లలో చదివాలనే డిమాండ్‌తో ముందుకెళ్తున్నట్లు వివరించారు.మాల మహనాడు జిల్లా ఉపాధ్యక్షులు పాములపర్తి స్వామి, నీరుడి కుమార్, నాయకులు జంగం కాశి, నీరుడి స ంపత్, పెండ్యాల మల్లేశం, కప్ప గణేష్, జంగ అరుణ్, ప్రభాక ర్,జంగంపృథ్వి రాజ్,ఆరేపల్లిభరత్,చంటి,వంశీ పాల్గొన్నారు.

## కానిస్టేబుళ్లు కాదు.. నిత్య పేకాటరాయులే

### ఎక్సైజ్ స్టేషనే పేకాట క్లబ్ , అధికారుల ఎదుటే నిత్యం పేకాట




**ప్రజాపక్షం/చెన్నూరు :** చెన్నూరు ఎక్సైజ్ స్టేషన్నే పేకాట క్లబ్బుగా మార్చి కానిస్టేబుల్లే పేకాటఆడుతున్న ఉదంతాన్ని ఇటీవల ప్రజాపక్షం దినపత్రిక బట్ట బయలు చేయగా గత ఏడేళ్లుగా ఎక్సైజ్ స్టేషన్ లోనే ఈ వ్యవహారం సాగుతున్నట్లు పలు ఆధారా లు వెలుగు చూడదంతో స్థానికంగా దుమారం రేకెత్తిస్తోంది. ఎక్సైజ్ అధికారుల ఎదుటే ఎలాంటి బె నుకు లేకుండా నేర చరిత్ర కలిగిన ఓ హెడ్ కానిస్టేబుల్ తో పాటు పలువురు కానిస్టేబుళ్ళు స్టేషన్లోనే యధేశ్చగా పేకాట ఆడుతుంటారని, తప్పని చెప్పాల్సిన అధికారులు సైతం ఈ వ్యవహారం పట్ల చూ సి చూడనట్లు వ్యవహరించడంతో వారి ఆగడాల కు హద్దూ అదుపు లేకుండా పోయిందనే ఆరోపణలున్నాయి. ఇటీవలే ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లోనే పే కాట నిర్వహిస్తున్నట్లు ఉన్నతాధికారుల దృష్టికి చే రగా, సాధారణ వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకునే బాధ్యతాయుతమైన స్థానంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు ఎక్సైజ్ స్టేషన్లోనే పేకాట నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లపై మాత్రం కేవలం బదిలీ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్సైజ్ స్టేషన్లో కానిస్టేబుళ్ళే పేకాట నిర్వహిస్తున్న వ్యవహారంలో పలువురు అధికారులకు భారీ ముడుపులు అందుకొని కేవలం పేకాట ఆడుతున్న కానిస్టేబుల్లపై కేవలం బదిలీ వేట వేసి చేతులు దులుపుకున్నారని, ఇప్పటికైనా ఎక్సైజ్ స్టేషన్లో పేకాట ఆడుతూ ఎక్సైజ్ శాఖకు అపకీర్తి తీసుకువచ్చని కానిస్టేబుల్లపై, వారికి సహకరించిన అధికారులపై పూర్తి విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ‘ఎఐ’తో మంచి, చెడు, రెండూ...



### భవిష్యత్తు అంతా ఎఐదే...!
### చెడును గుర్తించి ముందుకు సాగాలి
### ఎఐతో ఎన్నో అద్భుతాలు చేయవచ్చు:సుధాకర్ రెడ్డి

**ప్రజాపక్షం/గజ్వేల్;**ఎఐతో మంచి, చెడు రెండూ ఉన్నాయని టియుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరాహాత్ అలీ అన్నారు. గజ్వేల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ‘ఓ ప్రైవేటు గార్డెన్ లో ఆదివారం ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మీడియా’ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో వక్తగా ఉడుముల సుధాకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విరాహాత్ అలీ మాట్లాడుతూ, ఎఐ కత్తిలాంటిదని, మనం ఎలా ఉపయోగించుకుంటే అలా ఉపయోగపడుతుందని చెప్పారు. గ్రామీణ స్థాయిలో విలేకరులకు ఎఐపై అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఎఐతో ఎన్నో అద్భుతాలు చేయవచ్చని, అన్ని రకాల సమాచారం నిర్లిప్తమై ఉంటుందని, కానీ పూర్తి స్థాయిలో ఎఐపై ఆధారపడవద్దని కోరారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు సురేందర్, సత్యనారాయణరావు, కృపాకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నాయిని యాదగిరి, విజయరావు, శంకర్, ఎల్లం, కృష్ణ, చిన్న యాదగిరి, రమణారెడ్డి, కిరణ్, జగదీశ్, అశోక్, వెంకట్ రెడ్డి, మహేందర్ రెడ్డి, యాదగిరి, బాలకృష్ణ రెడ్డి పాల్గొన్నారు.

## నాచగిరి క్షేత్రంలో వైభవంగా సత్యదేవుడి వ్రతాలు



**ప్రజాపక్షం/గజ్వేల్:**కార్తీక మాస పర్వదినాల సందర్భంగా ఆదివారం నాచగిరి శ్రీ లక్ష్మీ నృసింహ క్షేత్రం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా భక్తులు తెల్లవారుజామున హరిద్రా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి సతీసమేతులైన శ్రీ స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్ గుప్త, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ విజయ రామారావు ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు చేయగా, 198 జంటలు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. అలాగే 12 జంటలు స్వామివారి కళ్యాణాలు చేయగా, 09 స్వామివారి నిజాభిషేకాలు జరిగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించగా, 19వ రోజు సాయంత్రం కార్తీక దీపోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలతో పాటు మహాప్రసాదం అందజేశారు.

## నేడు భద్రకాళి వీరభద్రేశ్వర్ కల్యాణోత్సవం



**ప్రజాపక్షం/రేగోడ్:** మండల కేంద్రంలో ని శ్రీ గోకర్ణేశ్వర ఆలయంలోని సోమవారం వీరభద్రకాళి వీరభద్రేశ్వర్ కళ్యాణోత్సం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు అన్నారు ప్రతి ఒక్కరు హాజరుకావాలని పూజారి మహేష్, శివ స్వాములు తెలిపారు

## ఐఎఫ్‌టియు కార్యాలయంలో అమరవీరుల సంస్మరణ సభ



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :**సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి కామ్రేడ్ డి బ్రహ్మానందం అధ్యక్షతన సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎ.లాల్ కుమార్ ముఖ్యవక్తలుగా హాజరయ్యారు.ఆదివారం కొత్త రోడ్ లోని అమరవీరుల స్థూపం వద్ద జెండా ఆవిష్కరించారు. అనంతరం శ్రీరాంపూర్ ఐఎఫ్టియు కార్యాలయంలో అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఎ లాల్ కుమార్ మాట్లాడుతూ పీడిత ప్రజల కోసం అనేక మంది విప్లవకారులు తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేసి ప్రజలకు స్వేచ్ఛ,స్వాతంత్రం రావాలని కలలుగన్న రాజ్యం కోసం ప్రజలను మమేకం చేస్తూ ప్రజలలో భాగస్వాములు అయ్యారని అన్నారు. వీరుల త్యాగాల ఫలితమే ఈరోజు ఆ ఫలాలను అనుభవిస్తున్నామని అన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలోకాంగ్రెస్ ప్రభుత్వం రెండు ఒకగూటివే అన్నారు. ఒకవైపు తుఫానుల వల్ల తడిసిన పంటలతో ఇబ్బంది పడతు ఉంటే,మరోవైపు ప్రభుత్వాలు మాటలతో కోటలు కడుతున్నారని ఆరోపించారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయకుండా వారిశ్రవణ్ దూకుడు చేస్తున్నారని ఆరోపించారు.సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పులు ఇచ్చిన న్యాయం జరగలేని పరిస్థితి కనబడుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారిన ప్రజల జీవన పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్న చందంగా మారుతుంది అన్నారు. ఇలాంటి తరుణంలో విప్లవ కమ్యూనిస్టు ల పైన గురుతర బాధ్యత ఉంటుందని,పేద ప్రజల సమస్యల పరిష్కారంలో అగ్రభాగంలో నిల బడ్డప్పుడు మాత్రమే అమరవీరుల త్యాగాలను స్మరించిన వాళ్ళంఅవుతామని అన్నారు. వీరుల త్యాగాలకు ఈ దేశంలో స్వేచ్ఛ,స్వతంత్రం కోసం అందరం ఐక్యమైనప్పుడు మాత్రమే నిజమైన నివాళిని అర్పించిన వాళ్ళం అవుతామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్,జిల్లా నాయకులు మేకల రామన్న,అరుణోదయ రాష్ట్ర నాయకులు మల్లన్న,జిల్లా నాయకులు రెడ్డి మల్ల ప్రకాశం,తిరుపతి రెడ్డి,ఏఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి,ఉపాధ్యక్షులు దొండ ప్రభాకర్,పి ఒ డబ్లు జిల్లా అధ్యక్షురాలు ముష్కి జ్యోతి,పి డి ఎస్ యు కార్యదర్శి శ్రీకాంత్,నాయకురాలు శంకర అక్క,ఐఎఫ్టియు జిల్లా నాయకులు శంకరి సత్యం,పి డి ఎస్ యు ఉపాధ్యక్షులు సికిందర్, పి వై ఎల్ నాయకులు బండారి రాజు,భీముని పోషం,అప్పారావు,బక్కన్న,రమేష్,సదానందం శోభ,నరసమ్మ తిరుమల,సుగుణ పాల్గొన్నారు.

## ధర్మోరాలో ప్రముఖ కవి డాక్టర్ అంబల్ల జనార్ధన్ ప్రాణధార పుస్తకావిష్కరణ



**ప్రజాపక్షం/మోర్తాడ్ :**మోర్తాడ్ మండలంలోని ధర్మోరా గ్రామం లో ఆదివారం ప్రముఖ కవి రచయిత డాక్టర్ అంబాల్ల జనార్ధన్ రచి ంచిన ప్రాణాధార పుస్తకాన్ని ప్రముఖ కవులు బైస దేవదాసు, ఆచార్య డాక్టర్ కి గౌరీ శంకర్, ప్రముఖ కవి పి చంద్రశేఖర్ ఆజాద్, ఎంవి రామిరెడ్డి, పివి చందన్ రావు, రఘు శ్రీ లు ఆవిష్కరించారు. అంతేగాక అంబాల్ల జనార్ధన్ వజ్రోత్సవ అభినందన సంచికను కూడా వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబాల్ల జనార్ధన్ బహుబాషా కోవిధులని కొనియాడారు. ఆయన రచించిన రచనలు సుమారు 20 వరకు ప్రచూరితమయ్యాయని అన్నారు. ఆయన రచించిన కొన్ని రచనలు మహారాష్ట్రలో విద్యార్థులకు పాఠ్యాంశాలుగా ఉన్నాయని వారు వివరించారు. ఈ సందర్భంగా అంబాల జనార్ధన్ మాట్లాడుతూ.. తన పుస్తకావిష్కరణకు విచ్చేసిన ప్రముఖ కవులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కవులు, రచయితలను అంబాల జనార్ధన్ శాలువాలతో మెమోంటోలతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో అంబాల శ్రీనివాస్,విటోబా,అంబాలపరివారముమిత్రులు,బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో పాల క్యాన్ల పంపిణీ



**ప్రజాపక్షం/శంకరపట్నం:** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల పరిధిలోని గద్దపాక గ్రామంలో ఆదివారం కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో సభ్యులకు పాల క్యాన్లను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ గద్దపాకలో మహిళల ఆధ్వర్యంలో పాలకేంద్రం నిర్వహించడం అభినందనీయమన్నారు. గతంలో మూలనపడ్డ పాల కేంద్రాన్ని మళ్లీ తెరిచి మహిళల ఆధ్వర్యంలో పాల సేకరణ చేస్తూ కేంద్రాన్ని సక్రమంగా నిర్వహిస్తున్న అధ్యక్షులు, పాలకవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో పాల కేంద్రం అధ్యక్షురాలు జక్కుల పద్మ, నిర్వాహకులు పలకల శ్యాంసుందర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు, తదితరులున్నారు.

## సింగరేణి నిధులతో కార్మికక్షేత్రం సుందరీకరణ



**ప్రజాపక్షం/గోదావరిఖని:** గోదావరిఖని బొగ్గు గనుల ప్రాంత కార్మిక క్షేత్రాన్ని కోట్లాది రూపాయలతో సుందరీకరణ చేపడ్తున్నట్లు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరాం అన్నారు. ఆదివారం ఆయన గోదావరిఖనిలోని బొగ్గు గనులను సందర్శించారు. ఈ సందర్భంగా జిడికె ఒసిపి5 ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన బేస్ వర్క్‌షాప్‌ను రిబ్బన్ కట్ చేసి సీఎండీ ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన ఒసిపి5 ఉపరితల గనిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్జీ1 జీఎం డి.లలిత్‌కుమార్ సీఎండీకి స్వాగతం పలికి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ముందుగా సీఎండీ ఒసిపి5 వ్యూ పాయింట్ వద్ద క్వారీ ఆపరేషన్‌లపై అధికారులతో ప్రాజెక్టు ఆఫీసర్, మేనేజర్‌లతో ఉత్పత్తి, ఉత్పాదకత, ఒ.బి. రిమూవల్ పనులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్స్‌టర్నల్ డంపుపైన 120 మీటర్ల ఎత్తులో సింగరేణి యాజమాన్యం పర్యావరణ పరిరక్షణలో భాగంగా చేపట్టిన మొక్కలను పరిశీలించారు. నూతన మొక్కలు నాటారు. రామగుండం1 ఏరియాలోని కార్మిక కాలనీలు, క్వార్టర్ల స్థితిగతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అక్కడి ఉద్యోగులతో మాట్లాడారు. క్వార్టర్లలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలంటూ స్థానిక యాజమాన్యానికి, సివిల్ విభాగం ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సామాజిక బాధ్యతలో భాగంగా రామగుండం నగరపాలక పరిధిలో సింగరేణి నిధులతో కొనసాగుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులను ఆయన పరిశీలించారు. గోదావరిఖని పట్టణంలో కోట రూపాయలతో విశాలమైన రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. కోట్లాది రూపాయలతో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులు 6 మాసాల్లో పూర్తవుతాయన్నారు. గోదావరినది ఒడ్డున సమ్మక్క, సారాలమ్మల గద్దెల పునర్నిర్మాణం, అభివృద్ధి పనులు చేపడ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్(ఈఅండ్‌ఎం) తిరుమల్‌రావు, ఆర్జీ1 జీఎం డి.లలిత్‌కుమార్, ఆర్జీ2 జీఎం బండి వెంకటయ్య, శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, సివిల్ జీఎం వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ రాంమోహన్‌రావు, ఎస్‌వోటూ జీఎం చంద్రశేఖర్, ఒసిపి5 ఆఫీసర్ రమేష్, డీజీఎం ఫారెస్టు కర్ణ, డీజీఎం సివిల్ వరప్రసాద్, ప్రాజెక్టు ఇంజనీర్ పి.రమేష్, మేనేజర్ రమేష్, సీఎంవోఏఐ ప్రతినిధి శ్రీనివాస్, ఎఐటియుసి నాయకులు ఎల్లయ్యగౌడ్, ప్రభుదాస్, కార్మికులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని కేశనపల్లి గ్రామానికి చెందిన కలవేన చంద్రమౌళి (48) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం అవసరం నిమిత్తం ముత్తారంకు వెళ్లి వస్తుండగా ,కేశనపల్లి గ్రామ పంచాయతీ సమీపంలోని మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయమయ్యింది. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి, ఆదివారం ఉదయం మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## గ్రామ రక్షకులు.. గ్రామ దేవతలు!

**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఆకెనపల్లి గ్రామంలో భూలక్ష్మి , మహాలక్ష్మి , బొడ్డాయి గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్టాపన పూజలు ఆదివారం జరిగాయి. పూజారి రాంపెల్లి మురళీధరశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు పూజలు నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ సతిమణి మనాలి ఠాకూర్ పూజల్లో పాల్గొని ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. ఆమె మాట్లాడుతూ, గ్రామ దేవతలను గ్రామ రక్షకులుగా ప్రజలు కొలుస్తారని, గ్రామ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు. నిత్యం ధూప దీప పూజలతో గ్రామ దేవతలను కొలువాలన్నారు. గ్రామ దేవతల విగ్రహ దాతలైన గ్రామానికి చెందిన కాంగ్రెస్ అంతర్గాంపాలకుర్తి మీడియా కోఆర్డినేటర్ గాదె సుధాకర్, స్రవంతి దంపతులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి మెరుగు పోషం, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎకరాకు రూ. 20వేల నష్టపరిహారం అందించాలి

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** అకాల వర్షాలతో పంటల ధ్వంసమై నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఎకరానికి 20000 నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బి ఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎలేటి మహేష్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం విలేకరులకు తో మాట్లాడుతూ రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని సన్నారకం వడ్లకు బోనస్, రుణాభి అసంపూర్తిగా చేసిందని ఫసల్ బీమా పథకం వెంటనే అమలు చేసి నష్టపోయిన రైతులకు ఎకరానికి 20వేల రూపాయల నష్ట పరిహారాన్ని అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## గవర్నర్ నుంచి గోల్డ్ మెడల్ అందుకున్న కదారి హాస్యరెడ్డి



**ప్రజాపక్షం/రామగిరి:** లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఉపాధ్యక్షులు లయన్ కదారి కళాధర్ రెడ్డి కుమార్తె హాస్య రెడ్డి శాతవాహన యూనివర్సిటీ ఫార్మసీ విభాగంలో ప్రతిభ కనబరచి, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్న సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం చేసిఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు లయన్ మేకల మారుతి మాట్లాడుతూ హాస్య రెడ్డి ఫార్మసీ రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి గోల్డ్ మెడల్ అందుకోవడం మా క్లబ్‌కి రామగిరి మండలానికి ఎంతో గర్వకారణం అన్నారు. యువతలో ఇలాంటి ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించడం సమాజ అభివృద్ధికి ఎంతో ఉపయోగకరం అలాగే హాస్య రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని మా లయన్స్ తరుపున కోరుకుంటున్నామని తెలిపారు.కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఆర్డినేటర్ మొల్మూరి శ్రీనివాస్, 1డైరెక్టర్స్ గంట వెంకటరమణ రెడ్డి, టి వి సురేష్ బాబు,సభ్యులు అసం తిరుపతి,తీగల శ్రీధర్, చందు చారి పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో పంట నష్టంపై
# పక్కా నివేదికలు సమర్పించండి


మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



**ప్రజాపక్షం/కరీంనగర్/సిద్దిపేట:** మొంథా తుఫాను నష్టం అంచనాలను వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతుల పొలాలను సందర్శించి పక్కాగా నివేదికలు తయారు చేయాలని ,ఓ ఒక్క రైతు మిగలకుండా ప్రతి ఒక్కరినీ కవర్ చేయాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. నిర్ణీత నమూనాలో తుఫాను నష్టం అంచనా నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బి రోడ్లు ఎంతమేరకు మరమ్మత్తులకు గురైందనే అంశాలను క్షేత్రస్థాయి పరిశీలన చేసి పూర్తి ఆధారాలతో నివేదిక సిద్ధం చేయాలని, తాత్కాలిక మరమ్మత్తులు, శాశ్వత మరమ్మత్తులకు ఎంత వ్యయం అవుతుందో అంచనాలతో సహా వివరాలు సమర్పించాలని తెలిపారు. విద్యుత్ శాఖ సంబంధించి దెబ్బతిన్న పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్ వివరాలు అందించాలన్నారు. నీటిపారుదల శాఖ పరిధిలో దెబ్బతిన్న చెరువులు, కాల్వలు, నీటివనరుల వివరాలు సమర్పించాలన్నారు. ఇతర నిర్మాణాలు, దెబ్బతిన్న ఇండ్ల సంఖ్య, చనిపోయిన పశువులు, గొర్రెలు, పౌల్ట్రీ తదితర వివరాలను పక్కగా తయారుచేసి నష్టపోయిన ప్రజలకు సహాయం చేరేలా చూడాలని మంత్రి ఆదేశించారు.

## జోరందుకున్న వరి కోతలు

**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్,ముత్తారం, ఓడేడ్, మచ్చుపేట, ఖమ్మంపల్లి గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లో వానాకాలంలో సాగు చేసిన పంట పొలాల వరి కోతలు జోరందుకున్నాయి. రైతులు సేకరించిన ధాన్యం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. మరోవైపు వడ్లలో నిర్దేశిత తేమశాతం వచ్చేలా ఎండలో పోస్తున్నారు. సాయంత్రం కాగానే మళ్లీ వడ్లను ఒకచోటుకు చేర్చి, రాశులుగా పోసి కవర్లు కప్పుతున్నారు.



## టెక్నీషియన్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్ జిల్లా ఏసి, వాషింగ్ మెషీన్ టెక్నీషియన్లు ఆదివారం స్థానిక మంకమ్మతోటలోని బ్లూస్టార్ ఏసి షోరూంలో సమావేశమై నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా అడ్వకేట్ బీమాసాహెబ్ వ్యవహరించి అందరి అభిప్రాయం ప్రకారం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. లీగల్ అడ్వైజర్‌గా జి.బీమాసాహెబ్, గౌరవ అధ్యక్షుడిగా బ్లూస్టార్ ఎండి సలీముద్దీన్, అధ్యక్షుడిగా గొల్లపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా బాబూరావు, రాచకొండ సంతోష్, కె.జనార్ధన్, ఎస్‌కె జావిద్ పాష, ప్రధాన కార్యదర్శిగా ఎండి ఖలీల్, కార్యదర్శిగా మహమ్మద్ రఫీ అహమ్మద్, సహకార్యదర్శిలుగా ఎండి తాజ్‌బాబా, ఎండి బాబా, ఎండి అయూబ్ ఖాన్, మొహమ్మద్ రఫొద్దీన్, కోశాధికారిగా కొండమీది తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా ఎండి సాదిక్, ఇన్నరెడ్డి, నానితో పాటు 60 మంది టెక్నీషియన్లు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికులకు కూలీ రేట్లు పెంచాలి

ఎఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎగౌస్..



**ప్రజాపక్షం/పెద్దపల్లి :**గోదావరిఖని కూరగాయల మార్కెట్ లో పని చేస్తున్న హమాలీ కార్మికులకు కూలీ రేట్లు పెంచకుంటే నవంబర్ 12 తర్వాత ఆందోళన కార్యక్రమాల తో పాటు అవసరమైతే సమ్మె కు పిలుపు నిస్తామని ఏఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం ఎ గౌస్ హెచ్చరించారు. ఆదివారం గోదావరిఖని కూరగాయల మార్కెట్ లో జరిగిన హమాలీ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి వెజిటబుల్ వెండర్స్ అసోసియేషన్ కు హమాలీ వర్కర్స్ కు కూలీ రేట్లు పెంచాలని కోరినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. హమాలీ వర్కర్స్ కు కూలీ రేట్లు పెంచమంటె హమాలీలను దొంగలుగా చిత్రీకరిస్తూ అవమాన పరుస్తున్నారని ఆయన ఆరోపించారు. హమాలీ వర్కర్స్ కు కూలీ రేట్లు పెంచకుండా వెజిటబుల్ వెండర్స్ అసోసియేషన్ నాయకులు నిర్లక్ష్యం చేస్తూ శ్రమ దోపిడి, ఆర్థిక దోపిడీ చేస్తూ హమాలీ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఇట్టి విషయంలో లేబర్ కమిషనర్ కు ఫిర్యాదు చేయడం జరిగిందని, కమీషనర్ ఈ నెల 12 న కరీంనగర్ లో వెజిటబుల్ వెండర్స్ అసోసియేషన్ నాయకులను మరియు హమాలీ వర్కర్స్ యూనియన్ తో సమావేశం ఏర్పాటు చేశారని, ఇట్టి సమావేశంలో వెజిటబుల్ వెండర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొని హమాలీ వర్కర్స్ కు కూలీ రేట్లు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని లేకుంటే నవంబర్ 12 తర్వాత హమాలీ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) పక్షాన వెజిటబుల్ వెండర్స్ అసోసియేషన్ కు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, అవసరమైతే సమ్మె కు పిలుపు నిచ్చి మార్కెట్ ను బంద్ చేయిస్తామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ సమావేశంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, గాలిపెల్లి సతీష్, రాంచందర్, జానీమియ, బండారి రవి తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లంతకుంట టిఆర్‌టిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** టిఆర్ టిఎఫ్ ఇల్లంతకుంట మండల శాఖ సమావేశం టిఆర్ టిఎఫ్ జిల్లా అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ అధ్యక్షతన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇల్లంతకుంటలో నిర్వహించారు. ఈ సమావేశంలో టిఆర్ టిఎఫ్ మండల శాఖ అధ్యక్షులుగా పచ్చిమట్ల అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా వెల్ది కుమారస్వామి నీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్న గారి నారాయణ వ్యవహరించగా ఎన్నికల పరిశీలకులుగా టిఆర్టిఎఫ్ రాష్ట్ర బాధ్యులు పోతుగంటి రమేష్ వ్యవహరించారు. ఉపాధ్యక్షులుగా కటకం రాజ్ కుమార్, పూదరి స్వప్న, రాష్ట్ర కౌన్సిలర్లు గా రెంటాల రమణారెడ్డి, ఎర్రోళ్ల రాజు ఎన్నికయ్యారు. వృత్తి నిబద్ధతతో వ్యవహరిస్తూ సంఘ ఆదేశాలకు కట్టుబడి ఉంటామన్నారు. ఈ సందర్భంగా టిఆర్టిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ పిఆర్సి గడువు పూర్తయి రెండు సంవత్సరములు గడిచినప్పటికీ పిఆర్సి నివేదిక తెప్పించుకొని అమలు పరచకపోవడం సరైన పద్ధతి కాదని, వెంటనే పిఆర్సి నివేదికను తెప్పించుకుని 60 శాతం ఫిట్మెంట్తో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోల వినయ్ కుమార్, గాజెంగి విష్ణు, మామిడాల రమేష్, సుల్తాన్ రాజు, గోలి రాధకిషన్, గుగులోత్ రమేష్ నాయక్, బూట్ల శ్రీనివాస్, పులి ప్రవీణ్ కుమార్, పేరుక వెంకటేశ్వరరావు, సామల రాములు, ఇప్పకాయల ప్రకాష్, లక్కే లక్ష్మి రాజం తదితరులు పాల్గొన్నారు.

## పూర్తిస్థాయిలో భారత రాజ్యాంగం అమలు



**ప్రజాపక్షం/గొల్లపల్లి:** డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని పూర్తిస్థాయిలో అమలుపరచాలని మాజీ వైస్ ఎంపీపీ ఆవుల సత్యం అన్నారు.జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రం లో మాజీ వైస్ ఎంపీపీ ఆవుల సత్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతి ఆదివారం అంబేద్కర్ నామస్మరణ కార్యక్రమంనికి ముఖ్య అతిథిగా కండ్లే గౌతమ్ కృష్ణ రావు రిటైర్డ్ హెడ్మాస్టర్ పాల్గొని మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించరు. అంబేద్కర్ కీర్తిని ప్రతి భారత పౌరుడు స్మరించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో భారత రాజ్యాంగ పీఠికను సబ్యులు అందరి చేత చదివి వినిపించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌరవ అంబేద్కర్ మన దేశానికి గొప్ప భారత రాజ్యాంగన్ని అందించారు.ఈరోజు మనదేశంలో భారత రాజ్యాంగాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం పట్లనే రిజర్వేషన్ ఫలాలను అందుకోలేకపోతున్నామని తెలిపారు. అనంతరం చౌటపల్లి తిరుపతి మాట్లాడుతూ బహుజనులకు అట్టడుగు వర్గాలకు అంబేద్కర్ ఒక దిక్సూచి అంబేద్కర్ ను కొందరి వాడిగా కాకుండా అందరి వాడుగాచూడాలి వారు ఇచ్చిన భారత రాజ్యాంగంలోని బహుజనులకు స్వాతంత్ర్యంగా ఉండగలుగుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో నిర్వహిస్తున్నందుకు మండల కేంద్రంలోని అంబేద్కర్ వాదులు ఆవుల సత్యం కి అభినందనలు తెలిపారు.హాజరైన బహుజనులందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమలో కొండ్రా తిరుపతి అధ్యాపకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాంపెల్లి హన్మండ్లు, వికలాంగుల జిల్లా ఉపాధ్యక్షులు తాండ్ర రాజయ్యా, కచ్చు కొమురయ్య, చౌటపల్లి తిరుపతి,బోనగిరి మల్లారెడ్డి, బాబు జగ్జీవన్ రామ్ సంఘం గౌరవాధ్యక్షుడు తాండ్ర కిరణ్, శాలివాహన కుమ్మరి సంఘం మండల అధ్యక్షుడు సిరికొండ తిరుపతి, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు చెవులమద్ది సంతోష్, బాబు జగ్జీవన్ రామ్ ఉపాధ్యక్షుడు నలవాల రమేష్, రజక సంఘం అధ్యక్షులు కలకోట సత్యం, అంబేద్కర్ పట్టణ అధ్యక్షులు గంగాధర మధుసూదన్, సాతల్ల లచ్చయ్యా, గడ్డం గంగాధర్, సామల వీరస్వామి, ఎరవేణి కన్ను, భోజనపు శ్రీనివాస్, దావుల రాకేష్ కుమార్, ఆవుల రాజశేఖర్, సరసాలు అనిల్ రెడ్డి, జేరిపోతుల అనిల్, నరసయ్య, గొల్లపల్లి అంజయ్యా, అంబేద్కర్ వాదులు తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి

ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన మంత్రి వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** హైదరాబాద్ జూబ్లీ హిల్స ఉప ఎన్నికలలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించుట కోసం మానకొండూర్ ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు షేక్‌పేటలోని పలుబూత్‌లలో ప్రచార బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రతి రోజు ప్రచార కార్యక్రమం కొనసాగుతుండగా చివరిరోజు ఆదివారం షేక్‌పేట్‌లో తలపెట్టిన బూత్‌స్థాయి ప్రచార ర్యాలీ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి హాజరై కాంగ్రెస్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సంధర్భంగా బూత్‌స్థాయిలో ప్రతి గడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి పట్టం కట్టాలని కోరుతూ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి అభివృద్ధికి అడ్డంకిగా మారిన బిఆర్‌ఎస్‌ను, మత విద్వేష ప్రసంగాలు,ఉపన్యాసాలతో శాంతియుత వాతావరణానికి విఘాతం కలిగించే విధంగా ప్రవర్తిస్తున్న బిజెపి పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం ద్వారా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌కు అండగా ఉన్నారని విశ్వాసం కలిగించాలని ఓటర్లను కోరారు. ఈ ర్యాలీలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు, స్థానిక కాంగ్రెస్ నేతలతో పాటు మానకొండూర్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత బత్తిని శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్‌ఎల్ గౌడ్, ఒగ్గు దామోదర్, మార్కెట్ కమిటీ చైర్మన్లు పులి కృష్ణ, ఓదెలు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, బండారి రమేష్, గోపు మల్లారెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు, మొరపెల్లి రమణ రెడ్డి, తాళ్లపల్లి సంపత్ గౌడ్, శ్రీకాంత్, వరహాల చారి, నాంపల్లి తిరుపతి, ద్యావ శ్రీనివాస్‌రెడ్డి, ఎండి ఇర్ఫాన్, శ్రీనాథ్‌రెడ్డి, ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, రెమిడి శ్రీనివాస్‌రెడ్డి, కొండ్ర సురేష్, బండి మల్లేశం, తొర్తి అరవింద్ తదితరులున్నారు.

## వంజరి కులస్తుల సంక్షేమానికి కట్టుబడి ఉంటాం: శ్రీనివాస్



**ప్రజాపక్షం/మల్లాపూర్:** వంజరి కులస్తుల సంక్షేమానికి రాష్ట్ర వంజరి సంగం కట్టుబడి ఉంటుందని మండల అధ్యక్షుడు లవంగ శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం వంజరి చెందిన చిన్నారులకు విద్యార్థులకు పుస్తకాలను నోట్ బుక్స్ ఇతర సామాగ్రిని పంపిణీ చేశారు. ప్రతి ఏటా చిన్నారులకు విద్యార్థులకు రాష్ట్ర సంఘం సహకారంతో పుస్తకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బడివాడ వంజరీ సంఘం అధ్యక్షుడు ముస్కరి కిషన్, నడిమివాడ సంఘం అధ్యక్షుడు రమేష్, సభ్యులు లింగం రాకేష్ ,సత్యనారాయణ ,వినోద్, రాఖి ,మహేష్ ,రాజు, శ్రీనివాస్, రాజారెడ్డి ,మల్లేష్ ,నరసయ్య ,తదితరులు ఉన్నారు.

## సిద్ధిపేటలో ప్రతిష్మాత్మకంగా ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు

హోరాహోరీగా ప్రచారం

మొత్తం ఓట్లు 7914- పోలింగ్ 4759



**ప్రజాపక్షం/సిద్ధిపేట:** సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు కోలాహలంగా నిర్వహించారు. గతంలో ఎన్నడు లేనివిధంగా పట్టణంలో కొత్తగా ఆర్యవైశ్య సంఘాల సభ్యత్వం జోరుగా చేయించారు. పట్టణంలో 8వేల వరకు సభ్యత్వం చేయించారు. ఆర్యవైశ్య సంఘం ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. స్థానిక శారద నికేతన్ పాఠశాలల్లో పోలింగ్ నిర్వహించారు. మొత్తం 8366 ఓట్లకు 4759 ఓట్లు పోలైనాయి. ఉదయం 7గంటల నుండి సాయంత్రం వరకు 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలను తలదన్నే విధంగా ఆర్యవైశ్య సంఘం నేతలు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కొందరు నేతలు ఫ్యానల్ ద్వారా ప్రచారం నిర్వహించగా.. మరి కొంత మంది నేతలు ప్రచారం నిర్వహించారు. అధ్యక్ష స్థానానికి నేతి కైలాశం, అయిత బాలరాజేశం. నాగరాజు, యేల్లేశం, పెద్ది శ్రీనివాస్, కూర శ్రీనివాస్‌లు పోటీ పడుతున్నారు. ప్రధానకార్యదర్శిగా తిప్పర్తి మధుసూదన్, కొర్తివాడ శ్రీకాంత్‌ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఉపాధ్యక్ష పదవికి ఐదు స్థానాలకు 12 మంది, సంయుక్త కార్యదర్శికి పదవి ఐదు స్థానాలకు 13 మంది పోటీపడుతున్నారు. అలాగే కోశాధికారి చందా సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. పోలింగ్ పూర్తయిన అనంతరం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడించనున్నారు. ముందుగా సంయుక్త కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, చివరికి అధ్యక్షులకు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడించనున్నారు.

## కొండగట్టు జెఎన్‌టియులో ర్యాగింగ్‌పై విచారణ జరిపించాలి

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** నాచుపల్లి శివారులో గల కొండగట్టు జేఎన్టీయూ క్యాంపస్‌లో సీనియర్ విద్యార్థులు బిటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులను ర్యాగింగ్ చేసిన ఘటనపై యూనివర్సిటీ, పోలీసు అధికారులతో విచారణ జరిపించాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బిఎస్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది జక్కనపల్లి గణేష్ డిమాండ్ చేశారు. ఇద్దరు జూనియర్ విద్యార్థుల చేత పెళ్లి చేస్తున్నట్లు తంతు జరిపించి చున్నీలు వేసుకుని డ్యాన్సులు చేసి ఈ తతంగాన్ని వీడియో చిత్రీకరించి సీనియర్ విద్యార్థులు పోస్టు చేసి వైరల్ చేశారన్నారు. ఈ సంఘటన జరిగి నాలుగు రోజులు గడిచి ఆ వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. క్యాంపస్ సెక్యూరిటీ చీఫ్ ఇటీవల కాలంలో విద్యార్థులతో దురుసుగా ప్రవర్తించాడని విద్యార్థులు ఆందోళన సైతం చేవారన్నారు. క్యాంపస్ అడ్మినిస్ట్రేషన్ విఫలం కావడం వల్లనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. వెంటనే యాంటీ ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేసి ర్యాగింగ్‌ను పూర్తిగా నిరోధించాలన్నారు. లేని పక్షంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు.

# రీల్



## 14న సీమంతం విడుదల

టీకే డ్రీమ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న క్రైమ్ థ్రిల్లర్ సీమంతం. హీరోగా వజ్రయోగి, హీరోయిన్‌గా శ్రేయ భర్తీ నటిస్తున్నారు. సుధాకర్ పాణి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతోంది. ఈ చిత్రం ప్రశాంత్ టాటా నిర్మాణంలో, గాయత్రి సౌమ్య గుడిసేవ సహనిర్మాతగా తెరకెక్కింది. రచయిత, దర్శకుడిగా సుధాకర్ పాణి వ్యవహరిస్తున్నారు. సంగీతం ఎస్. సుహాస్ అందిస్తున్నారు. గర్భవతులపై దాడుల నేపథ్యంలో సాగే ఈ థ్రిల్లర్ టీజర్ గ్రిప్ చేసే బీజీఎం, హై టెక్నికల్ వాల్యూస్‌తో ఆకట్టుకుంటోంది. ఈ సినిమా ఈ నెల 14న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో వజ్రయోగి, డైరెక్టర్ సుధాకర్, మ్యూజిక్ డైరెక్టర్ సుహాస్, సినిమాటోగ్రాఫర్ శ్రీనివాస్, కో ప్రొడ్యూసర్ గాయత్రి సౌమ్య, హీరోయిన్ శ్రేయ భర్తీ తదితరులు పాల్గొన్నారు.

## బిగ్ బాస్‌లో స్టెప్పులేసిన శివ హీరో,హీరోయిన్

నాగార్జున హీరోగా, అమల హీరోయిన్‌గా రామ్ గోపాల్ వర్మను దర్శకుడిగా పరిచయం చేస్తూ ముప్పై ఆరేళ్ళ క్రితం రిలీజ్ చేసిన శివ సినిమా ఇప్పుడు మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. నవంబర్ 14న ఈ సినిమాను రీరిలీజ్ చేస్తున్న సందర్భంగా నాగార్జున సినిమా ప్రొమోషన్ డోస్ పెంచారు. ఏకంగా నాగార్జున, అమల దంపతులు కలిసి బిగ్ బాస్ స్టేజ్‌పై స్టెప్పులేశారు. ఈ వేడుకపై రామ్ గోపాల్ వర్మను కూడా ఆహ్వానించారు. అయితే థియేటర్ లో జరిగిన ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ లో ముప్పై ఆరేళ్ళ తరువాత నాగార్జున, వర్మ కలిసి ఒకే వేదికపై ట్రైలర్ రిలీజ్ చేస్తామని అనుకోలేదని నాగార్జున వ్యాఖ్యానించారు. మొత్తానికి శివ సినిమా పై హైప్ క్రియేట్ చేసే పనిలో నాగార్జున నిమగ్నమై ఉన్నారు. 4కే డాల్బీ అట్మాస్ సౌండ్ సిస్టం తో శివ సినిమాను మరోసారి రిలీజ్ చేస్తున్నారు.





మెగా స్టార్ చిరంజీవి మోస్ట్ అవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకరవరప్రసాద్ గారు' ఫస్ట్ సింగిల్ మీసాల పిల్ల' 50

## 50 మిలియన్ల వ్యూస్ దాటిన 'మీసాల పిల్ల' పాట

మిలియన్ల వ్యూస్ క్రాస్ చేసి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తెలుగు సినిమా మ్యూజిక్ కి కొత్త బెంచ్‌మార్క్‌ను నెలకొల్పింది. హిట్‌మెషీన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం పండగ వాతావరణంలో, కుటుంబమంతా కలిసి చూసేలా ఉండే ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటోంది. ఆ వైబ్‌ను అద్భుతంగా అందించిన సాంగ్ మీసాల పిల్ల. భీమ్స్ సిసిరోలియో అందించిన ఎనర్జిటిక్ ట్యూన్, బీట్‌తో ఈ పాట దేశవ్యాప్తంగా చార్ట్‌బస్టర్‌గా మారింది. తెలుగు పాటగా ఇంత పెద్ద స్థాయిలో పాన్‌ఇండియా రీచ్ సాధించడం అరుదైన ఘనత. మెగా స్టార్ చిరంజీవి తన సిగ్నేచర్ చార్మ్, ఎక్స్‌ప్రెషన్స్, ఎనర్జిటిక్ డాన్స్ మూవ్స్‌తో అభిమానుల హృదయాలను గెలుచుకున్నారు. ముఖ్యంగా నయనతారతో ఉన్న సీన్స్‌లో ఆయన టైమింగ్ ఫ్యాన్స్‌ని అలరించింది. ఉదిత్ నారాయణ్, శ్వేతా మోహన్ వోకల్స్ కట్టిపడేశాయి. ఆకట్టుకునే హుక్‌లైన్‌తో ఈ సాంగ్‌ను సోషల్ మీడియాలో వైరల్ సెన్సేషన్‌గా మార్చేశాయి. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, రీల్స్ ఎక్కడ చూసినా మీసాల పిల్ల ఫీవర్ కనిపిస్తోంది. అభిమానులు డాన్స్ చేస్తూ, రీమిక్స్‌లు చేస్తూ, తమ ప్రేమను అద్భుతంగా వ్యక్తపరుస్తున్నారు. ఈ పాటకు వస్తున్న అద్భుతమైన స్పందనతో సినిమాపై ఎక్స్‌పెక్టేషన్స్ ఆకాశాన్ని తాకుతున్నాయి. మిగతా సాంగ్స్‌పై కూడా భారీ ఆసక్తి నెలకొంది. సాహూ గారపాటి, సుష్మిత కొణిదెల సంయుక్తంగా షైన్ స్క్రీన్స్, గోల్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై నిర్మిస్తున్న మన శంకరవర ప్రసాద్ గారు 2026 సంక్రాంతికి గ్రాండ్‌గా విడుదల కానుంది.



## 'ఇరువురు భామల కౌగిలిలో' షూటింగ్ షురూ

దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు దర్శకత్వ పర్యవేక్షణలో అచ్యుత్ చౌదరి దర్శకత్వంలో దీపా ఆరట్స్ శ్రీనివాస గౌడ్ నిర్మాతగా ఎంతో అట్టహాసంగా అతిరథ మహారథుల సమక్షంలో హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో ప్రారంభమైన చిత్రం 'ఇరువురు భామల కౌగిలిలో'. పూజా కార్యక్రమాలతో షూటింగ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా దర్శకులు కె.రాఘవేంద్రరావు స్క్రిప్టును నటీనటులు, దర్శక, నిర్మాతలకు అందచేశారు. 'కమిటీ కుర్రాళ్లు' ఫేమ్ త్రినాద్ వర్మ హీరోగా, వైష్ణవి కొల్లూరు, మలినా హీరోయిన్లుగా అక్షర గౌడ కీలకపాత్రలో నటిస్తోన్న ఈ చిత్రంలో ఎంతోమంది ప్రముఖ నటులు నటించనున్నారు. చిత్ర ప్రారంభోత్సవం సందర్భంగా హీరో హీరోయిన్లపై నిహారికా కొణిదెల క్లాప్‌ని కొట్టగా ప్రముఖ దర్శకులు బి.గోపాల్ కెమెరా స్విచాన్ చేశారు. ఫస్ట్‌షాట్‌కి ప్రముఖ దర్శకులు ఎ కోదండరామిరెడ్డితో పాటు నిర్మాత, కెమెరామెన్ ఎస్ గోపాల్రెడ్డి గౌరవ దర్శకత్వం వహించారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ జరుపుకోనున్న ఈ చిత్ర ఓపెనింగ్కి 'కమిటీ కుర్రాళ్లు' దర్శకుడు యధు వంశీతో పాటు ఆ సినిమాలో నటించిన నటీనటులందరూ పాల్గొన్నారు. టిల్లు స్క్వేర్ దర్శకుడు మల్లిక్రామ్, దర్శకులు వర ముళ్లపూడి తదితరులు ఓపెనింగ్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## తిరువీర్, ఐశ్వర్య రాజేష్ జంటగా కొత్త చిత్రం

తిరువీర్ హీరోగా సంక్రాంతికి వస్తున్నాం విజయం తర్వాత ఐశ్వర్య రాజేష్ జంటగా కొత్త చిత్రాన్ని ప్రారంభించారు. ఈ చిత్రం భరత్ దర్శన్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి ప్రొడక్షన్ నంబర్ 2గా నిర్మిస్తున్నారు. తమ ఫస్ట్ ప్రొడక్షన్ శివమ్ భజేతో ప్రేక్షకులని అలరించిన గంగాఎంటర్టైన్మెంట్స్, మరో ఎక్సయిటింగ్ కథతో వస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమం హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. ప్రేక్షకులకు వైవిధ్యమైన కథలతో అలరించే తిరువీర్, మసూద నుంచి ప్రీ వెడ్డింగ్ షో వరకు డిఫరెంట్ జానర్లలో ఆకట్టుకున్నారు. ఈ కొత్త సినిమా హిలేరియస్ ఎంటర్టైనర్‌గా రూపుదిద్దుకుంటోంది. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వబోతోంది. ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం సినిమాకి పని చేస్తోంది.



రజాకార్, పొలిమేర చిత్రాలకు సినిమాటోగ్రఫీ చేసిన సి.హెచ్. కుషేందర్ ఈ చిత్రానికి కెమెరామ్యాన్. ఎం.ఎం. కీరవాణి శిష్యుడు భరత్ మంచిరాజు సంగీతం సమకూరుస్తారు. బలగం ఫేం తిరుమల ఎం. తిరుపతి ఆర్ట్ డైరెక్టర్, క చిత్రానికి ఎడిటింగ్ చేసిన శ్రీ వరప్రసాద్ ఎడిటర్. స్వయంభు చిత్రానికి పని చేస్తున్న అను రెడ్డి అక్కటి ఈ చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్. పాపులర్ లిరిక్ రైటర్ పూర్ణచారి ఈ చిత్రంలోని పాటలు రాస్తున్నారు. ఈ నెల 19వ తేదీ నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. సినిమా తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో ఒకే సారి విడుదల కానుంది.

## వనజీవి రామయ్యగా బ్రహ్మాజీ



పద్మశ్రీ వనజీవి రామయ్య జీవిత చరిత్ర ఆధారంగా ఓ సినిమా రాబోతోంది. ఈ చలన చిత్ర ప్రారంభోత్సవానికి హాజరుకావాలని కోరుతూ చిత్ర బృందం ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనమండలి సభ్యులు జూపూడి ప్రభాకర రావును హైదరాబాదులోని ఆయన నివాసంలో కలసి ఆహ్వానించారు. చిత్ర దర్శకుడు వేముగంటి, ఖమ్మం కు చెందిన ప్రముఖ సంగీత దర్శకుడు బల్లేపల్లి మోహన్ జూపూడిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. బ్రహ్మాజీ ప్రధాన పాత్రలో రూపొందనున్న ఈ చిత్రం షూటింగ్ ప్రారంభ వేడుక ఈనెల 21న ఖమ్మం జిల్లా బల్లేపల్లిలోని నేచర్ ర్యాలీలో జరుగుతుందని సంగీత దర్శకుడు బల్లేపల్లి మోహన్ తెలిపారు. వనజీవి రామయ్య జీవిత చరిత్రను భావితరాలకు స్ఫూర్తి నింపేలా చలనచిత్రం ఉండాలని ఈ సందర్భంగా జూపూడి ప్రభాకర రావు పేర్కొన్నారు. ఈ సినిమాకు సంబధించిన ఇతర నటీనటులు, సాంకేతిక వివరాలు త్వరలోనే వెల్లడించనున్నారు.

## పహల్గామ్‌లో 'అనుమాన పక్షి' కీలక షెడ్యూల్ పూర్తి



రాగ్ మయూర్ హీరోగా, డిజే టిల్లు ఫేమ్ విమల్ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలకా ప్రొడక్షన్స్ పై రాజీవ్ చిలకా, రాజేష్ జగ్తియాని, హిరాచంద్ దండ నిర్మిస్తున్నారు. భరత్ లక్ష్మీ పతి సహనిర్మాత. సినిమా షూటింగ్ వేగంగా సాగుతోంది. తాజాగా కశ్మీర్‌లోని పహల్గామ్, శ్రీనగర్ ప్రాంతాల్లో కీలకమైన షెడ్యూల్‌ను పూర్తి చేశారు. ఈ ఏడాది ప్రారంభంలో అక్కడ జరిగిన దుర్ఘటన తర్వాత మళ్లీ పహల్గామ్‌లో షూట్ చేసిన తొలి సినిమా ఇది. సీఆర్పీఎఫ్ మార్గదర్శకత్వంలో, అన్ని భద్రతా నియమాలు పాటిస్తూ 20 రోజుల పాటు ఇంటెన్స్ షెడ్యూల్ షూట్ చేశారు. ఈ షెడ్యూల్‌తో సినిమాకి దాదాపు 80 శాతం షూటింగ్ పూర్తయింది. నవంబర్ చివర్లో తదుపరి షెడ్యూల్‌ను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇటివలే విడుదలైన టైటిల్, ఫస్ట్ లుక్ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించగా, సునీల్ కుమార్ నామా సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. ప్రిన్స్ సెసిల్, అనన్య, చారిత్ కీలక పాత్రల్లో కనిపించగా, బ్రహ్మాజీ, అజయ్, సీనియర్ నటి రాశి యూనిక్ రోల్స్‌లో కనిపించనున్నారు. విభిన్న కథతో, వినోదం, భావోద్వేగాల మేళవింపుతో తెరకెక్కుతున్న అనుమాన పక్షి త్వరలో థియేటర్లలోకి రానుంది.

## 'మా' సభ్యులకు హెల్త్ చెకప్

కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 'మా' సభ్యుల కోసం విష్ణు మంచు హెల్త్ క్యాంప్ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'మా' ప్రెసిడెంట్ విష్ణు మంచు, 'మా' ట్రెజరర్ శివ బాలాజీ, రాజీవ్ కనకాల పాల్గొన్నారు. హాస్పిటల్ తరుపున కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ సీఓఓ సుధాకర్ జాదవ్, సీనియర్ కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ డా.నవ వికాస్ జుకంటి, కన్సల్టెంట్ వాస్క్యులర్, ఎండోవాస్క్యులర్, డయాబెటిక్ ఫుడ్ స్పెషలిస్ట్ డా.నిషాన్ రెడ్డి, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, హెపటాలజిస్ట్, డా.ముదుమల ఐసాక్ అభిలాష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణు మంచు మాట్లాడుతూ "'మా' సభ్యుల ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న హెల్త్ క్యాంప్ సభ్యుల ఆరోగ్యమే మాకు ప్రాధాన్యం. అందుకే ఇలా నిత్యం హెల్త్ క్యాంప్లను నిర్వహిస్తున్నాం. మాకు సహకరించిన కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ బృందానికి ధన్యవాదాలు' అని అన్నారు. శివ బాలాజీ మాట్లాడుతూ'మా' సభ్యుల ఆరోగ్యం, సంక్షేమం కోసం మేం ఎల్లప్పుడూ ముందుంటాం. అందుకే ఇలా నిత్యం హెల్త్ క్యాంప్ని నిర్వహిస్తూ ఉన్నాం. వీటికి సహకరిస్తున్న ప్రతీ ఒక్కరికీ థాంక్స్' అని అన్నారు. రాజీవ్ కనకాల మాట్లాడుతూ ఆర్టిస్టులు ఎక్కువగా సమయం అనేది పట్టించుకోకుండా పని చేస్తుంటారు. 'మా' సభ్యుల కోసం ఇలా నిత్యం హెల్త్ క్యాంప్ లు నిర్వహిస్తుండటం ఆనందంగా ఉంది' అని అన్నారు.





## కప్పిపుచ్చుకునేందుకే 'సర్'

(మొదటి పేజీ తరువాయి)

తాము క్రమంగా అందిస్తామన్నారు. అయితే తమ సమస్య ప్రధానంగా ఓటు దొంగతనమేనన్నారు. దానికి తోడు ఇపు సర్ కూడా చేరిందన్నారు. ఓటు దొంగతనాన్ని కప్పిపుచ్చుకునేందుకే సర్‌ను చేపడుతున్నారని రాహుల్‌గాంధీ ఆరోపించారు. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని వివరాలను వెల్లడిస్తారా అని విలేకరులు ప్రశ్నించగా, రాహుల్‌గాంధీ స్పందిస్తూ తమ వద్ద చాలా భిన్నమైన, వివరణాత్మక సమాచార ఉందని, తాము వాటిని అవసరమైన సమయంలో విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం కొద్ది మేరకు మాత్రమే బయట పెట్టామని చెప్పారు. కానీ ఇప్పుడు ప్రజాస్వామ్యం, అంబేద్కర్ రాజ్యాంగంపై దాడి జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. (ప్రధానమంత్రి) మోదీ జీ, (కేంద్ర హోంమంత్రి) అమిత్ షా జీ, (ప్రధాన ఎన్నికల కమిషనర్) జ్ఞానేష్ జీ ఉమ్మడి భాగస్వామ్యాన్ని ఏర్పరచుకోవడం ద్వారా దీన్ని నేరుగా చేస్తున్నారని, దీని కారణంగా దేశం చాలా ఆవేదనకు గురవుతోందన్నారు. భారతమాతకు హాని జరుగుతోంది, భారతమాతకు నష్టం జరుగుతోందిదని ఆరోపించారు. మరో ప్రశ్నకు సమాధానంగా రాహుల్ గాంధీ స్పందిస్తూ మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల శిక్షణపై తమకు మంచి స్పందన వచ్చిందన్నారు. సర్ కోస్ పోల్ అథారిటీ 5.3 లక్షలకు పైగా బూత్‌స్థాయి అధికారులు (బిఎల్‌ఒలు), 10,448 మంది ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, 321 జిల్లా ఎన్నికల అధికారులను రంగంలోకి దింపింది. అంతేకాకుండా, రాజకీయ పార్టీల 7.64 లక్షల బూత్‌స్థాయి ఏజెంట్లు (బిఎల్‌ఏలు) కూడా బిఎల్‌ఒలకు సహాయం చేయడానికి రంగంలోకి దిగారు. డిసెంబర్ 9న ఇసి ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయనుంది. ఫిబ్రవరి 7న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తుంది. గత ఎన్నికలలో రాహుల్‌గాంధీ అక్రమాలను ఎత్తి చూపారని, అయితే ఓటర్ల జాబితాను శుభ్రపరిచే లక్ష్యంతో ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణను వ్యతిరేకిస్తున్నారని ఎన్నికల కమిషన్ అధికారులు ఇటీవల తెలిపారు. 2024 హర్యానా అసెంబ్లీ ఎన్నికలు దొంగిలించబడ్డాయని గాంధీ పేర్కొన్నారు. 25లక్షల ఓట్లు నకిలీవని, ఎన్నికల కమిషన్ బిజెపి విజయాన్ని నిర్ధారించుకోవడానికి కుట్ర పన్నిందని ఆయన ఓటర్ల జాబితా డేటాను ఉదహరించారు.

## భారీ ఉగ్రదాడులకు కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

నూనెను స్వాధీనం చేసుకుంది. నిందితుల్లో ఒకడైన అహ్మద్ మొహియుద్దీన్ హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి అని గుజరాత్ డిఐజి సునీల్ జోషి తెలిపారు. మరో ఇద్దరు నిందితులు ఆజాద్ సులేమాన్ షేక్, మొహమ్మద్ సుహెల్ సలీం ఖాన్ ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందినవారని పేర్కొన్నారు. అహ్మద్ మొహియుద్దీన్ ఇప్పటికే పలు ఉగ్రకార్యకలాపాల్లో పాల్గొన్నాడని తెలిపారు. అహ్మదాబాద్‌కు అతడు వస్తున్నట్టు సమాచారం అందడంతో నిఘా పెట్టారు. అదాలజ్ టోల్ ప్లాజా సమీపంలో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. 36 ఏళ్ల వయసున్నఅహ్మద్ మొహియుద్దీన్ చైనాలో ఎంబిబిఎస్ చేసినట్టు పోలీసులు తెలిపారు. దేశంలో పెద్ద ఎత్తున నష్టం కలిగించే ఉగ్రదాడి చేయాలని అహ్మద్ మొహియుద్దీన్ భావిస్తున్నట్టు పోలీసులు చెప్పారు. పలువురు విదేశీయులతోనూ టచ్‌లో ఉన్నట్టు గుర్తించారు. టెలిగ్రామ్ ద్వారా ఓ ఉగ్రసంస్థతో అతడు సంబంధాలు కొనసాగిస్తున్నాడు. ఆముదం గింజలను ప్రాసెస్ చేసిన తర్వాత మిగిలిపోయిన వ్యర్థ పదార్థాల నుంచి రైసిన్ అనే విషాన్ని తయారు చేస్తున్నట్టు గుర్తించారు.

### కశ్మీర్‌లోనూ వీరి కదలికలు నమోదు!

గుజరాత్‌లోని కాలోల్ నుంచి ఆయుధాలు తీసుకుని మరో ప్రాంతానికి వెళ్తుండగా అహ్మద్ మొహియుద్దీన్ చిక్కినట్టు పోలీసులు చెప్పారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మరో ఇద్దరు ఉగ్రవాదులను గుజరాత్‌లోని బనస్కాంతలో అరెస్టు చేశారు. ఉగ్రవాదానికి వీరు బాగా ప్రభావితమైనట్లు గుర్తించారు. వీరిద్దరు కూడా విదేశాల్లోని పలువురితో టచ్‌లో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఉగ్రదాడుల కోసం ఇప్పటికే ఢిల్లీ, అహ్మదాబాద్, లక్నోలో రెక్కీ నిర్వహించినట్లు తెలిపారు. కశ్మీర్‌లోనూ వీరి కదలికలు నమోదైనట్లు చెప్పారు. నిందితులతో సంబంధం ఉన్న వారిని సైతం గుజరాత్ ఎటిఎస్ విచారిస్తోంది. ఈ ఏడాది ప్రారంభంలో అల్ ఖైదా ఉగ్రసంస్థతో సంబంధం ఉన్న ఐదుగురిని గుజరాత్ ఎటిఎస్ అరెస్టు చేసింది. నిందితుల్లో బెంగళూరుకు చెందిన ఓ మహిళ సైతం ఉంది. ఆన్‌లైన్ వేదికగా ఆ మహిళ టెర్రర్ మాడ్యూల్‌ను నడుపుతున్నట్టు పోలీసులు గుర్తించారు. పాక్‌లోని ఉగ్ర సంస్థలతో సంబంధాలున్నట్టు తెలిపారు.

### నా కుమారుడి కంపెనీకి ప్రభుత్వ భూమి విక్రయంపై

## కొనసాగుతోన్న విచారణ

ప్రజలకు త్వరలోనే నిజం తెలుస్తుంది

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్‌పవార్

పుణే : ప్రభుత్వ భూమిని పుణేలోని తన కుమారుడి కంపెనీకి అక్రమ విక్రయం జరిపారన్న ఆరోపణపై విచారణ జరుగుతోందని, త్వరలోనే నిజం ప్రజలకు వెల్లడి కానున్నదని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్‌పవార్ అన్నారు. ఆదివారం ఆయన పుణే జిల్లాలోని బారామతి వద్ద విలేకరులతో మాట్లాడారు. తన దగ్గరి సహచరులు లేదా బంధువులు తన పేరుతో నిబంధనలు ఉల్లంఘిస్తూ ఏదైనా ప్రకటనలు చేస్తే సంబంధిత అధికారులు తప్పకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అజిత్‌పవార్ కుమారుడు పార్థ్ పవార్ భాగస్వామిగా ఉన్న కంపెనీకి పుణేలోని ఉన్నత స్థాయి ముంధ్వా ప్రాంతంలోని 40ఎకరాలను రూ.300 కోట్లకు అమ్మడంపై ప్రశ్నలు తలెత్తాయి. ఈ కేసులో రెండు ప్రాథమిక సమాచార నివేదికలు నమోదు చేయబడ్డాయి. అయితే పార్థ్ పవార్ పేరు లేదు. పుణే భూ ఒప్పందం కేసును చట్ట ప్రకారం తీసుకుంటామని, ఎవరినీ రక్షించే ప్రశ్నే ఉత్పన్నం కాదని శనివారం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. భూఒప్పందం అంశం గురించి ఆదివారం నాడు అజిత్ పవార్‌ను ప్రశ్నించగా 'నేను ఇప్పటికే నా వైఖరిని స్పష్టంచేశాను. గత కొద్ది రోజులుగా పలు సమస్యలు తలెత్తుతున్నాయి.

విచారణ ప్రారంభమైనది. ప్రజలకు నిజం త్వరలోనే తెలుసుంది. ఒక్క రూపాయి లావాదేవీ కూడా జరుగకుండా డాక్యుమెంట్ ఎలా రిజిస్టర్డ్ చేయబడిందనేది నాకు ఇప్పటికీ అర్థం కావడంలేదు. ఆ వ్యక్తి ఈ రిజిస్ట్రేషన్‌ను ఎందుకు చేశాడనే విషయం ఒక నెలలో మనకు తెలుస్తుంది' అని ఎన్‌సిపి నాయకుడు అజిత్ పవార్ చెప్పారు. ముఖ్యమంత్రి ఫడ్నవీస్ విచారణ కమిటీని నియమించారని అజిత్‌పవార్ వెల్లడించారు.

## కార్మికుల భారీ ప్రదర్శన

(మొదటి పేజీ తరువాయి)

పెనా (34) మాట్లాడుతూ, అన్యాయమైన పద్ధతులలో మాయోపాయ చర్యలతో కార్మికుల హక్కులు హరించేందుకు ఎత్తుగడ వేశారని వి మర్శించారు. ప్రభుత్వం కపటనాటకం ఆడుతోందని విమర్శించారు. దేశంలో కనీస వేతనాలు దారుణస్థాయికి పడిపోయాయన్నారు.ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు నినాదాలు చేశారు. కార్మికులను బెదిరించి వారి హక్కులను కాలరాసి యజమానులకు బానిసలుగా చేయాలని ప్రభు త్వం ప్రయత్నం చేస్తోందని కార్మికులు విమర్శించారు. ప్రతిపాదిత చట్టాలను తక్షణం ఉపసంహరించాలని వారు డిమాండ్ చేశారు. పోర్చుగల్ మతఛాంధసవాద ప్రభుత్వం కార్మికులను అణచివేసే చర్యలకు పాల్పడుతోందని వారు విమర్శించారు. ఉద్యోగులను సులభంగా తొలగించే అవకాశం ఇవ్వడం, ఔట్‌సోర్సింగ్‌కు వీలు కల్పించడం, గర్భస్రావాలతో బాధపడే మహిళలకు అవసరమైన సెలవుల సంఖ్యను తగ్గించడం, కొన్ని కారుణ్య సెలవులు, ఇతర పథకాలను కత్తిరించడంకోసం ఈ కొత్త సవరణలను, చట్టాన్ని తీసుకువస్తున్నారు. పశ్చిమ యూరప్‌తో పేదరికంలో మగ్గుతున్న పోర్చుగల్‌లో ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచేందుకు, ఉత్పాదకతను పెంచేందుకు వీలుగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం వాదిస్తోంది. కానీ దేశంలో ఇంతవరకూ ఏ ప్రభుత్వమూ ఇంత దారుణంగా కార్మికులను అణచివేయాలని ప్రయత్నం చేయలేదని, సంస్కరణల పేరుతో దేశ చరిత్రలో కార్మికులను అణచివేసేందుకు తీసుకున్న అతిపెద్ద చర్యలుగా సిజిపిటి నాయకులు విమర్శించారు. ఈనెల 11న సార్వత్రిక సమ్మెకు నాయకులు పిలుపు ఇచ్చారు.

## సైబర్ నేరగాళ్ల అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

తేలింది. నిందితుల్లో బ్యాంక్ అధికారులు సైతం ఉండడం గమనార్హం.అరెస్టు అయిన వారిలో 74 మంది పురుషులు, ఏడుగురు మహిళలు ఉన్నారు . సైబర్ నేరగాళ్ల ఏరివేత ఆపరేషన్ నిర్వహించడం దేశ చరిత్రలో ఇదే మొదటి సారి కావడం గమనార్హం. కేరళలో 28 మంది, మహారాష్ట్రలో 23 మంది, ఆంధ్రప్రదేశ్‌లో 10 మంది, తమిళనాడులో ఏడుగురు, కర్ణాటకలో 13 మందిని అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో 17 మంది ఏజెంట్లు, 1బ్యాంకుల నుంచి నేరుగా నేరాల్లో పాల్గొన్నవారు 11 మంది, మ్యూల్ అకౌంట్ హోల్డర్లు 53 మంది ఉన్నారు. ఈ 53 మంది తమ అకౌంట్‌లోకి డబ్బులు పడిన వెంటనే నేరగాళ్లకు డ్రా చేసి ఇస్తారు. ఇందుకు ఈ మ్యూల్ అకౌంట్ హోల్డర్లు ఐదు శాతం కమీషన్ తీసుకుంటారు.వీరి నుంచి 84 మొబైల్ ఫోన్లు, 101 సిమ్‌కార్డులు, 89 బ్యాంక్ పాస్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో అరెస్టు చేసిన నిందితుల్లో విభిన్న వృత్తుల నుంచి వచ్చిన వారు ఉన్నారు. వీరిలో ఐడిఎఫ్‌సి బ్యాంక్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న నిందితుడు 106 కేసులలో సంబంధాలు కలిగి ఉన్నాడు. ఫెడరల్ బ్యాంక్ ఉద్యోగి, బంధన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్, కంప్యూటర్ ఆపరేటర్ డిప్లమా హోల్డర్‌లు 96 కేసుల్లో, చెన్నై కిల్‌పోక్ ఆడిట్ ఆఫీస్‌లో అకౌంటెంట్ 31 కేసుల్లో, బిబిఎ గ్రాడ్యుయేట్ 45 కేసులలో నిందితులుగా దర్యాప్తులే తేలింది. తన కార్పొరేట్ అకౌంట్‌ను మోసపూరిత లావాదేవీలకు ఉపగించిన ఒక ఎంఎన్‌సి ఉద్యోగి సైతం అరెస్టు అయిన వారిలో ఉన్నాడు. పట్టుబడిన 81 మంది నిందితులు తెలంగాణలోని ఏడు సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లలో 41 నేరాలకు పాల్పడ్డారు. ఈ ఆపరేషన్‌లో ఎస్‌పి బిక్షంరెడ్డి, డిఎస్‌పిలు కెవి సూర్యప్రకాశ్, ఎస్‌వి హరికృష్ణ, కెవిఎం ప్రసాద్, వై.వెంకటేశ్వరరావు, కె.గిరికుమార్, వేణుగోపాలరెడ్డి, బి.అశోక్, ఏ.సుభాష్ చంద్రబోస్, నందిరామ్‌లు పాల్గొన్నారు.

### అప్రమత్తంగా ఉండాలి: టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్

ప్రస్తుతం వెలుగులోకి వస్తున్న కొత్త రకాల సైబర్ మోసాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రేడింగ్, డిజిటల్ అరెస్టు మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. అధిక రాబడి ఇస్తామంటూ చెప్పే ఆన్‌లైన్ స్టాక్, ఫారెక్స్, క్రిప్టో ట్రేడింగ్ యాప్స్, టాస్క్‌బేస్ట్ ఇన్‌కమ్ ఆఫర్లను నమ్మవద్దు. పోలీసు, కస్టమ్స్, కూరియర్ అధికారులు ఎప్పుడు ఆన్‌లైన్‌లో డబ్బు ఆడగరు, వీడియో వెరిఫికేషన్ కోరరు. ఇలాంటి బెదిరింపులు ఎదురైతే వెంటనే ఫిర్యాదు చేయండి. వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు, ఒటిపిలు, క్యూఆర్ కోడ్‌లు అన్యులతో పంచుకోవద్దు. అపరిచిత ఖాతాలకు డబ్బులు పంపవద్దు. సోషల్ మీడియా లింకులను నమ్మవద్దు. అనుమానాస్పదమనిపిస్తే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలి.

## సంఘ్ రక్షణకోసం చెప్పే వక్రభాష్యం

(మొదటి పేజీ తరువాయి)

గుర్తింపు ఉన్నట్టేనని, హిందూ ధర్మానికి గుర్తింపు లేదని, అదేవిధంగా ఆర్‌ఎస్‌ఎస్‌కు కూడా గుర్తింపు అవసరం లేదని మోహన్ భాగవత్ చెప్పడాన్ని డి.రాజా తీవ్రంగా ఖండించారు. సంఘ్ మాటలు మారాయని, కానీ అది ఇక ఎవ్వరినీ మోసం చేయలేదని, దాని మౌలిక లక్షణం, ఆలోచనల్లో ఎలాంటి మార్పులూ ఉండవని, చరిత్రను పునర్లిఖించేందుకు, చట్టాలను రద్దుచేసేందుకు, భారత్‌ను ఒక మతానికి అనుకూలంగా పునర్నిర్మించేందుకు చేస్తున్న సంఘ్ ఆలోచనల్లో ఎలాంటి మార్పు లేదని విమర్శించారు. భారత కమ్యూనిస్టుపార్టీ కూడా 1925 లోనే ఆవిర్భవించిందని, అనేకసార్లు నిషేధానికి గురైందని, కానీ భారత కమ్యూనిస్టు పార్టీ దేశంలో రిజిస్ట్రేషన్ ఉన్న పార్టీ అనీ, భారత రాజ్యాంగానికి జవాబుదారీ వహిస్తుందని, బాహాటంగా, ఎలాంటి దాపరికాలు లేకుండా తన కార్యకలాపాలను నిర్వహిస్తుందని, అనేక ఇతర సంస్థల తరహాలోనే భారత కమ్యూనిస్టుపార్టీ కూడా వలసవాద పరిపాలనను సవాలు చేసిందని పేర్కొన్నారు. కానీ ఆర్‌ఎస్‌ఎస్ మాత్రం ఆనాడు రహస్య కార్యకలాపాలు నిర్వహించే మార్గం ఎన్నుకుందని, ఈనాటికీ మనుగడ సాగిస్తోందని ప్రకటనలో పేర్కొన్నారు. 'నిషేధానికి గురికావడమే గుర్తింపునకు ఒక అర్హతగా చెప్పుకుంటే అంతకంటే హాస్యాస్పదమైన విషయం మరొకటి ఉండదు, గుర్తింపు లేకుండా రహస్యంగా పనిచేస్తున్న సంస్థలు ఎన్నో ఉన్నాయి, వాటిల్లో కొన్ని సంస్థలు ఉగ్రవాద సంస్థలుగా ముద్ర వేసుకున్నాయి, అలాంటి సంస్థలు నిషేధానికి గురయ్యాయి, మరి ఆర్‌ఎస్‌ఎస్ కూడా అలా నిషేధానికి గురైన జాబితా సంస్థల్లో ఉందని భావిస్తోందా?'' అని డి.రాజా ప్రశ్నించారు. 'గుర్తింపు పొందకుండా, రిజిస్ట్రేషన్ చేయించుకోవడాన్ని నిరాకరించడం దేశభక్తి అనిపించుకోదు, అది కుంటిసాకు, ఎగవేసి తప్పించుకునే మార్గం. రిజిస్ట్రేషన్ పొందితే ఆర్‌ఎస్‌ఎస్ ప్రజలకు జవాబుదారీగా ఉంటుంది, న్యాయపరమైన బాధ్యతతో వ్యవహరిస్తుంది, పన్నులు చెల్లించి బాధ్యతగా ఉంటుంది, చివరకు ఆర్‌ఎస్‌ఎస్ కేంద్ర కార్యాలయం కూడా దానిపేరుతో లేదు. ఆర్‌ఎస్‌ఎస్‌ను హిందూధర్మంతో సమానంగా చూపించి పోల్చుకోవడం మరో మోసమో, మాయాజాలమో గారడీయో అవుతుంది. మన భారతదేశంలో ఏ మతానికి రిజిస్ట్రేషన్ అవసరం లేదు, కానీ ఆర్‌ఎస్‌ఎస్ హిందువులకు ప్రాతినిధ్యం వహించడంలేదు, అది ఒక సిద్ధాంతానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. కులం అనేది కేవలం చెప్పుకోవడానికి మనుషుల ఆలోచనల్లోనే ఉంది, దానిని నిర్మూలించడంకోసం మనదేశంలో గురునానక్, కబీర్ దగ్గర నుండి పూలే వరకూ ఎంతోమంది సంస్కర్తలు పోరాటం చేశారు, పెరియార్, అంబేద్కర్‌వంటి సంస్కర్తలు పోరాటం చేశారు, కులం గురించి చెప్పడం సంస్కరణలకోసం పోరాడిన ఈ సంస్కర్తలను అవమానించినట్లే. కులం అనేది చాలా స్పష్టంగా మనుషుల ఆలోచనల్లో మాత్రమే ఉంది, ఈ కుల వ్యవస్థను ఆర్‌ఎస్‌ఎస్ సమర్థిస్తోంది, భారతదేశాన్ని ఒక వర్గానికి అనుకూలంగా పునర్నిర్మించేందుకు సంఘ్ చేస్తున్న ప్రయత్నాలు మారలేదు, దాని మాటలు మాత్రమే మారాయి'' అని డి.రాజా తన ప్రకటనలో విమర్శించారు.

### ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తుల సంఘంగా గుర్తింపు పొందింది: భాగవత్

ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాలంటూ కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలపై మోహన్ భాగవత్ స్పందిస్తూ, ఆదాయ పన్నుశాఖ, న్యాయస్థానాలు తమ సంఘ్‌ను వ్యక్తుల సమూహంగా గుర్తించి మినహాయింపు ఇచ్చాయన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎలాంటి గుర్తింపూ అవసరం లేదని, హిందూ ధర్మానికి దేశంలో రిజిస్ట్రేషన్ లేదని, అదేవిధంగా ఆర్‌ఎస్‌ఎస్‌కు కూడా రిజిస్ట్రేషన్ అవసరం లేదన్నారు. 'ఆర్‌ఎస్‌ఎస్ 1925లో ఆవిర్భవించిందని, మరి అలాంటప్పుడు బ్రిటిష్ ప్రభుత్వంతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మీరు కోరుకుంటున్నారా?' అని భాగవత్ ప్రశ్నించారు. ఆర్‌ఎస్‌ఎస్ బెంగళూరులో నిర్వహించిన ఒక సమావేశంలో అడిగిన ప్రశ్నకు ఆదివారం భాగవత్ పైవిధంగా సమాధానంచెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా, తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్‌ను భారత ప్రభుత్వం ఒత్తిడి చేయలేదని అన్నారు. తమను (ఆర్‌ఎస్‌ఎస్‌ను) వ్యక్తుల సమూహంగా చట్టబద్ధమైన వ్యవస్థలు గుర్తించాయని, తమ సంస్థకు గుర్తింపు అవసరం లేదన్నారు. 'మా సంస్థను మూడుసార్లు నిషేధించారు, అంటే దాని అర్థం ప్రభుత్వం మాకు గుర్తింపు ఇచ్చినట్టే కదా? రాజకీయపార్టీలు ఆర్‌ఎస్‌ఎస్‌కు అసలు గుర్తింపే లేదని వాదిస్తున్నాయి, మరి గుర్తింపులేని సంస్థను ప్రభుత్వాలు ఆనాడు ఎలా నిషేధించాయి?'అని భాగవత్ ప్రశ్నించారు. మనదేశంలో రిజిస్ట్రేషన్ లేనివి ఎన్నో ఉన్నాయి, అందులో హిందూ ధర్మం కూడా ఒకటి, అదేవిధంగా హిందూ ధర్మాన్ని పరిరక్షించే ఆర్‌ఎస్‌ఎస్‌కు కూడా రిజిస్ట్రేషన్ అవసరం లేదు' అన్నారు. మేం ఎల్లప్పుడూ దేశ త్రివర్ణ పతాకాన్ని గౌరవిస్తాం అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com